www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 19-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 142

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 11.55 తదుపరి పాడ్యమి; నక్షత్రం: శ్రవణం ఉ. 8.10, ధనిష్ఠ తె. 5.54 వరకు వర్జ్యం: ఉ. 11.45-1.12; దుర్ముహూర్తం: మ. 12.43-1.33, మ. 3.13-4.04; అమృతఘడియలు: రా. 8.23-9.50; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.34

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



వజ్రాభరణాల వేడుక!
క్యారెట్‌కు
రూ.5000 తగ్గింపు
రూ.62000 రూ.57000
ముఖ్యమైన విషయం! దయచేసి ఆలోచించండి!
సరైన క్లారిటీ, కలర్ మరియు తగిన సర్టిఫికెట్ కలిగిన వజ్రాభరణం మార్కెట్‌లోనే
అత్యంత తక్కువ ధరకు లభించేటప్పుడు, ఎందుకు ఎక్కువ ధర వెచ్చించి కొనాలి?
ఉదాహరణకు చెప్పాలంటే, మీ లలితా జ్యువెల్లరిలో ఓ డైమెండ్ నెక్లెస్ కొంటే,
తద్వారా మీరు ఆదా చేసిన డబ్బులతో డైమండ్ చెవిపోగులను ఉచితంగా కొనగలరు.
ఇతర షోరూం మాదిరిగా తరుగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు.
V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!
నాణ్యత సర్టిఫికెట్
షోరూంవాళ్లు సొంతంగా తయారు చేసే
'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను ఇవ్వడం లేదు.
ప్రభుత్వ గుర్తింపు పొందిన అంతర్జాతీయస్థాయి
నాణ్యత సర్టిఫికెట్ ఇస్తున్నాం.
కలర్ & క్లారిటీ
E-F కలర్‌గ్రేడ్ మరియు VVS 1 & VVS క్లారిటీ
వజ్రాభరణాలనే విక్రయిస్తున్నాం.
G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన
ఆభరణాలను విక్రయించడం లేదు.
ఎక్స్ఛేంజ్ పాలసి
వజ్రాభరణాలకు మార్పిడికైతే
100% బైబ్యాక్,
బంగారు నగలుగా అయితే 90%,
నగదుగా 85% బైబ్యాక్.
FREE & FLEXI
11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!
బంగారం ధర పెరిగినా మీకే లాభం,
తగ్గినా మీకే లాభం
100% తరుగు లేదు
అన్ని బంగారు నగలు, అన్‌కట్ వజ్రాభరణాలు
మరియు వెండి వస్తువులకు వర్తిస్తుంది.
చిన్న వాయిదాలు:
రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500 / రూ.5000
రూ.10000 / రూ.15000 / రూ.20000 / రూ.25000
JEWELLERY EXCHANGE PLAN
అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్
ఖర్చు లేకుండా,
ముందుగా పాత నగలు ఇచ్చి, కొత్త నగలు తీసుకోవచ్చు!
100% V.A. లేదు!
5వ నెల ఆఖరు నుంచి, కొనే నగను బట్టి, తరుగు (V.A.) లేకుండా నగలు కొనొచ్చు.
11 నెలల తర్వాత నగలు తీసుకొంటే ఏ బంగారు నగ అయినా కానీ, తరుగు ఛార్జీలు ఇవ్వాల్సిన పనిలేదు.
కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.
పాత నగలతో మాత్రమే కాదు, నగదు చెల్లించి కూడా ఈ స్కీమ్‌లో చేరొచ్చు!
కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.
99%
వెండి వస్తువులకు తరుగు లేదు!
Lalithaa
www.lalithaajewellery.com
లలితా జ్యువెల్లరి మార్ట్ లిమిటెడ్
Customer Care
90 99 999 916
BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు!
సుచిత్రా సర్కిల్: 113, ఏ సర్కిల్, గ్రీన్ పార్క్ అవెన్యూ, సుచిత్రా రోడ్. ఫోన్: 040 - 2703 5555 / 2784 5555, 8925848140 / 8925848141.
సోమాజిగూడ: SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040-6748 6677.
దిల్‌సుఖ్‌నగర్: అర్చన కాంప్లెక్స్,కమలా నగర్ రోడ్, 1558 మెట్రో పిల్లర్‌కు ఎదురుగా, చైతన్యపురి సర్కిల్. ఫోన్: 9133832704 / 040-29334505.
కూకట్‌పల్లి: 2-22-298, PNR ఎంపైర్, కళామందిర్ పక్కన, KPHB మెట్రో స్టేషన్ సమీపం. ఫోన్: 040-2384 2277 / 2200 / 2299.
చందానగర్: 2-132, ఇన్ఫినిటి మాల్. ఫోన్: 040 - 2934350 / 7799775815.
నిజామాబాద్- ద్వారకా నగర్, గోపాల్‌బాగ్, హైదరాబాద్ రోడ్. ఫోన్: 08462-233555.
వైజాగ్ • గోపాలపట్నం • విజయవాడ • విజయవాడ • విజయనగరం • రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి • అనంతపురం • గుంటూరు • శ్రీకాకుళం • ఒంగోలు • నరసారావుపేట
చిత్తూరు • అనకాపల్లి • సూళ్లూరుపేట • గూడూరు • నెల్లూరు • కర్నూలు • అమలాపురం • తమిళనాడు • పుదుచ్చేరి • కర్ణాటక

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


రవీంద్ర భారతిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి కార్యక్రమంలో భట్టి, పొన్నం

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

హైదరాబాద్‌లో పాపన్న విగ్రహం: భట్టి విక్రమార్క

సర్వాయిపేట అభివృద్ధికి రూ. 4.7కోట్లు మంజూరు

9

సోమవారం | 19-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 142

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 11.55 తదుపరి పాడ్యమి; నక్షత్రం: శ్రవణం ఉ. 8.10, ధనిష్ఠ తె. 5.54 వరకు వర్జ్యం: ఉ. 11.45-1.12; దుర్ముహూర్తం: మ. 12.43-1.33, మ. 3.13-4.04; అమృతఘడియలు: రా. 8.23-9.50; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బడా భవనాలపై బుల్డోజర్

హైదరాబాద్‌లో హైడ్రా హల్‌చల్

గండిపేట ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాల కూల్చివేత


గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న దృశ్యం

మొత్తం 20కి పైగా భవనాలు, ప్రహరీ గోడలు నేలమట్టం

కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రులు, వ్యాపారవేత్తలవి కూడా

అర్ధరాత్రి యంత్రాలు.. తెల్లవారుజామున రంగంలోకి

వ్యూహాత్మకంగా వ్యవహరించిన హైడ్రా అధికారులు

వాగ్వాదానికి దిగిన నిర్మాణదారులు అదుపులోకి!

భూములు అమ్మిన నాయకుల ఫోన్లు స్విచ్ఛాఫ్

ఒకటి రెండు రోజుల్లో మరిన్ని కూల్చివేతలు

హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై దృష్టి

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, మొయినాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెరువులను చెరబట్టి.. నిబంధనలను అతిక్రమించి కట్టిన నిర్మాణాల పైకి బుల్డోజర్ వెళ్తోంది..! ఎవరు అడ్డుపడినా ఆగకుండా దూకుడు పెంచుతోంది..! ఉల్లంఘనలపై ఉప్పందితే చాలు.. మొత్తం వివరాలను తవ్వి తీస్తోంది..! నిజానిజాలను నిర్ధారించుకుని నేరుగా రంగంలోకి దిగుతోంది..! హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అక్రమార్కుల్లో దడ పుట్టిస్తోంది. గండిపేట చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో వెలసిన నిర్మాణాలపై ఆదివారం కన్నెర్ర జేసింది. జంట నగరాలకు తాగునీటి వనరైన గండిపేట (ఉస్మాన్ సాగర్) పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లోని నిర్మాణాలను నేలమట్టం చేసింది. 20కి పైగా భవనాలు, ప్రహరీ గోడలను యంత్రాలతో కూల్చివేసింది. వీటిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు, కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రులకు చెందిన భవనాలు ఉండడం గమనార్హం. గండిపేట పరిసర ప్రాంతాల్లో ఈ స్థాయిలో కూల్చివేతలు ఇదే ప్రథమమని స్థానికులు చెబుతున్నారు. కాగా, గండిపేట మండలం ఖానాపూర్ గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లలో కొందరు భవనాలు నిర్మించారు. వాణిజ్య సముదాయాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, స్పా, ఇతర అవసరాలకు వాటిని వినియోగిస్తున్నారు. ఇవన్నీ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని.. ఓ సామాజిక కార్యకర్త నుంచి ఫిర్యాదు అందింది. దీనిపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవనాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని నిర్ధారించుకుని చర్యలకు శ్రీకారం చుట్టారు. వ్యూహాత్మకంగా శనివారం అర్ధరాత్రే యంత్రాలతో సహా సిబ్బందిని తరలించారు. ఆదివారం తెల్లవారుజామునే కూల్చివేత మొదలుపెట్టారు. నార్సింగ్ పట్టణ ప్రణాళికా విభాగం, సాగునీటి, జల మండలి అధికారులు వీరి వెంట ఉన్నారు. గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్న మరిన్ని

మిగతా 9వ పేజీలో...



హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్, భట్టి, అభిషేక్ సింఘ్వీ, దీపాదాస్

'విభజన'లో చిక్కులు

పునర్విభజన చట్టం అమల్లో పలు రాజ్యాంగ, న్యాయపరమైన సమస్యలు

కేంద్రం పదేళ్లుగా చట్టాన్ని అమలు చేయడం లేదు

చట్టసభల్లో, కోర్టుల్లో గట్టిగా వాదించాల్సి ఉంది

అందుకే తెలంగాణ నుంచి రాజ్యసభకు సింఘ్వీ

ఆమోదించిన అధిష్ఠానానికి ధన్యవాదాలు

సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ నుంచి ఎంపికవడం గౌరవంగా భావిస్తున్నా: అభిషేక్ సింఘ్వీ

నేడు ఉదయం అసెంబ్లీలో నామినేషన్ దాఖలు

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పునర్విభజన చట్టం అమల్లో రాజ్యాంగపరంగా, న్యాయపరంగా అనేక చిక్కులు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ చట్టాన్ని కేంద్రం పదేళ్లుగా అమలు చేయడం లేదన్నారు. పునర్విభజన చట్టంలోని అంశాలపై చట్టసభలతో పాటు సుప్రీంకోర్టులోనూ బలమైన వాదనలు వినిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందుకే రాజ్యాంగ, న్యాయకోవిదుడైన అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కోరినట్లు రేవంత్ వెల్లడించారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం చట్టసభలు, న్యాయస్థానాల్లో సింఘ్వీ గట్టిగా వాదనలు వినిపిస్తారని ఆకాంక్షించారు. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ పేరును తాము ప్రతిపాదించిన

మిగతా 11వ పేజీలో...



రాజకీయాల్లో క్షత్రియులకు అవకాశం

క్షత్రియ భవన్‌కు భూమి కేటాయిస్తాం

క్షత్రియ సేవా సమితి అభినందన సభలో రేవంత్

తెలుగు సినిమాను విశ్వవ్యాప్తం చేశారంటూ హీరో ప్రభాస్‌పై ప్రశంసలు

11

క్షత్రియ సేవాసమితి అభినందన సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఆర్ఆర్ఆర్.. అవార్డ్ పాస్!

ఉత్తర భాగం రోడ్డు నిర్మాణంలో పూర్తయిన భూ సేకరణకు త్వరలో పరిహారం చెల్లింపు

గత మూడేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్లలో గరిష్ఠ విలువ ప్రాతిపదికగా ఖరారు

పట్టణ ప్రాంతాల్లో 2 రెట్లు.. గ్రామీణంలో 3 రెట్లు

నోటిఫికేషన్ విడుదలకు అధికారుల కసరత్తు

త్వరలో కేంద్రం నుంచి అటవీ అనుమతులు



హైదరాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత తొందరగా పట్టాలెక్కించేందుకు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి సేకరించిన భూములకు పరిహారం చెల్లింపుపై ఎన్‌హెచ్ఏఐ దృష్టి సారించింది. ఇప్పటికే కీలకమైన అటవీ అనుమతుల కోసం కేంద్రానికి దరఖాస్తు చేశారు. త్వరలోనే ఆమోదం రానున్నట్లు సమాచారం. అనంతరం పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ మధ్యలోనే.. సేకరించిన భూములకు చెల్లించాల్సిన పరిహారాన్ని ఖరారు చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. తద్వారా అటవీ, పర్యావరణ అనుమతులు రాగానే ఆలస్యం లేకుండా పరిహారం చెల్లించే అవకాశం ఉంటుందని, పనులు వేగంగా పూర్తవుతాయని భావిస్తున్నారు. ఉత్తర భాగం మార్గంలో తీసుకోనున్న అటవీ భూములకు ప్రత్యామ్నాయ భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో కేటాయించింది. ఈ మార్గం నిర్మాణానికి అవసరమైన దాంట్లో 95 శాతం భూసేకరణ పూర్తయింది. దీనివరకు పరిహారం చెల్లింపునకు అవసరమైన 3జీ అవార్డును విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఎన్‌హెచ్ఏఐ సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది.

గరిష్ఠ పరిహారం చెల్లించేలా..

రాష్ట్రానికి ఆర్ఆర్ఆర్ మంజూరైన తరువాత కొంతకాలానికి రాజకీయ చట్రంలో చిక్కుకుంది. భూ సేకరణ, రైతులకు చెల్లించే పరిహారంలో రాష్ట్ర వాటా జమ, యుటిలిటీస్ చార్జీల చెల్లింపు అంశాలతో ఏళ్ల తరబడి పనుల్లో జాప్యం జరిగింది. అయితే, ప్రభుత్వం మారాక డిసెంబరు నుంచి కదలిక

మిగతా 11వ పేజీలో...



రుణభారం.. సుదీర్ఘకాలం!

పెరుగుతున్న ప్రభుత్వ అప్పుల కాల పరిమితి

తెలంగాణ వచ్చిన కొత్తలో 6 నుంచి 8 ఏళ్లు.. ఇప్పుడు 19 ఏళ్లు!

రుణం చెల్లింపు వ్యవధి పెరిగితే వడ్డీ శాతాల్లో కాస్త తగ్గుదల

అందుకే దీర్ఘకాలిక అప్పులు తీసుకుంటున్న రాష్ట్ర సర్కార్లు

రాబోయే ప్రభుత్వాలకు భారంగా మారనున్న రుణాలు



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో తీసుకుంటున్న అప్పుల సగటు కాల పరిమితి(టర్మ్) నానాటికీ పెరిగిపోతోంది. గతంలో సగటు కాల పరిమితి 10-12 ఏళ్ల ఉండగా.. ఇప్పుడది 19 ఏళ్లకు పెరిగింది. ఫలితంగా కొత్తగా వచ్చే ప్రభుత్వాలపై ఆర్థిక భారం పడుతోంది. అప్పులకు అసలు, వడ్డీలు చెల్లించలేక, సంక్షేమ పథకాలకు నిధులను సర్దలేక సతమతమవుతున్నాయి. అధికారంలో ఉండే ఏ పార్టీ అయినా భవిష్యత్తు రుణ భారం గురించి ఆలోచించడం లేదన్న ఆరోపణలున్నాయి. తాము గట్టెక్కితే చాలన్న ధోరణిలో అప్పులు చేస్తూ పోతున్నాయి. ఒక్క తెలంగాణలోనే కాదు.. దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అందుకే అప్పుల విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంకు రాష్ట్రాలను అప్రమత్తం చేస్తూనే ఉన్నాయి. నగదు బదిలీ

మిగతా 9వ పేజీలో...

ఏసీపీ కళ్లెదుటే

గొంతు కోసుకుని..

బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

మంచిర్యాల ఎమ్మెల్యే ఆదేశాలతో అక్రమ కేసులు పెట్టారని ఆరోపణ

మంచిర్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు బనాయించి తనని వేధింపులకు గురి చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్.. ఏసీపీ కళ్లెదుటే ఆత్మహత్యాయత్నం చేశాడు. కత్తితో గొంతుకోసుకుని బలవన్మరణానికి యత్నించాడు. మంచిర్యాల జిల్లా నస్పూర్ మునిసిపాలిటీలోని 21వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నస్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని తీగల్‌పహాడ్ శివారు సర్వే నంబర్ 14లో నాలా కబ్జా చేశారనే ఫిర్యాదులు రావడంతో

మిగతా 9వ పేజీలో...



పబ్‌లు, బార్‌లలో ఎక్సైజ్

ఆకస్మిక దాడులు

హైదరాబాద్ పరిధిలో 25 బృందాలతో డ్రగ్ డిటెక్షన్ పరీక్షలు

12

ఇకపై వారాంతాల్లో తనిఖీలు



బీజేపీలోకి చంపయీ సోరెన్!

ఆరుగురు ఎమ్మెల్యేలతో ఢిల్లీకి ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి

10

కమలం అగ్రనేతలతో మంతనాలు

ఎక్స్ ఖాతాలో పార్టీ పేరు మాయం

తన ముందు 3 ప్రత్యామ్నాయాలు ఉన్నాయంటూ బహిరంగ లేఖ



ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

కోల్‌కతా హత్యాచారంపై సుప్రీంకోర్టు విచారణ

సుమోటోగా తీసుకున్న కోర్టు

రేపు సీజేఐ ధర్మాసనం ముందుకు

నిందితుడికి మానసిక పరీక్షలు

శాంతిభద్రతలపై ప్రతి 2 గంటలకు రాష్ట్రాలు నివేదిక పంపాలి: కేంద్రం

హడావుడిగా నా బిడ్డ అంత్యక్రియలు

దీనిపై అనుమానాలు ఉన్నాయి

న్యాయం జరిగేదాకా సాయం తీసుకోం

ట్రైనీ డాక్టర్ తండ్రి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: కోల్‌కతా హత్యాచారం ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై మంగళవారం విచారణ జరపనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వివరాలను వెల్లడించారు. 20న

మిగతా 10వ పేజీలో...

ఆకాశమంత ఎత్తు.. ఆరోగ్యం చిత్తు?

30 అంతస్తులకు మించిన భవనాల్లో ఉండేవారికి ఆరోగ్య సమస్యల ముప్పు!

శ్వాసకోశ సమస్యలతో, హృద్రోగాలతో బాధ పడేవారు జాగ్రత్తగా ఉండాలి

తరచూ కిందికి రాలేకపోవడం వల్ల జీవనశైలి జబ్బుల ప్రమాదం: వైద్యనిపుణులు



దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో ఆకాశ హర్మ్యాల సంఖ్య విస్తృతంగా పెరుగుతోంది! 30 అంతకు మించి అంతస్తుల భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది!! ఉదాహరణకు.. హైదరాబాద్‌లోనే 30 నుంచి 40 అంతస్తుల భవనాలు దాదాపు 100 దాకా పలు దశల్లో ఉన్నాయి. కొన్ని భవనాల నిర్మాణం ఇప్పటికే పూర్తికాగా.. కొన్ని నిర్మాణంలో.. మరికొన్ని ప్రణాళికల దశలో ఉన్నాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, రాజేంద్ర నగర్ సర్కిల్, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో.. 50 అంతస్తుల ప్రాజెక్టులు కూడా నిర్మాణంలో ఉన్నాయి. అలాంటివే మరో ఐదారు ప్రాజెక్టులు ప్రణాళికల దశలో ఉన్నాయి. అటు ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం ఊపందుకుంటే భవిష్యత్తులో అక్కడా భారీ ఆకాశహర్మ్యాలు వచ్చే అవకాశం ఉంది. విశాఖలోనూ ఇప్పుడిప్పుడే ఇలాంటి భవనాల నిర్మాణం మొదలైంది. హైరైజ్ బిల్డింగ్స్‌లో ఉండడం హోదాకు చిహ్నంగా భావిస్తున్న చాలా మంది.. వాటిలో పోటీపడి ఫ్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఇలా వెంచర్

మిగతా 12వ పేజీలో...



అమ్మ అంత్యక్రియలకు

కూతురి భిక్షాటన

నిర్మల్ జిల్లాలో ఒంటరి మహిళ ఆత్మహత్య

అంతిమ సంస్కారాల నిర్వహణకు 11 ఏళ్ల కుమార్తె ప్రయాస

'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కథనంతో పలువురి సాయం

12

మానవత్వం గెలిచిన చోట పుట్టిన కథలివి

"నాకింకో వ్యాపకం లేదు. రైటింగ్ ఈజ్ డ్రీమింగ్ విత్ లెటర్స్, నాకది ఇష్టం. తిరువనంతపురంనుండి బెంగళూరు రావాలంటే ఫ్లైట్లో ఒక నవల ఊహించుకుంటాను. నేనది రాయక్కరలేదు. ఊహగా నాలో మెదిలినా చాలు. ఆ ఊహలు నాకిష్టం. ఆ చిత్రణ ఇష్టం. అందుకని సమయం సరిపోలేదనో కష్టమనో ఇన్నేళ్ళలో ఎప్పుడూ అనుకోలేదు."
– జయమోహన్



తమిళ రచయిత జయమోహన్‌లో చిత్రమైన ఆకర్షణ ఉంది, అది విజయవంతమైన రచయిత అయినంత మాత్రాన సాధించగల ఆకర్షణ కాదు. ఆయన నవ్వులో, పలకరింపులో, అప్రోచబుల్‌గా ఉండటానికి సందేహించని ఆయన మనస్తత్వంలో మనుషులను అయస్కాంతంలా లాగగల ఆకర్షణ ఉంది.

కెత్తేల్ సాయెబు, ఏనుగు డాక్టరు, వంద కుర్చీల ఆఫీసరు.. ఇలా మనసులో స్థిరపడే పాత్రలతో ఆసక్తిగొలిపే ఆయన కథల్లో కొన్నింటిని అవినేని భాస్కర్ 'నెమ్మి నీలం' పేరుతో తెలుగులోకి పుస్తకంగా తెచ్చి, బెంగళూరు బుక్ బ్రహ్మ లిటరరీ ఫెస్టివల్‌లో ఆవిష్కరించారు. అదయ్యాక, జయమోహన్‌తో మట్లాడేందుకు, నాకూ రాజిరెడ్డికీ కాఫీ టైం దొరికింది. 'గెలుపు' కథను ప్రస్తావిస్తూ, ఆయన కథల్లో లేయర్స్ గురించీ, డీటైలింగ్ గురించీ రాజిరెడ్డి మాట్లాడారు.

దానికి కొనసాగింపుగా– "మీరంత పెద్ద పెద్ద కథలెందుకు రాశారు?" అడిగాన్నేను.

కథంటే చిన్నదవ్వాలన్న నియమం లేదు!

కథంటే చిన్న కథే కావాలన్న మాట ఎవరు సృష్టించారో తెలీదు. అదేమీ నియమం కాదు. అలా ఉండటం గొప్ప విషయమూ కాదు అంటూ అమెరికాలో, ఆ మధ్య 64 పేజీలతో వచ్చిన ఒక కథ అంతర్జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందటం గురించి చెప్పారాయన.

ఇంత పెద్ద కథలు ఎలాగూ రాస్తున్నారు కదా, రాయడం కూడా ఇష్టంగా అలవోకగా చెయ్యగలరని తెలుస్తూనే ఉంది, ఈ కథలను నవలలుగా కూడా మార్చగల అవకాశం ఉన్నప్పుడు, అలా ఎందుకు చెయ్యలేదని అడిగాం.

జయమోహన్ అన్నారూ, ప్రతి కథకూ ఆయన మనసులో, బలమైన ఆధారం లాంటి వాక్యం ఒకటుంటుందిట. ఉదాహరణకు, ఆ వంద కుర్చీల కథలో, ఆఫీసర్ వంద కుర్చీలు కావాల్సిందే అనుకోవడం. కూటి ఋణంలో అతను మొత్తాన్నీ సాయిబు దగ్గర ఇచ్చేయడం, అతడు కళ్ళెత్తి కూడా చూడకపోవడం ఇలా. ఒకసారి ఆ మలుపు, ఆ వాక్యం దగ్గరికి వచ్చామంటే, కథ అయిపోయినట్టే. అక్కడి దాకా ఎన్ని పేజీలన్నది ఆయనకు లెక్క లేదు. కానీ ఆ మలుపు తర్వాత ఆ కథలో ఇక చెప్పడానికేమీ లేదు. కాబట్టి ఇవన్నీ కథలయ్యాయి. నవల అంటే, ఆయన దృష్టిలో ఇలాంటి సందర్భాలు, కథనిట్లా మలుపులు తిప్పగల వాక్యాలు ఇంకా ఎన్నో ఉండచ్చు, ఉండాలి. కనుక ఇవి కథలే తప్ప నవలలు కాలేవన్నది ఆయన జవాబు.


జయమోహన్‌తో మానస చామర్తి

జయమోహన్ కథల్లో ఏళ్ళకేళ్ళ జీవితాలు పరుచుకుని ఉంటాయి. ఇంత విశాలమైన జీవితాన్ని కాన్వాస్‌గా ఎందుకు తీసుకుంటారు, కథను చెప్పడం తేలిక చేస్తుందనా? అంత పెద్ద జీవితంలో నుండి ఏ తునకలనైనా ఎంచి చెప్పే వీలుంటుందనా? అని అడిగాను.

ఆదర్శాలకు నిలబడే పాత్రలను చూపించడం ముఖ్యం

ఆయనకు మనిషి 'ఎథికల్ కన్సిస్టెన్సీ' మీద దృష్టి పెట్టడం ఇష్టమట. అంటే ఏదో పుణ్యానికి ఓ రోజు మంచి చెయ్యడం, స్నేహమో సాయమో చెయ్యడం– ఇలా కాదు. ఏళ్ళ తరబడి నడిచే జీవితంలో ఆ పాత్ర ఏ ఆదర్శాలను నమ్ముకుని జీవిస్తుందో చెప్పడం, వాటికి నిలబడిందో లేదో చూపించడం ఆయనకు ముఖ్యమని చెప్పారు. (పుస్తకం మొదటి పేజీ లోనే చెప్తారు ధర్మం మూలాలకు సంబంధించిన ప్రశ్నలతో మొదలైన ఈ కథలన్నీ మానవత్వపు గెలుపును చాటి చెబుతాయని).

జయమోహన్ కథలకు భాస్కర్ అనువాదాలు చదివిన రీడర్స్‌లో చాలామంది, మళ్ళీ వెనక్కు వెళ్ళి మరీ మూల రచయిత పేరు కూడా గమనించడం నాకు తెలుసు. చిన్నచిన్న కథలు, సంఘటనలు అందరి మీదా అన్నిసార్లూ బలమైన ముద్రను వేస్తాయని ఆశించలేం. కానీ నిడివి పెరిగే కొద్దీ, కథ బాగుంటే పాఠకుడు ఆ కథాజగత్తులో లీనమై పోతాడు. కొన్ని నిమిషాలపాటో, గంటలపాటో వేరే ప్రపంచంలోకి ట్రాన్స్‌పోర్ట్ అయిన పాఠకుడు, మళ్ళీ ఈ లోకంలోకొచ్చాక, ఆ ప్రభావం నుండి బయటపడ్డాక, రచయిత పేరు గమనించకుండా ఉండలేడు. ఆయన పేరు తెలుగు నాట కూడా ఇంత బలంగా నాటుకోవడానికి, ఈ కథల నిడివి ఒక కారణమంటే– ఆయన ఆ గమనింపుని ఒప్పుకున్నారు. రచయిత అట్లాంటి సాంద్రమైన పఠనానుభవం పాఠకులకు అందించా లన్నట్టు మాట్లాడారు.

"డెలిబరేట్‌గా చేస్తారా," అన్నాను.

తల అడ్డంగా ఊపుతూ అలా చేయాలని కూడా ఎప్పుడూ అనుకోనన్నారు. ఆయనకు కథ ఆర్గానిక్‌గా క్రియేట్ అవ్వాలి. అలాగే నడవాలి.

దిద్దుకుంటూ కూర్చోను!

కరోనా లాక్‌డౌన్‌లో 'కథల తిరనాళ్ళు' అంటూ 'వంద రోజులు, రోజుకో కథ' అని ప్రకటించి మరీ వెబ్‌సైట్‌లో ప్రచురిస్తూ వచ్చారు. పరుగు పందేల్లో ఫినిష్ లైన్ చేరుకున్నాక కూడా మరికొంతదూరం పరుగెత్తినట్టు, ప్రకటించిన వంద కథలతో ఆగకుండా నూట ముప్పై కథలు రాశారు. అక్కడా నిడివితో నిమిత్తం లేదు.

రాజిరెడ్డీ నేనూ మళ్ళీ అడ్డు కొట్టేశాం. అలా ఎలా సాధ్యపడుతుంది? పోనీ గాలి మేడల్లాంటి కథలా అంటే అదీ కాదు. మంచి వస్తువూ ఉంటుంది. బలమైన చిత్రణా ఉంటుంది. ఆ ఊహకూ, అల్లికకూ, రాతకూ సమయమెలా సరిపోతుంది? ప్రత్యేకించి కథ బాగా రాబోతోందని తెలిసినప్పుడు ఇంకొంచం శ్రద్ధగా రాయాలనిపించడమూ రచయితలకు అనుభవమవుతూంటుంది కదా? అలాంటిదేమీ ఉండదా? అని అడిగాం. మరీ ముఖ్యంగా ఎడిటింగ్?

ఆయన చాలా అయిష్టంగా తిరస్కరించారు. ఎడిటింగ్ మొదలెడితే దానికిక ముగింపెక్కడ? ఏదో ఒకటి చెయ్యాలనిపిస్తూనే ఉంటుందిక. నేను ఆ పని పెట్టుకోను. అంత నచ్చకపోతే డిలీట్ చేసేస్తాను తప్ప దిద్దుకుంటూ కూర్చోనన్నారు.

"డిలీట్? డ్రాఫ్ట్ లో కూడా ఉంచరా? మళ్ళీ ఇంకోసారి చూసుకోరా?"

"నో. చూడను. అవి దిద్దే టైంలో కొత్త కథ రాసేసుకోవచ్చు" అన్నారు నవ్వి.

"ఎప్పటికప్పుడు కొత్తవి రాసేందుకు సమయమెలా సరిపోతుంది?" – మా అనుమానం తీరలేదు.

మెదడుని తిట్టకూడదు. పిచ్చిగా వాడకూడదు.

"నాకింకో వ్యాపకం లేదు. రైటింగ్ ఈజ్ డ్రీమింగ్ విత్ లెటర్స్, నాకది ఇష్టం. తిరువనంతపురంనుండి బెంగళూరు రావాలంటే ఫ్లైట్లో ఒక నవల ఊహించుకుంటాను. నేనది రాయక్కరలేదు. ఊహగా నాలో మెదిలినా చాలు. ఆ ఊహలు నాకిష్టం. ఆ చిత్రణ ఇష్టం. అందుకని సమయం సరిపోలేదనో కష్టమనో ఇన్నేళ్ళలో ఎప్పుడూ అనుకోలేదు."

ఎప్పుడూ రాయాలనే ఉంటుందా?

"ఆహా! ఇదుగో ఇక్కడ ఉందే (మెదడుని చూపిస్తూ) దీనిని తిట్టకూడదు. పిచ్చిగా వాడకూడదు. ఆరోగ్యంగా ఉంచుకోవాలి. అల్లోపతి మందులు తినేసి శరీరాన్ని పాడుచేసుకోకూడదు. ఇవి రెండూ బాలేదంటే రాయాలనే అనిపించదు. కాబట్టి అవి ముఖ్యం. నిద్ర ముఖ్యం.

"మా అబ్బాయికి కరోనా వచ్చి హాస్పిటల్‌లో అడ్మిట్ చేసామొకసారి. రాత్రికి ఇంటికి చేరాక ఒక్కణ్ణే ఉన్నానప్పుడు– ఒళ్ళంతా ఒకటే సంతోషం. నరాల్లోకి పాకిన తియ్యదనం. నాకు తెలుస్తోంది ఆ పొంగు. 36 గంటలు లేవకుండా కూర్చుని ఒక నవలిక రాశాను – 'కుమరితుఱై'. ఎంతా ఏమిటీ అని కూడా చూడలేదు. సైట్‌లో మర్నాడు పబ్లిష్ అయ్యేలా సెట్ చేసి నిద్రపోయాను. అది చదివి మా అబ్బాయి 'నాన్నా, నువ్వొక కవివి' అన్నాడు.


"రాసే ఉధృతిలో ఎన్ని గంటలైనా కూర్చోవచ్చు, పర్లేదు. రాసేశాక మాత్రం కంటి నిండా నిద్రపోవాలి."

తరువాతి సెషన్‌కి వేళయి అందరం బయటకు వచ్చేశాక మాకు అనిపించిందొక్కటే. జీవితం ముఖ్యం. ఈ రాత మొత్తం దాని కొనసాగింపు. ఆయన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. రాతనిట్లా ఆస్వాదిస్తున్నాడు.

ఆయన కథలింత బాగుండడంలో ఆశ్చర్యం ఏముంది?

■ మానస చామర్తి
✆ 7975468091

nothingness



అలాగే

ఆకాశం నిర్మలంగా నిశ్చలంగా ఉంటుంది
హద్దులు లేక బరివాతల

నింగి నేల రాలదు

కాకపోతే కొంత ధూళి కణాలు కలిగి
మరింత అంతరిక్షనౌకల పొగచూరి
ఎదురుచూస్తూ
పిడుగుల్ని జడివానల్ని కురిపించ

II
భూమి ఉంటుంది
సరిహద్దుల గిరిగీతల బందీగా
యుద్ధ గాయాలను అట్లాస్లా మోస్తూ
మనిషి విధ్వంసానికి పగుళ్ళు బారి

భూకంప ప్రకోపాన్ని ప్రకటించ

III
ఆనకట్టల కట్టడికి కాసింత కలవరపడినా
నదుల గతులు మారవు
ఒకింత కల్మషాలను పెరిగిన కాలుష్యాలను
ముక్కు మూసుకుని బుద్ధుడిలా వహిస్తూ
జలప్రళయ తాండవమాడ
ఉంటాయి

IV
అలాగే.. దేహం జీర్ణమయి
గతించి నువ్వూ ఉంటావు

కొందరి మదిలోనో మస్తిష్కాల్లోనో
ఇంకా రూపు మారి
ప్రకృతి మరో పేరుతో
పంచభూతాల్లో మనిషిపై ప్రతీకారేచ్ఛతో

(కేరళ విలయం చూసి)

■ పిన్నంశెట్టి కిషన్
✆ 97002 30310

బొమ్మలు: అక్బర్

ఒక లచ్చవ్వ అనుభవంలో చరిత్ర స్మృతులు

చరిత్రకూ మానవ అనుభవానికీ ఉన్న సంబంధం సృజనాత్మక సాహిత్యానికి గొప్ప వనరు. అలాంటి సాహిత్యం చరిత్ర రచనకు ఆకరంగా ఉపయోగపడుతుంది. కానీ విస్తృత జీవన చిత్రణకు అవకాశం ఉన్న నవల సామాజిక శాస్త్రాలకంటే భిన్నమైన పాత్ర పోషిస్తుంది. అప్పుడు నవల చరిత్రకు కాల్పనిక రూపంగానే మిగిలి పోదు. చరిత్ర చెప్పలేని విషయాలను చెప్పి సరి పెట్టుకోదు. చరిత్రను దాటి ముందుకు వెళ తుంది. ఇట్లాంటి చర్చకు నిలవగల చాలా లక్షణాలు ఉన్న నవల 'తల్లులుబిడ్డలు'. దీన్ని మహమూద్ హుస్సేన్ రాశారు. రెండు సార్లు అరెస్టయి, జైలు జీవితం గడిపిన రచయిత సరిగ్గా ఈ నవల విడుదలైన రెండేళ్లకు మళ్ళీ జూలై 8న ఒక అక్రమ కేసులో అరెస్టయ్యాడు.



యాభైఏళ్ల కింద ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో కొద్ది మంది యువకులు ఆరంభించిన విప్లవోద్యమం దగ్గర ఈ నవల కూడా మొదలవుతుంది. వాళ్లకు అంతక ముందు ఎలాంటి పోరాట అనుభవం లేదు. కాక పోతే గతంలో జరిగిన అన్ని పోరాటాల కంటే పూర్తి భిన్నమైన ఆలోచనలతో పని ఆరంభించారు. పాత కమ్యూనిస్టు ఉద్యమం ఆర్థిక పోరాటాలకు, స్థానిక సమస్యలకు మాత్రమే పరిమితమై ఉండింది. కానీ ఈ యువకులు సింగరేణి బొగ్గు గనులు ఉన్న చిన్న ప్రాంతంలో ఆరంభించిన నిర్దిష్ట పోరాటానికి దేశవ్యాప్త సార్వజనీన రాజకీయ సాంస్కృతిక లక్ష్యం ఉన్నది. సింగరేణి అనే నిర్దిష్ట వాస్తవం దగ్గర నిలబడి దేశాన్ని ప్రభావితం చేయగల పోరాటానికి కార్మికవర్గాన్ని సిద్ధం చేయాలనుకున్నారు. దీని కోసం సమాజానికి, ఉద్యమాలకు ఉండగల అన్ని రకాల సంప్రదాయక భావ జాలాలను తిరస్కరించారు. కొత్త అన్వేషణ మొదలు పెట్టారు. ఆ రకంగా వాళ్ల ఒక కొత్త రాజకీయ సాంస్కృతిక చట్రాన్ని ప్రతిపాదించి ముందుకు తీసికెళ్లారు. అనేక సిద్ధాంత, సైనిక ఆటుపోట్ల మధ్య కూడా అది భవిష్యత్ లోకి విస్తరిస్తున్నది.

తల్లులు బిడ్డలు నవల ఇతివృత్తం వ్యక్తుల జీవిత విశేషం కాదు. పాత నుంచి బైటపడే క్రమంలో లక్షలాది మంది గడించిన అనుభవాన్నంతా వస్తువుగా స్వీకరించింది. ఇంత విస్తృత కథనానికి మళ్ళీ గజ్జల లచ్చవ్వ అనే ఒక మహిళ అనుభవం ఫోకస్ పాయింట్. ఏది నవల అవుతుందో, ఎట్లా నవల అవుతుందో, నవలలోనే చెప్పవలసింది ఏమిటో తెలిసి రాసిన ఐదు వందల పేజీల నవల ఇది.

అప్పటి భౌతిక పరిస్థితులు, వాటిలో మానవ జోక్యం, దానికి ఉన్న అవకాశాలు చరిత్రకు సంబంధించినవి. అట్లా ఈ నవల చరిత్ర నుంచి వచ్చిందే. కానీ ఆ సమూహం పొందిన అనుభవం ఈ నవలా ఇతివృత్తం. క్రమంగా ఆ అనుభవం వందల వేల కుటుంబాల, లక్షలాది కార్మికుల, రైతు కూలీల, అంటరాని కులాల, మధ్య తరగతి జనాల, స్త్రీల, పురుషుల జీవితంగా మారింది. వాళ్లందరూ భాగమై ఉన్న మానవ సంబంధాల సంఘర్షణగా మారింది. దాన్ని చెప్పడానికి హుస్సేన్ ఈ నవల రాశారు.



సంప్రదాయక నవలా నిర్మాణం వైపు నుంచి చూసినప్పుడు 'తల్లులు బిడ్డలు' మీద విమర్శలు ఉండవచ్చు. కానీ జీవితాన్నే సంప్రదాయకంగా చూడకూడదనే చైతన్యం నుంచి, ఆచరణ నుంచి పోగుపడిన అనుభవం దీని ఇతివృత్తం. కాబట్టి రచయిత ఏ ప్రామాణిక పద్ధతులనూ పాటించలేదు.

సంప్రదాయక నవలా నిర్మాణం వైపు నుంచి చూసినప్పుడు 'తల్లులు బిడ్డలు' మీద విమర్శలు ఉండవచ్చు. కానీ జీవితాన్నే సంప్రదాయకంగా చూడకూడదనే చైతన్యం నుంచి, ఆచరణ నుంచి పోగుపడిన అనుభవం దీని ఇతివృత్తం. కాబట్టి రచయిత ఏ ప్రామాణిక పద్ధతులనూ పాటించలేదు. దీన్ని ఆయన చారిత్రాత్మక స్మృతులు అంటూనే నవలా నిర్మాణంలో రావాల్సిన విప్లవాత్మక మార్పులను చర్చనీయాంశం చేసే శిల్పాన్ని ఎంచుకున్నారు. నవలతో సహా సాహిత్య ప్రక్రియలన్నీ మానవ సంస్కృతికి సంబంధించినవి. జీవన సంస్కృతి మారే క్రమంలో కళా రూపాల ప్రమాణాలు కూడా మారవలసి ఉంటుంది.

ఈ దృష్టితో చూసినప్పుడు హుస్సేన్ తీసుకొచ్చిన శిల్పపరమైన మార్పులు పాఠకులకు సన్నిహితమైనవి. ఈ నవలలో మనకు రచయిత కూడా కనిపిస్తారు. కానీ కథ రచయిత చెప్పరు. ప్రజలందరి గాఢమైన అనుభవాన్ని కథలోకి మళ్లించి ఆబ్జెక్టివ్‌గా, గ్రాఫికల్‌గా చెబుతూపోతారు. ఒక ఆలోచన నుంచి మరో కొత్త ఆలోచన రావడానికి, ఒక పని నుంచి అంతకంటే ఉన్నతమైన పనిలోకి సాగడానికి మనుషులు అనుభవించే ప్రయాస అంతా రాశారు. అనేక సమూహాల అనుభవంగా, ఒక కాలపు అనుభవంగా చెబుతారు. తీవ్రమైన భావోద్వేగాలు, అసాధారణమైన సాహసాలు, విపరీతమైన సందిగ్ధతలు, నిలువ నీటిలో ఒక చిన్న కదలిక తేవడానికి లెక్కలేనన్ని ప్రయత్నాలు, అత్యంత సృజనాత్మకమైన ఊహలు ధరించే వాస్తవ రూపాలు.. నవలగా మారాయి. ఈ క్రమంలో ఇందులోకి వచ్చిన దుఃఖం, తెగువ ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. నడుస్తున్న చరిత్రతోపాటు ప్రజల అనుభవం ఎన్నెన్ని రూపాల్లో విస్తరించేదీ చిత్రించడమే ఈ నవల ప్రత్యేకత.

■ పాణి ✆ 98661 29458

మోహం




1
జీవితమ్మీద ఇంత మోహమేమిటి
అంటారు
ఏ రోజైనా వెళ్ళిపోయే విరక్తి ఉంది గనక
అంటావు

ఆ దీపం వెలుతురు, బాటపై మనుషులు,
ఇళ్లపై వెలుగునీడల దోబూచులాట
ఉండి ఉండి తగిలే గాలితెరలు
కురవలేక బేలగా నిలబడిన మబ్బులు
మానుష ప్రపంచపు వింతవింత శబ్దాలు
చనిపోతే ఇక దొరకవు కదా అని కూడా



2
జీవించటం ఇంత అపురూపమైన సంగతా
అంటారు

చనిపోతే అంతా చెరిగిపోతుంది,
ఇదంతా ఉంటుందో, లేదో తెలియకుండాపోతుంది
వెళ్ళిపోగల ప్రతి సంగతీ అపురూపమే అంటావు
ఉండటం మీద ఇష్టంతో కదా
ఇదంతా ఇక్కడ ఉంది అని కూడా



3
ఇవాళ తెల్లవారింది
వెలుతురులో ప్రపంచం ఉత్సవం జరుపుకుంది

సౌఖ్యం, దుఃఖం, కలయిక, వియోగం
ప్రతిదీ ఒక ఉత్సవం, ఒక ప్రార్థన, ఒక దీవెన
గాఢనిద్రలో మెరిసే ఖాళీలో
మిగిలేదేమీ లేదు కదా అంటావు



4
నువు ప్రేమించేది దేనినీ చెప్పమంటారు


దేనిని ప్రేమిస్తున్నానో నాకూ తెలియదు
బహుశా, ఈ వెలుగునీడల కదలికల్లో
నన్ను నేనే పొందుతున్నాను, దాచుకొంటున్నాను
జీవితం ప్రియురాలి రూపంలో
నన్నే చూసుకుని ఆశ్చర్యపోతూ, ప్రేమిస్తున్నాను



5
ఇంతలో, తలుపు తెరిచిన చప్పుడయింది
తలుపు, తెరవటం, చప్పుడు, వినబడడం
మన అర్థాలకి అందని
ఈ అనుభవ సమూహం
మనని దేనికి తట్టి లేపాలని చూస్తుంది

■ బివివి ప్రసాద్
✆ 90320 75415





మాకు నెంబర్స్ కంటే ఈ కొత్త పాఠకులను తయారుచెయ్యడం ఎక్కువ సంతోషాన్నిస్తోంది. అలాగే ఈ కొత్త రీడర్స్‌లో మేము గమనించింది ఏంటంటే, ఏదైనా నచ్చితే దాన్ని తమకు నచ్చిన పద్ధతిలో ఫ్రెండ్స్‌కి షేర్ చేస్తారు. అందువల్లే ఈ పుస్తకం ఒకరి నుంచి ఒకరికి పాకి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది.

3? మూడు ప్రశ్నలు

■ వి. మల్లికార్జున్

రెండొందల కాపీలు పోని చోట ముప్పైమూడు వేలు ఎలా అమ్మారు!

మీ ప్రచురణ సంస్థ అజు పబ్లికేషన్స్ విడుదల చేసిన రవి మంత్రి నవల 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' ముప్పైమూడువేల కాపీలు అమ్ముడై బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఇంతమంది పాఠకుల దాకా పుస్తకాన్ని తీసుకువెళ్ళటానికి మీరు ఎలాంటి ప్రయత్నాలు చేశారు?

'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' నవల ఇరవై ఐదు వేల కాపీలు అమ్ముడై ముప్పై వేలకు దగ్గరవుతుండటం మాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. ఇందులో పబ్లిషర్స్‌గా మేమేం చేశామని ఆలోచిస్తే ఈ ఒక్క పుస్తకం కోసమే అని ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. తెలుగులో ఒక పుస్తకం వెయ్యి కాపీలు అమ్ముడైతే చాలు అనుకుంటున్న రోజుల్లో 'అజు పబ్లికేషన్స్' పుట్టింది. నేనేమీ ఈ నెంబర్స్ మార్చాలని, వేల కాపీలు అమ్మాలని అనుకొని ఇది మొదలు పెట్టలేదు. నా పుస్తకాలు నేనే ప్రచురించుకుందామని మొదలుపెట్టాను. నాతోపాటు కోపబ్లిషర్‌గా శ్వేత యర్రం జాయినయ్యాక వేరే రచయితల పుస్తకాల్ని కూడా ప్రచురించడం మొదలుపెట్టాం. అన్ని పుస్తకాలకూ ఎలా పని చేస్తామో అలాగే 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' పుస్తకానికీ చేశాం. 2023 జూన్‌లో ఈ పుస్తకం మార్కెట్లోకి వస్తే 2024 మే వరకు మూడు ఎడిషన్లు అయిపోయాయి. అప్పటికే మేము ఈ పుస్తకం బాగా వెళ్తోంది కదా అను కున్నాం. నాలుగో ఎడిషన్ వెయ్యి కాపీలు ప్రింట్ చేస్తే రెండే రెండు రోజుల్లో అయిపోయాయి. ఆ వెంటనే ఐదు, ఆరు, ఏడు – ఇలా ఎడిషన్‌కి రెండు వేల కాపీలు ప్రింట్ చేసినా వారంరోజుల్లోపే అయిపోతున్నాయి. ఎనిమిదో ఎడిషన్‌కి ఐదు వేలు, తొమ్మిదో ఎడిషన్‌కు పది వేలు, ఇప్పుడు పదో ఎడిషన్‌కు పది వేలు వేశాం. ఇలా గత రెండు నెలలుగా పుస్తకం రీప్రింటుకి వెళ్తూనే ఉంది.

ఇంత డిమాండ్‌కి కారణం ఏంటని అన్ని కోణాల్లోంచి విశ్లేషిస్తూనే ఉన్నాం. కచ్చితంగా ఇక్కడ మొదలైందని చెప్పలేం గానీ, ఇన్‌స్టాగ్రాంలో కొన్ని మీమ్ పేజీలు ఈ పుస్తకాన్ని చదివి రీల్స్ చేశాయి. అందులో కొన్నింటికి యాభై అరవై లక్షల వ్యూస్ వచ్చాయి. అదే టైంకి ఇన్‌స్టాగ్రాంలో ఈ పుస్తక రచయిత రవి మంత్రి కూడా కంటెంట్ క్రియేటర్‌గా బాగా పాపులర్ అయ్యాడు. అన్నీ కలిసి రెండు నెలల క్రితం ఈ పుస్తకానికి ఒక క్రేజ్ తీసుకొచ్చాయని అనుకుంటాను. ఆ క్రేజ్ చూసి కొన్నవాళ్ళంతా చదివి బాగుందంటూ షేర్ చెయ్యడం మొదలుపెట్టాక ఇంక ఈ పుస్తకం ఆగింది లేదు. మేమెప్పుడూ పేర్లు కూడా వినని చిన్న చిన్న బుక్ షాప్‌ల నుంచి రోజూ ఫోన్లు వస్తున్నాయి. అమెజాన్‌లో వచ్చే ఆర్డర్లను ప్యాక్ చెయ్యడానికి వర్క్ ఫోర్స్ సరిపోక రోజుకి ఐదొందల ఆర్డర్లకు మించి తీసుకో లేని పరిస్థితి. ఈ రెండు నెలలుగా మేం చూస్తున్న ప్రతిదీ మాకు కొత్తదే. ఈ పుస్తకం ఎంత దూరం వెళ్తుందని అడిగితే మాకైతే ఇంకా ఏ అంచనా రాలేదు.

మీరడిగిన ప్రశ్న దగ్గరికే మళ్ళీ వెళ్దాం. పబ్లిషర్స్‌గా మేం చేసింది ఏంటంటే, మొదట్నుంచీ మేం కట్టుబడి ఉన్న విషయాలు కొన్ని ఉన్నాయి:

1) పుస్తకానికి వీలైనంత తక్కువ ధర పెట్టడం. (కొన్ని పుస్తకాలకు మొదటి ఎడిషన్ అయిపోయిన తర్వాత కూడా బ్రేక్ ఈవెన్ రాలేదు)

2) కొత్త పాఠకులను చేరే మార్గాలను వెతుకుతూనే ఉండటం. ఈ క్రమంలోనే ట్విట్టర్‌లో, ఇన్‌స్టాగ్రాంలో మా ప్రెజెన్స్‌ను ఈ మూడేళ్లలో ఇరవై రెట్లు పెంచగలిగాం. మాకొచ్చే ఆర్డర్లలో ఎక్కువ శాతం సోషల్ మీడియా ద్వారా వచ్చేవే. ఇప్పుడు అమ్మ డైరీలో.. పుస్తకాన్ని చదివి ఓన్ చేస్కొని ఇంత దూరం తీసుకొచ్చింది కూడా ఇన్‌స్టాగ్రాం బాగా వాడే పాతికేళ్లలోపు వయసున్నవాళ్ళే. వీళ్లలో చాలామందికి ఇది మొదటిపుస్తకం. వాళ్ళంతా మొదటిసారి ఒక పుస్తకం చదువుతుంటే కలిగే అనుభూతి గురించి చెప్తుంటే బాగుంది. మాకు నెంబర్స్ కంటే ఈ కొత్త పాఠకులను తయారుచెయ్యడం ఎక్కువ సంతోషాన్నిస్తోంది. అలాగే ఈ కొత్త రీడర్స్‌లో మేము గమనించింది ఏంటంటే, ఏదైనా నచ్చితే దాన్ని తమకు నచ్చిన పద్ధతిలో ఫ్రెండ్స్‌కి షేర్ చేస్తారు. అందువల్లే ఈ పుస్తకం ఒకరి నుంచి ఒకరికి పాకి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది.

3) కంటెంట్ విషయంలో క్వాలిటీ అన్నది ఎలాగో మా బేసిక్ రూల్. ప్రింట్ క్వాలిటీ కూడా బాగుండాలని బలంగా నమ్ముతాం. అలాగే ఎవరైనా పుస్తకం కోసం వెతికితే అది వెంటనే దొరికేలా అమెజాన్ స్టోర్‌ఫ్రంట్‌ను నడిపిస్తున్నాం.

సోషల్ మీడియాలో సెన్సేషన్ అయిన అమ్మ డైరీలో కొన్ని పేజీలు పుస్తకానికి, ముందు నుంచీ మేము ఫాలో అవుతున్న ఈ అంశాలు ఒక ప్లాట్ఫాంగా పనిచేసి ఉండొచ్చు అనుకుం టున్నా.

పుస్తకంలో ఏ అంశం/ ఏ విధమైన శైలి పాఠకుల్ని ఇంతగా ఆకట్టుకుంది అనుకుంటున్నారు?

ఈ పుస్తకానికి బ్యాక్ కవర్లో రవి మంత్రి రాసినట్టు 'ఇది అమ్మ ప్రేమ కథ' అన్న అంశం ఎక్కువమందిని ఆకర్షించింది. చక్కటి శైలితో ఒక్కసారి మొదలుపెడితే చివరివరకు చదివింపజేసే కథనం అందరికీ నచ్చింది. ప్రేమలో అవతలి మనిషిని కోల్పోతామేమో అనే భయమూ, కోల్పోయినప్పుడు ఉండే బాధా ఈ నవలలో కనిపిస్తాయి. వాటిగురించీ ఎక్కువమంది మాట్లాడటం చూస్తుంటే, నిజాయితీగా ప్రేమలో ఉండే ఇన్నొసెన్స్‌ని పట్టుకొని రాయడం వల్ల కూడా ఈ నవలకు ఇంత పాపులారిటీ వచ్చి ఉండొచ్చు.

మీ 'అజు పబ్లికేషన్స్' దగ్గర నుంచి ఇప్పటిదాకా వచ్చిన టైటిల్స్ లో యంగ్ ఆడియన్స్‌ని ఆకట్టుకున్న ఇతర టైటిల్స్ ఏమిటి? పుస్తకాల్లోని ఏయే ఫాక్టర్స్ యంగ్ ఆడియన్స్ ని ఆకట్టుకుంటు న్నాయని మీరు భావిస్తున్నారు?

మేము ఇప్పటివరకు పద్నాలుగు పుస్తకాలు ప్రచురిస్తే అందులో ఏడు కొత్త రచయితల మొదటి పుస్తకాలే. ఇందులో దాదాపు అన్ని పుస్తకాల రీడర్ బేస్ కూడా యంగ్ రీడర్సే. నల్లగొండ కథలు, ఇరానీ కేఫ్, గాజుల సంచి, రామగ్రామ నుంచి రావణలంక దాకా, కాగితం పడవలు – ఈ పుస్తకాలన్నీ అమెజాన్‌లో బెస్ట్‌సెల్లర్స్ ప్లేసుకెళ్ళి కనీసం మూడు రీప్రింట్‌లకు వెళ్ళాయి. సులువుగా ఉండే భాష, ఈతరం మాట్లాడుకునే సంభాషణలే ఉండటం వల్ల కూడా యంగ్ రీడర్స్‌కు ఈ పుస్తకాలు దగ్గరయ్యాయనుకుంటాను. సరిగ్గా చదివింపజేసే శైలితో వాళ్ళు రిలేట్ చేసుకోగలిగేలా రాస్తే ఎలాంటి థీమ్స్‌ని అయినా యాక్సెప్ట్ చేస్తున్నారు. అలాగే కొత్తగా పుస్తకాలు చదువుతున్న చాలామంది కథ కంటే నవలనే ఎక్కువ ఇష్టపడుతున్నారనిపిస్తోంది.

(వి. మల్లికార్జున్ రచయిత, ప్రచురణకర్త. శ్వేత యర్రంతో కలిసి అజు పబ్లికేషన్స్ నడుపుతున్నారు. అజు పబ్లికేషన్స్ ఇప్పటి దాకా 14 పుస్తకాలు ప్రచురించింది.)

దీపావళి కథల పోటీ

డాక్టర్ అమృతలత – పాలపిట్ట సంయుక్త ఆధ్వర్యంలో దీపావళి కథల పోటీకి రచయితలు తమకు నచ్చిన ఇతివృత్తంతో కథలు రాసి పంపాలి. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు. మరో పది కథలకు రూ.1000 చొప్పున ప్రత్యేక బహుమతులు. కథలను సెప్టెం బర్ 25లోగా చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 3, బ్లాక్ 6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500044కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 9490099327 ఈమెయిల్: palapittabooks@gmail.com

గుడిపాటి

బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సు

కేంద్ర సాహిత్య అకాడమీ, పల్నాడు కళా క్షేత్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న బెల్లంకొండ శత జయంతి సదస్సు ఆగస్ట్ 25న ఉ.10 నుంచి సా.5గంటల వరకు నరసరావుపేటలో భువనచంద్ర టౌన్ హాల్‌లో జరుగుతుంది. సదస్సులో బెల్లం కొండ సాహిత్యంపై పత్ర సమర్పణ ఉంటుంది. సి. మృణాళిని, వేదాంతం సీతరామావధాని, సయ్యద్ నశీర్ అహ్మద్, రెంటలా జయదేవ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 9966757407

కరీమ్

మినీకథల పోటీ

కీ.శే. భావరాజు సత్యన్నారాయణ మూర్తి 89వ జన్మదిన సందర్భంగా శ్రీమతి భావ రాజు రాజ్యలక్ష్మి (విశాఖపట్నం) 'సాహితీ కిరణం' పత్రిక సౌజన్యంతో మినీ కథల పోటీ నిర్వహిస్తున్నారు. మూడు ఉత్తమ కథలకు రూ.1,116/ చొప్పున మూడు నగదు బహుమతులు ఉంటాయి. కథ 250 నుండి 300 పదాల మధ్యలో డీ.టీ.పీ. చేసినవి కాని, చక్కని దస్తూరితో కాగితానికి ఒక వైపు వ్రాసినవి కానీ అయి ఉండాలి. కథలను ఆగస్ట్ 31లోగా చిరునామా: ఎడిటర్, సాహితీ కిరణం, ఇం.నెం.1113154, రోడ్ నెం.3, అలకాపురి, హైదరాబాద్–500102. సెల్:9490751681కు పంపాలి.

పొత్తూరి సుబ్బారావు



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు, మహిళలు

తోబుట్టు వేడుక రక్షా బంధన్

- రాఖీ పౌర్ణమికి సిద్ధమైన జనం
- రాఖీలు, మిఠాయిల కొనుగోలుతో సందడే సందడి





వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18: రక్తసంబం ధానికి ప్రతీకగా, సోదరీ, సోదరుల అప్యాయతను పెంపొందించే రక్షాబంధన్ పండుగను వరంగల్, హనుమకొండ జిల్లాలో సోమవారం జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. శ్రావణ మాసం పౌర్ణమి పర్వదినం రోజున జరిగే ఈ పండుగ కోసం ఆదివారం రాఖీల కొనుగోలుతో పట్టణాలు, నగర ప్రధాన ప్రాంతాలు రద్దీగా మారాయి. రాఖీలతో పాటు మిఠాయిల అమ్మకాలు జోరుగా సాగాయి.

అధిక ధరల్లో..

ఒక్క రూపాయి నుంచి రూ.500 ధర గల రాఖీల విక్రయాలు దుకాణాలలో విక్ర యిస్తున్నారు. వీటికితోడు వెండి రాఖీలు, రుద్రాక్ష రాఖీలు, ఇతర కొత్తదనంతో కూడిన డిజైన్లతో కూడిన రాఖీలను విక్రయిస్తున్నారు. గతంలో తక్కువ ధరలో ఉండే రాఖీలు ఇప్పుడు అధిక ధరలతో అమ్ముతున్నారు. మిఠాయిలు కూడా రూ.500 నుంచి రూ. 1500 లకు కిలో చొప్పున మిఠాయిలు విక్రయిస్తున్నారు. ఇవే కాకుండా రిలయన్స్, డీమార్టుల్లో స్వీట్ బాక్స్‌లు ఒకటి కొంటే ఒకటి ఉచితం వంటి అమ్మకాలు కూడా కొనసాగుతున్నాయి.

సమయమేమీ లేదు..

రాఖీలు కట్టుకొనే సమయంపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవాలు లేవని ప్రముఖ పురోహితులు స్పష్టం చేశారు. పౌర్ణమి వేళ ఏ సమయంలోనైనా రాఖీలను కట్టుకోవచ్చని, ఎక్కడా రాఖీలకు ముహూర్తాలు ఉండవని పంచాంగకర్తలు, సిద్ధాంతులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎప్పుడైనా రాఖీని కట్టుకోవచ్చు.

నేడు జంజిరాల పున్నం

శ్రావణ పౌర్ణమి రోజును రక్షా బంధన్‌గా, జంజిరాల పున్నమిగా జరుపుకుంటారు. బ్రాహ్మణులు, పద్మశాలీలు, విశ్వబ్రాహ్మణులు తమ గాయిత్రీధారణను జంజిరాలను తొలగించి పౌర్ణమి రోజున కొత్త జంజిరాలను ధరిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో గాయత్రీధారణ మహోత్సవాలను ఏర్పాటు చేశారు.





‘చెత్త’శుద్ధి ఏదీ?!

- ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ఏర్పాటుపై విమర్శలు
- విలువైన స్థలాలు వృథా అవుతున్నాయంటున్న జనం
- నేరుగా డంపింగ్ యార్డుకు తరలించాలని డిమాండ్
- మంత్రి పొంగులేటి ఆదేశాలు బుట్టదాఖలు
- డంపింగ్ యార్డులపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత
- బల్దియా అధికారుల తీరుపై ప్రజల అసంతృప్తి

నగరంలోని చెత్త తరలింపులో ఆటంకాలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెత్తను సేకరించడం, తరలించడం పెద్ద తలనొప్పిగా మారింది. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా చెప్పుకునే వరంగల్ మహానగరంలో సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేయాలలో ఇప్పటికీ ఒక స్పష్టత లేదు. అధికారికంగా ఒక్క రాంపూర్ శివారులోని 32 ఎకరాల విస్తీర్ణంలో ప్రతీ రోజు వందల టన్నుల చెత్తను ఒక్క చోట చేర్చడం చాలా ఇబ్బంది మారింది. అక్కడి బయోమైనింగ్ ప్లాంట్ అనుకున్నట్టుగా విజయవంతం కాకపోవడంతో రూ.కోట్ల నిధులు చెత్తపాలు అన్నట్టుగా ఉంది. అలాగే బాలసముద్రం, పోతననగర్ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను స్థానికులు వ్యతిరేకిస్తుండడంతో అధికారులకు ఇబ్బందిగా మారింది.

నిత్యం..

గ్రేటర్ వరంగల్ పరిధిలో 32 విలీన గ్రామాలను కలుపుకుని 66 డివిజన్‌లు ఉన్నాయి. నిత్యం 2.86లక్షల ఇళ్ల నుంచి ప్రతీ రోజు చెత్త కుప్పలు తెప్పలుగా వెలువడుతూనే ఉంటుంది. వరంగల్ బల్దియా పరిధిలో ప్రతీ రోజు 450 టన్నుల చెత్తను శానిటేషన్ సిబ్బంది సేకరిస్తున్నారు. 270 టన్నుల తడిచెత్త, 150 టన్నుల పొడి చెత్త, 15 టన్నుల శానిటరీ వేస్ట్ (హానికమైన చెత్త), 15 టన్నుల హజార్డర్ చెత్తను ఇళ్ల నుంచి సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.

మూడు చోట్ల..

నగరంలోని చెత్తను బల్దియా పరిధిలో రాంపూర్ శివారులో 32 ఎకరాల డంపిండ్ యార్డ్, హనుమకొండ బాలసముద్రంలో వెహికిల్ షెడ్డు పక్కన 10 ఎకరాల రెండో చెత్త ట్రాన్స్‌పర్ స్టేషన్, వరంగల్ పోతననగర్‌లో ఐదు ఎకరాల మూడో ట్రాన్స్‌ఫర్ స్టేషన్, ఉర్సుగుట్ట వద్ద 6 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సేకరించి డంప్ చేస్తున్నారు. కానీ ఇటీవల ఆయా ప్రాంతాల చుట్టు పక్కల నివసించే ప్రజలు చెత్త దుర్వాసన భరించలేక కర్రలతో స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లను రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో చాటుమాటుగా స్వచ్ఛ ఆటోలు ఉర్సుగుట్ట, పోతన నగర్ వద్ద చెత్త డంపింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. తర్వాత కొద్ది రోజులకు పోతననగర్, ఉర్సుగుట్ట వద్ద చెత్త డంపింగ్‌ను పూర్తిగా నిలిపి వేశారు. బాలసముద్రం ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి స్వచ్ఛ ఆటోలు, స్వచ్ఛ ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను టిప్పర్‌లు, డంపర్ బిన్‌ల సహాయంతో అతికష్టం మీద కార్మికులు ప్రతీ రోజు రాంపూర్‌కు తరలిస్తున్నారు.



వృథా..

నగరంలో సేకరించిన చెత్తను నేరుగా డంపిండ్ యార్డులకు తరలించకుండా ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.కోట్లు ఖర్చు చేసి నగరంలో రెండుచోట్ల ఉన్న ఈ చెత్త స్టేషన్‌లు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఎక్కువ మంది సిబ్బందిని, వాహనాలను ఏర్పాటు చేసి నేరుగా మడికొండ డంపింగ్ యార్డుకు తరలిస్తే అదనపు భారంతో పాటు నగరంలో చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుందని నిపుణులు చెప్పుకొస్తున్నారు. అంతే కాకుండా నగరంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు చెత్త కోసం కేటాయించడం సరైంది కాదని అంటున్నారు. వాటిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తే ప్రజలకు మంచి చేసినట్లు అవుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాంపూర్ యార్డుతో ఇబ్బందులు

రాంపూర్ శివారులో పెద్దఎత్తున డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం

మిగతా 6వ పేజీలో..

పర్యావరణానికి ముప్పు



- ఠాకూర్ రతన్‌సింగ్, పర్యావరణవేత్త, హనుమకొండ

నగరంలోని ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను చెత్తవాహనాలపై కవర్లు కప్పి నేరుగా డంపింగ్ యార్డుకు తరలించాలి. ఇప్పటికే వరంగల్ నగరంలో పర్యావరణ ముప్పు వల్ల ప్రజలకు చాలా రకాలైన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ప్రధానంగా నగరంలో అభివృద్ధి పనులకు ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ప్రభుత్వం ఇంటికో మొక్క అనే నినాదంతో ముందుకు వెళితే సమస్య కొంత వరకు తగ్గుతుంది.

చెత్త వాహనాలకు మరమ్మతులు

చెత్తను తరలించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో తరలింపులో ఆటంకాలు ఎదురవుతున్నాయి. బల్దియా వాహనాలకు చిన్నపాటి రిపేరు వచ్చినా నెలల తరబడి వాహనాలు బల్దియా షెడ్డులో కునారిల్లుతున్నాయి. రోడ్లపై నడవక రిపేరుకు నోచుకోక వాహనాలు శిధిలా వస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం 8 టిప్పర్‌లకు 4 పని చేస్తుండగా 4 డంపర్ బిన్‌లకు 2 మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో అటు మునిసిపల్ కార్మికులు, ఇటు బల్దియా అధికారులకు చెత్త సమస్య వెంటాడుతోంది.



డంపింగ్ యార్డు తరలించాలి..



- తొట్ల రాజు, మాజీ కార్పొరేటర్, మడికొండ

మడికొండ శివారులో ఉన్న డంపింగ్ యార్డు వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు రావడంతో 2011లో నేను వార్డ్ మెంబర్‌గా ఉన్న సమయంలో హైకోర్టును ఆశ్రయించాను. దీంతో 2014లో బల్దియా అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. మడికొండలో చెత్త డంపింగ్ ద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నట్టు కోర్టుకు నివేదిక ఇచ్చారు. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యే డంప్‌ను ఇతర ప్రాంతాలకు తరలించి ప్రజల సమస్య పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. కానీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. రాంపూర్‌తో పాటు చుట్టుపక్కల ప్రజ లు పొగతో కళ్లు, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ త్వరలో కోర్టును ఆశ్రయిస్తాను.





వెంకటనారాయణ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్) రంజిత్ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

పెళ్లింట మృత్యు హేల!

- కోనాయిమాకుల రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- పెళ్లి పత్రికలు పంచి వస్తుండగా బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఒంటిమామిడిపల్లిలో విషాదఛాయలు

ఐనవోలు/గీసుగొండ, ఆగస్టు 18: పెళ్లి బాజాలు మోగాల్సిన చోట.. చావు డప్పు మోగింది. మరో మూడు రోజుల్లో కొడుకు వివాహం జరగనుండగా అనుకోని ప్రమాదంలో తండ్రి మృత్యువాతపడడం ఆ ఇంట్లో విషాదం నింపింది. అలాగే ఇదే ఘటనలో మరో యువకుడు మరణించాడు. ఇటీవలే యువకుడికి వివాహం కాగా, అంతలోనే మృత్యువాతపడడంతో స్వగ్రామం ఒంటిమామిడిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, బంధువుల వివరాల మేరకు.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ వెంకటనారాయణ(52), మజ్జిగ రంజిత్ (26)లు ఐనవోలు దేవస్థానం ఒగ్గుపూజారులుగా పనిచేస్తున్నారు. వెంకట్‌నారాయణ కుమారుడు అశోక్ వివాహం ఈ నెల 22న జరగాల్సి ఉంది. దీంతో పెళ్లి పత్రికలను బంధువులకు ఇచ్చేందుకు వరుసకు కొడుకైన రంజిత్‌ను తీసుకొని బైక్‌పై వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగర్రాయికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. వీరితో పాటు పెళ్లికొడుకు అశోక్ కూడా మరో ద్విచక్రవాహనంపై వెళ్లారు. అక్కడ కార్డులు ఇచ్చిన అనంతరం రాత్రి తిరుగు ప్రయాణంలో ఇంటికి రెండు దిచక్ర వాహనాలపై వస్తున్నారు. ఈ క్రమంలో గీసుగొండ మండలం కోనాయిమాకుల సమీపంలోని ఓంకార్ ఫంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెంకట్ నారాయణ, రంజిత్ ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. వెనుకాలే వస్తున్న అశోక్ ఈ హఠాత్‌సంఘటనతో నిశ్చేష్టుడయ్యాడు. కళ్ల ముందు తండ్రి, సోదరుడు మృతిచెందడంతో రోదించాడు.

కాగా ఘటన స్థలాన్ని గీసుగొండ సీఐ బాబులాల్ తన సిబ్బందితో చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎంజీఎంకు తరలించారు. ఆదివారం అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మూడు రోజుల్లో..

వెంకటనారాయణ, దేవేంద్ర దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు. కూతురికి వివాహమైంది. కుమారుడు అశోక్ సైతం ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానంలో తండ్రితో పాటు ఒగ్గు పూజారుడిగా సేవలందిస్తున్నాడు. కుమారుడి పెళ్లి కోసం సంబంధాలు చూస్తూనే ఇటీవల ఇంటిని నిర్మించాడు. పెళ్లి సంబంధం ఖాయమైంది. మరో మూడు రోజులైతే ఆ ఇంట్లో బాజా భజంత్రీలు మోగేవి. అప్పటికే పెళ్లి ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. ఇంతలోనే మృత్యువు ఆ కుటుంబంలో విషాదాన్ని నింపి కల్యాణ తంతును నిలిపివేసింది. కాగా, తన పెళ్లి పత్రికలు పంపిణీ చేస్తూ తండ్రి మృతిచెందడాన్ని అశోక్ జీర్ణించుకోలేకపోతున్నాడు. తల్లి, సోదరితో కలిసి రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. ఇక మజ్జిగ రంజిత్ ఇటీవల ఇండియన్ ఆర్మీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇంతలోనే దూరపుబంధువు యువతితో ఏర్పడిన ప్రేమవ్యవహారం ఆర్మీ ఉద్యోగానికి బ్రేక్ పడింది. యేడాది కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇంటి వద్ద వ్యవసాయపనులు చూసుకుంటూ ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఒగ్గు పూజారిగా సేవలందిస్తున్నాడు. 15 రోజుల కిందట మడికొండ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌లో కొలువుసాధించాడు. ఇంతలోనే మృత్యువు నూతన దంపతులను విడదీసింది.



మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో సోదాలు జరుపుతున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ వలలో ఈవో

- దుకాణదారుడి నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్
- గుంజేడు శ్రీ ముసలమ్మ కార్యనిర్వాహణ అధికారిని పట్టుకున్న అధికారులు
- మరిపెడ ఇంట్లోనూ తనిఖీలు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 18: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలోని శ్రీముసలమ్మ ఆలయ ఈవో భోగోజు భిక్షమాచారి ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ దుకాణ టెండరుదారుడి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

గుంజేడు శ్రీముసలమ్మ ఆలయం ఆవరణలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కిరాణ షాపు ఏర్పాటు చేశారు. గత మే 29న టెండరులో గుంజేడుకు చెందిన పాల్తి రాములు అనేవ్యక్తి ఈ దుకాణాన్ని దక్కించుకున్నాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన నల్లెపు సాంబయ్య ఈ షాపును నడిపిస్తున్నాడు. ఈ దుకాణంలో మద్యం అమ్ముతున్నారని గత జూన్ 11న షాపును దేవాదాయ శాఖ సీజ్ చేసింది. ఈ క్రమంలో దుకాణాన్ని మళ్లీ తెరుచుకోవడానికి సాంబయ్య దేవాదాయశాఖ ఉన్నతాధికారి నుంచి అనుమతి

మిగతా 6వ పేజీలో..

రైతు పక్షపాతి కాంగ్రెస్ సర్కార్

- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో ‘పరకాల’ అభివృద్ధి
- గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తాం..
- ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పరకాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాట్లాడుతున్న మంత్రి

పరకాల, ఆగస్టు 18: తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పరకాల పట్టణంలో రూ.5కోట్లతో ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణ పనులు, రూ.11.74కోట్లతో అమృత్ 2.0 పథకానికి సంబంధించిన పనుల ప్రారంభోత్సవానికి మంత్రి ఆదివారం పరకాల పట్టణానికి విచ్చేశారు. మునిసిపాలిటీ ఆవరణలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రారంభించారు. అనంతరం పరకాల మునిసిపాలిటీ కార్యాలయంలో పరకాల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు, కొనాయమాకుల ప్రాజెక్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కు, గ్రీన్‌ఫీల్డ్ హైవే తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో పరకాల నియోజక వర్గం అభివృద్ధి రూపురేఖలు మారనున్నట్లు తెలిపారు. ఇటీవల కొరియా పర్యటనకు వెళ్లి సీఎం.. టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి పెద్ద కంపెనీలతో చర్చించారని, ఆయా సంస్థల ప్రతినిధులు కొద్ది రోజుల్లో ఇక్కడ పర్యటించి పార్కులో పరిశ్రమలు పెట్టడానికి సముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. అలాగే వరంగల్, హనుమకొండ మీదుగా వెళుతున్న జాతీయ రహదారికి భూసేకరణ జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం అందిస్తామన్నారు. భూములు ఇస్తున్న రైతులకు 40 శాతం వరకు ఇప్పటికి పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆర్భాటంగా మొదలు పెట్టిందని, ప్రస్తుతం భవనం పెచ్చులూడిపోతూ ప్రమాదకరంగా మారిందని అన్నారు. రాబోయే నెల రోజుల్లోనే ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేయాలని ఆదేశించారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లను కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. వెంటనే వారి పేర్ల జాబితాలో అధికారులు రూపొందించాలన్నారు. టెక్స్‌టైల్ పార్కులో సెప్టెంబరు మూడోవారంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాతో ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్య శారద, పి.ప్రావీణ్య, పరకాల మునిసిపల్ చైర్‌పర్సన్ అనిత, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, మునిసిపల్ కమిషనర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయం


- రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు

6



పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజయ్య తదితరులు







చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

వేలేరు మండలం శాలపల్లి యువకుడి ఆత్మహత్య

వేలేరు, ఆగస్టు 18: వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని పంటలను సాగు చేయగా ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో పాటు పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురైన యువ రైతు పురుగుల మందుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆదివారం తెల్లవారు జామున ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఏ సురేష్ తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా వేలేరు మండలం శాలపల్లి గ్రామానికి చెందిన దామెర సమ్మయ్య- కోమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తండ్రి దామెర సమ్మయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం పెద్ద కుమారుడైన దామెర అనిల్ కుమార్ (31) పై పడింది. తమ్ముడు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అలాగే చెల్లెలు వివాహాన్ని ఇటీవలచేశాడు. ఎలాంటి జీవనోపాధి లేకపోవడం, ఎలాంటి ఆస్థులు సైతం లేవు. కేవలం ఇళ్లు మాత్రమే ఉంది. ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. గత మూడు సంవత్సరాలుగా అందులో పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఇందులో అశించిన మేరకు పంట రాకపోవడంతో సుమారుగా రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీనికి తోడు కుటుంబ భారంతో మరో రూ.3.50 లక్షలు, మొత్తం రూ. 6.50 లక్షల వరకు అప్పులైయ్యాయి. దీంతో చేసిన అప్పుల ఎలా తీర్చాలని మరోవేదనకు గురైయ్యాడు. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గమనించిన బంధువులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు, మృతునికి వివాహం కాలేదు. దీంతో మృతుడి తల్లి దామెర కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దామెర అనిల్‌కుమార్ (ఫైల్)



టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రంజిత్



వరంగల్ లీగల్, ఆగస్టు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా హనుమకొండ పట్టణానికి చెందిన న్యాయవాది కూనూరు రంజిత్ నియమితులయ్యారు. టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సస్పెన్షన్

మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రవీంద్రశర్మకు బాధ్యతలు

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం హైకోర్టు ఉత్వర్వులు జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూ రు కోర్టు జడ్జి మట్ట సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఆయన స్థానంలో జనగామ జిల్లా కోర్టు జడ్జి బి.రవీంద్రశర్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది.


బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.











హరికథా గాన సరస్వతి

లక్ష్మీనారాయణ భాగవతార్

- నాలుగు దశాబ్దాలుగా కళారంగంలో తనదైన ముద్ర
- ఒడిదొడుకులను ఎదురైనా కళామతల్లి సేవలోనే..



మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య చేతుల మీదుగా సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ



జనగామ కల్చరల్, ఆగస్టు 18: హరికథ తెలుగువారి విశిష్ట ప్రక్రియ. రాగ - తాళ - హావ - భావ ప్రకటనలతో శ్రోతలను, ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో దానికదే సాటి. జానపదులకు, పండితులకు అందరికీ ఇష్టమైన కళాప్రక్రియ. వేదికపై ఓ వ్యక్తి నిలబడి తాను గానం చేస్తున్న హరికథలో వచ్చే పాత్రలన్నిటిని తానే ధరించి నటించి చూపాలి. అందుకే సర్వకళల సమాహారమే ఈ హరికథ గాన ప్రక్రియ. ఈ హరికథను తెలుగువారి సంస్కృతి చమత్కారంగా భావిస్తారు. కళలకు ఆదరణ తగ్గిపోతున్న సమయంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యం కలిగి భగవన్నామస్మరణ చేస్తూ, పట్టు వస్త్రాలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టి, నొదుట నామాన్ని దిద్దుకొని, చేతిలో చిరుతలు పట్టుకొని, హరినామ స్మరణ చేస్తూ, హరికథ ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు జనగామ జిల్లాకు చెందిన హరికథకుడు బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్. బొడిగె అంజమ్మ, శివయ్య దంపతులకు 1954 సెప్టెంబరు 25న జన్మించిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో బీటీఎల్ పట్టా పుచ్చుకొని హరికథా గానంతో జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రముఖ తెలుగు పండితులు పండితారాధ్యుల రామగిరి నాగయ్య శాస్త్రి, ప్రముఖ సంస్కృత పండితులు, దేవీ ఉపాసకులు మాదవపెద్ది చిన వెంకన్న శాస్త్రి, ప్రముఖ రచయిత నెల్లుట్ల నర్సింహారావు లక్ష్మీనారాయణకు సాహిత్య గురువులు. 40ఏళ్లగా రాజరాజేశ్వరీదేవి అమ్మవారినే ధ్యానిస్తూ హరికథ కళారంగంలో ఒడిదుడుకులు ఎదురైనా ఆ కళామతల్లికి సేవలోనే ఉన్నారు.

ప్రదర్శనలు.. సత్కారాలు.. అవార్డులు..

లక్ష్మీనారాయణ తన 14వ యేట 7వ తరగతి చదువుతున్న రోజుల్లో తల్లిదండ్రులతో కలిసి భద్రాచల దేవస్థానానికి వెళ్లి ఆ పవిత్రమైన గోదావరి నదీ తీరాన 'శ్రీ సీతారామ కళ్యాణం', 'భద్రాద్రి వైభవం' అనే సంగీత రూపకాన్ని రచించి స్థానిక చెన్న కేశవ స్వామి భజన మండలిలో చేరి అనేక వేదికల ద్వారా గానం చేశారు. 1972లో హైద్రాబాద్ ఆకాశవాణి, యువవాణిలో ఈ రూపకాన్ని గానం చేశారు. 1973లో స్థానిక నాటక కళాసంస్థ శ్రీ నటరాజ కళానికేతన్‌లో గాయకుడిగా చేరి తన గాన కళను అభివృద్ధి చేసుకున్నారు. 1975లో స్వతహాగా శ్రీ నటరాజ సంగీత విభావరి అనే పేరుతో ఒక సంస్థను స్థాపించి ప్రదర్శనలు ఇస్తూ ఔత్సాహిక గాయనీ గాయకులతో కలిసి భక్తి ప్రధానమైన సంకీర్తనలో కూడిన పాటక కచేరీలు చేశారు. ఆలిండియా రేడియో కేంద్రం ద్వారా అనేక ప్రత్యేక సంగీత రూపకాలైన నల్లనివాడు, దివ్య దీపావళి, హోలీ సంబరాలు, ఉగాది వేడుక, సంక్రాంతి సరదాలు, బతుకమ్మ సౌందర్యం మొదలగు రూపకాలు రచించి స్వయంగా సంగీతాన్ని సమకూర్చి ఆలిండియా రేడియో ద్వారా సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ద్వారా మైసూరు, మద్రాసు, మహారాష్ట్ర, బిహార్, ఛత్తీస్‌గఢ్, రాయపూర్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో హరికథా గానం చేసి అనేక సత్కారాలు, బిరుదులు అందుకున్నారు. ఓ వైపు ప్రదర్శనలిస్తూనే మరోవైపు హైద్రాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో హరికథ డిప్లొమా కోర్సు పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1995లో మద్రాసు భాగవతా సేవా మండలి వారితో సత్కారం అందుకున్న ఆయన.. ప్రముఖ సినీ నటుడు పొట్టి ప్రసాద్ చేతుల మీదుగా గానకోకిల బిరుదును అందుకున్నారు. కందుకూరి వీరేశలింగం జన్మదినం సందర్భంగా 2011లో నాటి ఏపీ ప్రభుత్వం తరఫున కలెక్టర్ రాహుల్ బొజ్జా చేతుల మీదుగా రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు. 2013లో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని, 2015లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డితో సన్మానం అందుకున్నారు. 2024లో విజయనగరం ఆదిబట్ల నారాయణదాసు సంస్థ ఆధ్వర్యంలో హరికథా భాస్కర అనే బిరుదును, తాడేపల్లిగూడెంలో ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముఖ ఆంజనేయ రాజు సంస్థ ఆధ్వర్యంలో 'హరికథా గాన సరస్వతి', సిద్దిపేటలోని ఎస్ఎస్‌సీ ఛానల్ ఆధ్వర్యంలో 'హరికథా కేసరి' బిరుదులను అందుకున్నారు. యువ సంగీత దర్శకులు, కవి చిలుమోజు సాయికిరణ్ రచించిన కవనతీగ కవితా సంపుటి పుస్తకావిష్కరణ సందర్భంగా 'జీవిత సాఫల్య పురస్కారం', 'హరికథా కళాబంధు' బిరుదును పొందారు. తెలంగాణ సమైక్యతా వజ్రోత్సవాలను పురస్కరించుకొని నాటి ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య, జడ్పీ చైర్మెన్ పాగాల సంపత్‌రెడ్డి చేతుల మీదుగా ఘన సన్మానం పొందారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

భరత నాట్యమయూరి..





ప్రశంసా పత్రాలు, అవార్డులతో అలకనంద

మల్హర్, ఆగస్టు 18 : ఆ చిన్నారి వయసు 12యేళ్లు. ఆరో తరగతి చదువుతోంది. తనకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువతో ఓ గురువు వద్ద నాట్యం నేర్చుకుంటూనే.. సోషల్‌మీడియాలో అందుబాటులో ఉన్న నృత్య సాధన వీడియోలు చూసి మరింత సాధన చేసింది. చిన్నవయసులోనే పలు వేదికలపై ప్రదర్శనలిచ్చి ఔరా అనిపించుకుంటోంది భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ అలకనంద రాథోడ్. శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ అనేక ప్రశంస పత్రాలు, అవార్డులతో పాటు ప్రముఖులు, సాహితీ ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలకనంద తండ్రి బానోత్ రాజ్‌కుమార్ మాజీ సైనికుడు, తల్లి దివ్య గృహిణి. ప్రస్తుతం వారు భూపాలపల్లిలో నివాసం ఉంటుండగా.. అలకనంద పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సాహిత్య రంగంలో పట్టున్న తండ్రి రాజ్‌కుమార్.. తన కూతురు అలకనందకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువను గుర్తించి.. రెండేళ్ల క్రితం పట్టణంలో నాని మాస్టర్ వద్ద చేర్పగా.. ఆయన శిక్షణ, సలహాలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అలకనంద సోషల్ మీడియాలో వివిధ నాట్యాల వీడియోలు చూస్తూ సాధన ప్రారంభించి నాట్యంపై పట్టు పెంచుకుంటోంది. ఈ క్రమంలోనే పలు వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇస్తూ సత్తా చాటుతోంది. భూపాలపల్లిలో సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో, శ్రీరామ నవమి ఉత్సవాలు, గణపతి నవరాత్రి ఉత్సవాలు, హైదరాబాద్ రవీంద్రభారతి, త్యాగరాయ గానసభల్లో నిర్వహించిన పలు జాతీయ స్థాయి నృత్య పోటీలు, ప్రదర్శనలు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బడాఖానా వేడుకలు, తదితర వేదికలపై నృత్య ప్రదర్శనలు చేసింది. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రశంసా ప్రతం, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ జన్మదిన వేడుకల్లో ప్రశంస పత్రం, ఉగాది పురస్కార వేడుకల్లో నాట్య కళా ప్రవీణ అవార్డు, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి ఆధ్వరంలో ఇటీవల గాతమి నంది అవార్డు అందుకుంది. అలాగే జాతీయస్థాయి ఐకాన్ అవార్డు కూడా సొంతం చేసుకుంది. నాట్యంతో పాటు చదువులోనూ రాణిస్తున్న అలకనంద ఐఏఎస్ కావడమే లక్ష్యంగా తన భవి



జాతీయస్థాయి గౌతమి నంది అవార్డును అందుకుంటున్న అలకనంద

సౌకర్యాల లేమిలో గ్రంథాలయాలు

- నిధుల కొరతతో వసతులు కరువు
- తీవ్ర సిబ్బంది కొరత
- ఉన్నవారిపైనే పని భారం
- పదేళ్లుగా జరగని నియామకాలు
- పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నిర్వహణ



హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని జిల్లా క్రేంద గ్రంథాలయం

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలు నిధులలేమివల్ల అనేక సమస్యలతో కూనారిల్లుతున్నాయి. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు కనీసం సౌకర్యాలు కల్పించలేకపోతున్నాయి. ఆరేళ్లగా గ్రంథాలయాలకు బడ్జెట్ రావడం లేదు. దీంతో కరెంట్ బిల్లులు కట్టలేని దయనీయ స్థితి నెలకొన్నది. బిల్లులు చెల్లించకపోతే కరెంట్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ సంస్థ ఇప్పటికే వీటికి రెండు మూడు సార్లు నోటీసులు జారీ చేసింది. గ్రంథాలయాలకు పేపర్ బిల్లులు చెల్లించడానికి కూడా డబ్బులు లేవు. ఆరు నెలలుగా పేపర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పేపర్‌బాయ్‌లు బిల్లుల కోసం కాళ్లరిగేలా తిరుగు తున్నారు. బిల్లులు ఎంతకూ చెల్లించకపోవడంతో కొన్ని చోట్ల గ్రంథాలయాలకు పేపర్లు వేయడాన్ని మానుకున్నారు. కాలిపోయిన బల్బులను మార్చాలన్న, విరిగిపోయిన కుర్చీలకు మరమ్మతులు చేయించాలన్నా కూడా డబ్బులు లేక ఉద్యోగులు సతమతమవుతున్నారు.

వెల్లువలా ఉద్యోగార్థులు

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ అవుతున్నాయి. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో గ్రంథాలయాలకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలు అభ్యర్థులతో కిటకిటలాడు తున్నాయి. కూర్చోవడానికి కుర్చీలు కూడా సరిపోవడం లేదు. సరిపోయేన్ని కుర్చీలు సమకూర్చడానికి గ్రంథాలయాల వద్ద డబ్బుల్లేవు. దీనితో పాఠకులు ఏదోవిధంగా సర్దుకొని కూర్చొని చదువుకుంటున్నారు. పాఠకులకు కావలసిన స్టడీ మెటీరియల్ కోసం మార్కెట్‌లోకి వచ్చిన కొత్త పుస్తకాలను గ్రంథాలయాలు సమకూర్చలేకపోతున్నాయి. పాత పుస్తకాలతోనే పాఠకులు ఎలాగోలా సర్దుకుపోతున్నారు. కొత్త పుస్తకాల కోసం ఇండెంట్ పెడితే ఎప్పుడో గానీ రావడం లేదు. పాఠకులు డిమాండ్ బుక్‌లో రాసిన ఏ నెల రోజులకో గానీ అందడంలేదు. ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులు కరెంట్ అఫైర్స్ కోసం ఎక్కువగా వివిధ పత్రికలపై ఆధారపడుతుంటారు. ఎన్ని ఎక్కువ పత్రికలు చదివితే అంత తాజా మెటీరియల్ దొరుకుతుంది. కానీ డబ్బులు లేక ఏవో గ్రంథాలయాలు ఏవో కొన్ని పత్రికలను మాత్రమే పాఠకులకు సమకూర్చగలుగుతున్నాయి.

తీవ్ర సిబ్బంది కొరత

గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టేంత మంది మాత్రమే ఉన్నారు. లైబ్రరీలన్నీ ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నడుస్తున్నాయి. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో సహా ఆరు జిల్లా గ్రంథాలయాలు, 50 మండల కేంద్రాల్లో 50 బ్రాంచ్ లైబ్రరీలు ఉన్నాయి. మండలాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఇప్పటి వరకు లైబ్రరీల ఏర్పాటు జరగలేదు. ఈ మండలాలకు చెందిన పాఠకులు పొరుగు మండలాలలోని లైబ్రరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉద్యోగ నోటిఫికేషన్ల వల్ల ఈ గ్రంథాలయాలు కూడా నిరుద్యోగ పాఠకులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. ఈగ్రంథాలయాల్లో 150 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 21 మంది మాత్రమే ఉన్నారు. ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు మరో 50 మంది ఉన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారి నియామకాలు జరగటం లేదు. 1993 నుంచి కొత్త రిక్రూట్‌మెంటే లేదు. ప్రతీ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 25 నుంచి 30 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 50మందికిపైగా ఔట్‌సోర్సింగ్, లేదా పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉండాలి. అలాగే మండల కేంద్రంలోని బ్రాంచ్ లైబ్రరీలో 5గురు రెగ్యులర్ ఉద్యోగులు, 10 మంది ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా కేంద్ర గ్రంథాలయాల్లో 10 మందికన్నా తక్కువగా రెగ్యులర్ ఉద్యోగులు, 15 మంది వరకు ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పలు గ్రంథాలయాల్లో స్వీపర్లు లేరు. కొన్ని లైబ్రరీలను ఊడ్చేపనిని పార్ట్‌టైమ్ ఉద్యోగులే చేస్తున్నారు.

చైర్మన్లు లేరు..

జిల్లా కేంద్ర గ్రంథాలయాలకు చైర్మన్లు లేరు. గత బీఆర్ఎస్ హయాంలో నియమితులైన చైర్మన్లు రాజీనామా పెట్టడంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. హనుమకొండలోని బీఆర్ఎస్ సర్కా రు హయాంలో నియమితులైన జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్ లోక్‌సభ ఎన్నికల ముందు తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి ఈ లైబ్రరీకి చైర్మన్ లేదు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన తర్వాత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఉద్యోగార్థులంతా లైబ్రరీలకు వెల్లువలా వస్తున్నారు. పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించలేని గ్రామీణ నిరుపేద నిరుద్యోగులు స్టడీ మెటీరియల్ కోసం లైబ్రరీలనే ఆశ్రయిస్తున్నారు. ఈ దృష్ట్యా వాటిని పటిష్ఠం చేయాలని ప్రజలు కోరుతున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. సిబ్బంది కొరతను తీర్చాలని కోరుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతి సంబురం

ఉమ్మడి జిల్లాలో 476 మంది జెఎల్‌ఎంలకు ఏఎల్‌ఎంలుగా పదోన్నతి



ఏడీఈ నుంచి ఏఎల్‌ఎంగా ఆర్డర్ కాపీని అందుకుంటున్న దృశ్యం

హనమకొండ టౌన్, ఆగస్టు 18: జేఎల్‌ఎంలకు ఏఎల్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని డివిజనల్ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసి సిబ్బందికి ఆర్డర్ కాపీలను అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు చేపట్టాలని, మరోవైపు ఎస్సీ, ఎస్టీ అసోయేషన్లు మాత్రం రిజర్వేషన్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోర్టుకు వెళ్లాయి. కోర్టు తీర్పు పెండింగ్‌లో ఉండటంతో యాజమాన్యం బదిలీలు ముందుగా చేపట్టాలని ఆలోచనకు వచ్చింది. ఈక్రమంలోనే ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై జాక్‌గా ఏర్పడి ముందుగా పదోన్నతులపై దృష్టి సారించాలని సీఎండీ వరుణ్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు.

కాగా, పదోన్నతులపై కోర్టు వెలువరించే తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు తదుపరి చర్యలు తీసుకోబడుతాయని షరతులు విధిస్తూ అర్హత ఉన్న ప్రతీ జెఎల్‌ఎంకు ఏఎల్‌యంగా పదోన్నతి కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న దగ్గరే విధులను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఉద్యోగ సంఘాల చొరవ, కంపెనీ నిర్ణయంతో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి 5 జిల్లాల్లో 2,361 మంది జెఎల్‌ఎంలు ఏఎల్‌యంలుగా పదోన్నతి పొందగా, ఉమ్మడి వరంగల్‌లో 476 మంది ఏఎల్‌ఎంలుగా పదోన్నతి పొందారు. వారిలో హనుమకొండ-119, వరంగల్ -101, జయశంకర్ భూపాలపల్లి, ములుగు- 98, జనగామ- 73, మహబూబాబాద్- 85మంది పదోన్నతి పొందారు.

మల్లన్నకు రూ.10 లక్షల రథం బహుకరణ

ఐనవోలు, ఆగస్టు 18 : ఐనవోలు మల్లికార్జునస్వామికి భక్తుడు రథం బహూకరించాడు. సుమారు రూ.10 లక్షల విలువచేసే రథాన్ని టేకు కర్రతో కళాకృతి ఉట్టిపడే విధంగా తయారు చేయించారు. హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన మల్లన్న భక్తులైన తాటికొండ రమాదేవిమల్లేశం దంపతులు తమ కుమారులైన కే.శే. రాజు, రంజిత్‌ల జ్ఞాపకార్థం రథాన్ని ఆలయానికి తయారు చేయించి ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం రథంను ఆలయానికి అందజేయగా ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు రథంను శుద్ధిచేసి గణపతిపూజ, పుణ్యాహ వచనం పూజలు చేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంలో పెట్టి మాడ వీధులగుండా ప్రదక్షిణలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలైన మల్లేశం దంపతులకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దాత బహుకరించిన రథంను ప్రారంభిస్తున్న ఈవో, అర్చకులు

ఆరోగ్యశ్రీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

లేకుంటే ఈ నెల 20 తర్వాత సమ్మె

వరంగల్ మెడికల్, ఆగస్టు 18: రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలని, ఆరోగ్య మిత్రలకు కూడా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షురాలు శిరీష డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 20 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాలకు ఇప్పటికే పలుమార్లు కలిశామని, అయినప్పటికీ తమ జీతాల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ జీతంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వాపోయారు. 17 ఏళ్ల నుంచి అర్ధాకలితో అలమటిస్తున్న తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీవో 60 ప్రకారం రూ.22,750 వేతనం తక్షణమే చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కనీస వేతనాన్ని రూ.35వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

కవులు కలాలను ఎత్తాలి..

అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18: పాలకుల నియంతృత్వ పోకడలను నిరసిస్తూ కవులు తమ కలాలను ఎత్తాలని అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బీఎడ్ కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం నిధి బ్రహ్మచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ.. బ్రిటీష్ వలసవాద దోపిడీని, దౌర్జన్యాల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో ప్రభావితమై జాతీయ వాద బావజాల స్ఫూర్తితో కాలాన్ని, గళాన్ని ఎత్తడం కోసం 1936లో ఆవిర్భవించిన సంఘం అభ్యుదయ రచయితల సంఘం అని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వెంకటి, మహ్మద్ సిరాజొద్దీన్‌లు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లా అరసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, సహ అధ్యక్షులుగా చందనాల సుమిత్ర, ఉపాధ్యక్షులుగా ఆనందాచారి, కాసుల రవికుమార్, సోమ నర్సింహచారి, చాగంటి కిషన్, రసూద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా గజ్జెల స్వరూపరాణి, సహాయ కార్యదర్శులుగా నరేందర్‌రెడ్డి, రాజు, సోమేశ్వరాచారి, రంగాచారి, లెనిన్, క్రాంతి కుమార్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ● పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 4కే రన్



4కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌లు, సీపీ

బాలసముద్రం, ఆగస్టు 18: వరంగల్ నగరాన్ని డ్రగ్స్‌ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా వెల్లడించారు. ఆదివారం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 4కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ కలెక్టర్‌లు పి.ప్రావీణ్య, డాక్టర్ శారద, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో పాటు జబర్దస్త్‌ఫేం అదిరే అభి ముఖ్య అతిథులుగా పాల్గొని 4కే రన్‌ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 4కే రన్‌లో పోలీసులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌నుంచి అదాలత్ సెంటర్ వరకు, తిరిగి అక్కడి నుంచి పోలీస్ పరేడ్‌గ్రౌండ్ వరకు 4కే రన్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా నగదు పురస్కారాలను అందించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌ను వ్యతిరేకించాలని, డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నియంత్రించేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను సేవించేవారిని వాటినుంచి దూరం చేసేందుకు అందరు ప్రయత్నించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తోపాటు ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, సీఐలు సత్యానారాయణరెడ్డి, పి.కిషన్, సతీష్‌కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఏడీలు

ఆర్జేడీ కార్యాలయంలో పర్యవేక్షణ కరువు



ఏడీ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీలు) కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 19 జిల్లాలకు పర్యవేక్షక కార్యాలయంగా ఉంటున్న ఆర్జేడీ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన ఏడీలు.. ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో సిబ్బంది జీతభత్యాలకు సంబంధించిన బిల్లులను చేయాల్సిన డీడీవోగా బాధ్యతలు ఉన్న ఏడీ కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక స్థానికంగా ఉండే మరో ఏడీ ఆయన ఎప్పుడు వస్తారో తెలియదని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఉండే సదరు అధికారి అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఇక మరో ఏడీ స్థానికంగానే ఉంటూ కార్యాలయానికి రావడం లేదనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా ఈ మధ్యనే కార్యాలయానికి బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ అదే దారిలో వెళుతున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ కరువు

ఏడీల విషయం తెలిసినా ఆర్జేడీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆర్జేడీ వివిధ జిల్లాల్లో పర్యటించిన సందర్భంలోనూ ఏడీల గైర్హాజరుపై దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా విధులకు రాకుండానే వేతనాలు అందుకుంటున్న ఏడీలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.

ముగ్గురు ఎస్‌ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 18: వరంగల్ పోలీస్ కమిష నరేట్ పరిధిలో ముగ్గురు ఎస్‌ఐలను ఆదివారం బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో కె.శ్రావణ్ కుమార్ హనుమకొండ నుంచి రాయపర్తి, వి.సందీప్ రాయపర్తి నుంచి వీఆర్‌కు, డి.సాంబయ్య సీసీఎస్ నుంచి మట్టెవాడకు బదిలీ అయ్యారు.

ముచ్చర్లలో నేతాజీ వర్ధంతి

హసన్‌పర్తి, ఆగస్టు 18: గ్రేటర్ 1వ డివిజన్ ముచ్చెర్లలో స్వాతంత్ర్య సమరయోధుడు ఆజాద్ హిందూ ఫౌజ్ అధ్యక్షుడు నేతాజీ సుభాష్ చ్రందబోస్ 79వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్‌రెడ్డి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిర్ర శ్రవణ్‌కువర్‌రెడ్డి, వెంకటేష్, రూపేష్, పవన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీపై రెవెన్యూ అధికారుల దాడులు

హసన్‌పర్తి, ఆగస్టు 18: మండలంలోని అనంతసాగర్ రెవెన్యూ శివారు 195 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో గత కొంతకాలంగా పెద్ద పెద్ద గోతులు తీసి మట్టితో అక్రమంగా ఇసుక తయారు చేస్తున్న ఇసుక తయారీ కేంద్రంపై తహసీల్దారు చల్ల ప్రసాద్ ఆదేశాల మేరకు ఆదివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్ దాడి చేసి మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 10 సంవత్సరాలుగా ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని అక్రమ ఇసుక తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు సబంధిత ఇరిగేషన్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్ తెలిపారు.

రియాజ్‌ను సన్మానించిన హెప్సిబా ట్రస్ట్ ఫౌండర్

హసన్‌పర్తి, ఆగస్టు 18: మండలంలోని సీతంపేటకు చెందిన హెప్సిబా మెమోరియల్ ట్రస్ట్ గ్రంథాలయ ఫౌండర్ గిన్నారపు సదానందం ఆదివారం తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌ను మర్యాదపూర్వకంగా కలి సి పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. సీతంపేటలో హెప్సిబా మెమోరియ ల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైబ్రరీకి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారిక కోసం మెటీరియల్‌ను పంపించేందుకు సహకరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రియాజ్ సంబంధిత శాఖ అధికారులకు ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూర రవి, రఘుపాల్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, తోకల ఆదిరెడ్డి, బాషబోయిన సమ్మయ్య, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు పరామర్శలు

ఐనవోలు, ఆగస్టు 18: వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కోనాయిమాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వెంకటనారాయణ, రంజిత్ మృతదేహాలను పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఎంజీఎం మార్చురీలో ఉన్న వెంకటనారాయణ, రంజిత్ మృతదేహాలకు ఎమ్మెల్యే కేఆర్ నాగారాజు నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు వేరు వేరుగా స్వగ్రామంలో భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర స్థాయి నాయకులు మల్లాడి తిరుపతిరెడ్డి, బన్న ప్రభాకర్‌లతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు వెంకటనారాయణ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులు సానుభూతి తెలిపారు.

చికిత్స పొందుతూ మత్స్య కార్మికుడి మృతి

హసన్‌పర్తి, ఆగస్టు 18: చికిత్స పొందుతూ మత్స్యకార్మికుడు మృతి చెందిన ఘటన ఆదివారం భైరాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చేరాలు కథనం ప్రకారం.. మండలంలోని భైరాన్‌పల్లికి చెందిన ముల్కలపల్లి రాజకొమురయ్య కుమారుడు కుమారస్వామి(48) చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనెల 14న నాగారం పెద్ద చెరువు కాపలాకు వెళ్లి తిరిగి భైరాన్‌పల్లికి వస్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి తీవ్రగాయాలయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కుమారస్వామికి భార్య, కూతురు ఉన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

- బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు18: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. పాపన్న గౌడ్ 374వ జయంతి ఉత్సవాలు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్యతోపాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు రాంరెడ్డి, వివిధ కుల సంఘాల నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.వి గణేష్, తాళ్లపల్లి రామస్వామిగౌడ్, గౌని సాంబయ్య గౌడ్, గుర్ర శ్రీనివాస్‌గౌడ్, చిర్ర రాజు గౌడ్, బైరి లక్ష్మీనారాయణగౌడ్‌తోపాటు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజనికాంత్, మేకల బాబురావు, రఘు, రాంమూర్తి, వెంకన్న, మహేష్, శ్రీధర, సదాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- ఐనవోలు: సర్దార్ పాపన్న జయంతిని గౌడ కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. నందనంలో పాపన్నగౌడ్ విగ్రహాని కి పూలమాలలు సమర్పించారు. ఐనవోలు, వెంకటాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర సురేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు దొనికెన యాదగిరిగౌడ్, మాజీ ఎంపీటీసీ మండల సత్యంగౌడ్, నాయకులు తాళ్లపెల్లి అంజనేయులు, బుర్ర కుమారస్వామి, బుర్ర యాకాంబ్రం, వల్లాల రాజు, బండి స్వామిచీకటి ఎల్లగౌడ్, గవాస్కర్‌గౌడ్, వెంకటాపూర్‌లో అధ్యక్షుడు బత్తిని నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షుడు మండల కుమార్,పూజారి రాంచంద్రం, శ్రీనివాస్, రమేష్,వెంకటేశ్వర్లు, సాయికుమార్, ఐనవోలు గౌడం సంఘం అధ్యక్షుడు కొట నర్సయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.
- హసన్‌పర్తి: మండలంలోని ముచ్చెర్లలో సర్వాయి పాపన్న గౌడ్ గ్రామ కమిటీ కన్వీనర్ చిర్ర సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. సర్వాయి పాపన్న ఉద్యమం, ఆయన జీవిత ఆశయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పెరుమాండ్ల అనిల్, చల్ల వెంకటేశ్వర్లు, చిర్ర సత్యం, శ్రావణ్, రాజేష్, సుమన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.
- వడ్డెపల్లి: సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చి జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ (కల్లు మండువ) జంక్షన్‌లో గోపాల్‌పూర్ గౌడ సంఘం అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్, ప్రతినిధి వల్లాల రాజ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సంఘం జిల్లా అధికార ప్రతినిధి అయిలి నారాయణ గౌడ్ అన్నారు. ఆదివారం పాపన్న గౌడ్ జయంతిని హనుమకొండ గోపాల్‌పూర్‌లోని విష్ణుపురి కాలనీలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మడికొండ: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాన్న ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌని సాంబయ్యగౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం కాజీపేట మండలం రాంపూర్‌లో కల్లుగీత కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి, గ్రామ గీత పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు గడ్డం వీరాంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో అమరుల యాది ముగింపు కార్యక్రమం, సర్వాయి పాపన్న 374వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాంబయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోడెం రాజేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి రంజిత్, సొసైటీ ఉపాధ్యక్షుడు బండి రాజు, కార్యదర్శి, మండల సోషల్ మీడియా కన్వీనర్ గడ్డం రవి, కార్యవర్గ సభ్యులు, సంఘం పెద్దలు, గీత కార్మికులు పాల్గొన్నారు.



పాపన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు

కళ్లకు గంతలతో జూడాల నిరసన

ఐదో రోజుకు చేరిన నిరసన కార్యక్రమం



ఎంజీఎంలో కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న జూడాలు

వరంగల్ మెడికల్, ఆగస్టు 18: కోల్‌కత్తాలోని మెడికల్ కాలేజీ యువ వైద్యురాలి అత్యాచార, హత్య ఘటనకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. జూడాలు చేపట్టిన నిరసన ఐదో రోజుకు చేరుకుంది. కేంద్ర రక్షణ చట్టం అమలు చేసి డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఎంజీఎం వద్ద ధర్నా శిబిరం రాఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ జూడాలు ప్రకటించారు. న్యాయం కోసం, మహిళా రక్షణ కోసం జూడాలు నిరసన శిబిరంలో రాఖీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుపేర్కొన్నారు.

కఠినంగా శిక్షించాలి

వరంగల్ ఎడ్యుకేషన్: కలకత్తాలో మెడికోను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో భోగేశ్వర్ మాట్లాడారు. మెడికోను అత్యాచారం చేసి హత్య చే యడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దోషులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమ, మంగళవారాల్లో టీపీటీఎఫ్ నాయకులు నిరసన ప్రదర్శనలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి. వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్, జె. స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘటన దురదృష్టకరం

హనుమకొండ: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిపై జరిగిన హత్యాచారం దురదృష్టకరమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. బాధ్యులు ఎంతటి వారైనా కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అమానవీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండడానికి సత్వర కఠిన శిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు చట్టాల రూపకల్పన జరగాలన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉండాలి

వరంగల్ కార్పొరేషన్: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన తనను కలిచివేసిందని, నిందితులను గుర్తించి కఠిన శిక్ష విధించాలని మేయర్ గుండు సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఈ ఘటన జరగడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. దేశమంతా బాధిత కుటుంబాలనికి అండగా ఉంటుందని తెలిపారు. నిందితులు ఎంతటి వారైనా అక్కడి ప్రభుత్వం గుర్తించి చట్టపరమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను రక్షించే గౌరవ ప్రధమైన డాక్టర్ వృత్తి నిర్వర్తిస్తున్న వైద్యురాలిపై ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని అన్నారు.

సందడిగా జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ ఎంపికలు



రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 18: హనుమకొండ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ ఎంపికలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఆదివారం కాజీపేట సెయింట్ గ్యాబ్రియేల్ పాఠశాలలో అండర్ -16 బాల బాలికల బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాళ్ళపల్లి రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాల నుంచి నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో 52 మంది బాలబాలికలు పాల్గొన్నారని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 25, 26 తేదీలలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి డోలి సాంబయ్య, కోచ్‌లు ఎండీ ఇర్ఫాన్, సునీలా, యశ్వంత్, పీఈటీ విజయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు శ్రీకాంత్, సాగర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైంది వీరే..

బాలికల విభాగంలో మీనాక్షి, రింషా, బ్రింద, యుక్తిశ్రీ, మేరిహసిని, వేలిక, తేజస్వీ, కుందన్, నక్షత్ర, అక్షయ, అక్షర, లేస్లీ, స్టాండ్‌బైలుగా.. శారన్, తస్వీ, అశ్విత, సుదీక్ష. బాలుర విభాగలో.. దేవిశ్రీ, చండిశ్రీ, అభిరామ్, చరణ్, రిఖిల్, రాజాఆర్యణ్, ప్రమోద్, సాత్విక్, జశ్వంత్, అక్షత్, సుశాంక్, చారువాక, స్టాండ్‌బైలుగా మహిషిత్, తోహన్, హర్షిత్, అభినయ్.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18: మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ఎంఎస్‌టీఎఫ్) జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ స్కూల్ టీచర్లకు బదిలీలు చేపట్టాలన్నారు. 010 పద్దు కింద మోడల్ స్కూల్ టీచర్లకు వేతనాలు చెల్లించాలన్నారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు కల్పించాలని, హెల్త్ కార్డులు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న పీజీటీ, టీజీటీ నియామకాలను చేపట్టాలని, పీజీటీలను జూనియర్ లెక్చరర్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎంఎస్‌టీఎఫ్ ములుగు జిల్లా అధ్యక్షుడు అయాజ్‌ఖాన్, యూటీఎఫ్ నాయకులు రవీందర్‌రాజు, కుమార్, సుజన్‌ప్రసాద్, సత్యనారాయణ, డీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ రామిరెడ్డి,టీచర్లు సీలాద్రి, వెంకటేష్, రాజిరెడ్డి, అశోక్, సౌమ్య, సుఖద పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ఎంఎస్‌టీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్

'చెత్త'శుద్ధి ఏదీ?!

(5వ పేజీ తరువాయి)

వల్ల చుట్టుపక్కల ప్రజలు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఈ డంప్ యార్డు ద్వారా మడికొండ, రాంపూర్, కడిపికొండ, ధర్మసాగర్, నర్సింగరావుపల్లె, ఎలుకుర్తి, టేకులగూడెం, పెద్దపెండ్యాల, డీజీల్‌కాలనీ, సోమిడి, కాజీపేట ప్రాంతాల్లో నివసించే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెత్త డంప్‌కు నిప్పుపెట్టడంతో ఆ ప్రాంతం పొగతో కప్పుకుని ఉంటోంది. చుట్టుపక్క గ్రామాలు నిత్యం పొగతో నిండిపోయి ఉంటుందని అంటున్నారు. కాలుష్యంతో కూడిన పొగవల్ల టీబీ, ఊపిరితిత్తుల జబ్బులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి డంపింగ్ యార్డు తరలించాలని పలుమార్లు మడికొండ వాసులు జాతీయ రహదారిపై ఆందోళన చేసిన సంఘటనలున్నాయి. అంతేకాక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అలాగే ఈ డంప్‌యార్డులోని బయోమైనింగ్‌లో కొంత శుద్ధి చేసిన చెత్తను మిషన్‌ల ద్వారా పిండగా వచ్చిన నీరు.. పిలివాగు, సోమిడి కాలువ గుండా వడ్డెపల్లి చెరువులో కలుస్తున్నాయి. ప్రస్తుతం వడ్డెపల్లి చెరువు నీరు నగర ప్రజలకు తాగునీరుగా ప్రజలకు అందిస్తున్నారు. ఈ డంప్ యార్డును నగరానికి ఇంకా దూరంగా తరలించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి పొంగులేని ఆదేశాలు బేఖాతరు

వరంగల్ చుట్టుపక్కల ప్రాంతంలో ఆధునిక హంగులతో మరో చెత్త డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ఇటీవల హైదరాబాద్‌లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, బల్దియా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, అధికారులు కొత్త డంపింగ్ యార్డ్‌కు స్థలసేకరణ చేయాలని ఆదేశించారు. కానీ ప్రజాప్రతినిధులు ఎవరి పనుల్లో వారు బిజీబిజీగా ఉండడంతో వరంగల్‌లో రెండో డంపింగ్ యార్డ్ అనేది కలగానే మిగిలింది.

ఏసీబీ వలలో 'శ్రీముసలమ్మ' ఈవో

(5వ పేజీ తరువాయి)

తీసుకువచ్చాడు. అయితే షాపు పునరుద్ధరణకు లంచం ఇవ్వాలని ఈవో భిక్షమాచారి నెల రోజులుగా డిమాండ్ చేస్తున్నాడు. లేకుంటే మళ్లీ షాపును సీజ్ చేయిస్తానని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఈ విషయంపై సాంబయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో ఆదివారం మధ్యాహ్నం గుంజేడుకు వచ్చిన అధికారులు.. సాం బయ్యకు రూ.20వేలు ఇచ్చి ఈవో భిక్షమాచారి ఇప్పించారు. ఈవో రూ.20వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగ దు స్వాధీనం చేసుకుని కెమికల్ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం భిక్షమాచారిని కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబ య్య తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్‌లు శ్యాంసుందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడోలోని ఈవో ఇంట్లో తనిఖీలు

మరిపెడ: మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో ఆదివారం రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవోగా పని చేస్తున్న భిక్షమాచారి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఈవో ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు తెలిపిన వివరాల ప్రకా రం.. మరిపెడలోని ఈవో ఇంట్లో రూ.70వేలు నగదు, 270 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారు ఆభరణాలు లభించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఆయన వెంట ఏసీబీ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 18: హార్టికల్చర్ కార్మికులకు ప్రతీ నెల బ్యాంకు ద్వారా రూ. 15,500 వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మున్సిపల్ యూనియన్, హనుమకొం డ జిల్లా కార్యదర్శి తేలూరి ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కాజీపేట, హనుమకొండ, హసన్‌పర్తి మండలాలలోని నర్సరీలు, డీవైడర్లతో పాటు వివిధ పార్కుల్లో పనిచేస్తున్న హార్టికల్చర్ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ.. హరితహారం, హార్టికల్చర్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు ఐడీ నంబర్లు ఇవ్వాలని అందరిని ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. సమావేశంలో హార్టికల్చర్ కార్మికుల జిల్లా యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సునిత, కార్యదర్శులుగా రంజిత్, సులోచన, కోశాధికారిగా రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా టి.ఉప్పలయ్య, ఉపాధ్యక్షులుగా బండారి రాజు, ఉపేందర్, లక్ష్మి, మమత, సహాయ కార్యదర్శులుగా ఏలియా, విజయలక్ష్మి, అశ్విని, భిక్షపతి, దండు దయాకర్‌లను ఎన్నుకున్నారు..

రక్షాబంధన్ వేడుకలు



వృద్ధులకు రాఖీలు కడుతున్న ఏకశిల పాఠశాల విద్యార్థులు

ఐనవోలు, ఆగస్టు 18: పున్నేలు ఏకశిల పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనకదుర్గా ఆశ్రమ పాఠశాలలో వృద్ధులకు రాఖీలను కట్టి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ రవికిరణ్, కార్యక్రమ నిర్వహకులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

వడ్డెపల్లి, ఆగస్టు 18: డప్పు చప్పుళ్ల, ఆచారమంతుల ఆటలు, పంబలావారి పాటలు, శివసత్తుల పూనకాలతో హనుమకొండలోని గాంధీనగర్ పరవశించింది. ఆదివారం 57వ డివిజన్ గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని పోచమ్మ తల్లి ఆలయానికి దంపతులతో కలిసి తరలివెళ్లారు. దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన పప్పు, బెల్లం, పసుపు, కుంకుమలు, బెల్లం శాక, కొబ్బరికాయలు, సాంబ్రాని వేసి నూతన వస్త్రాలు, నైవేద్యాన్ని సమర్పించి దీపాన్ని వెలిగించారు. పిల్లా పాపలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతోపాటు పాడి పంటలతో తులతూగే విధంగా సల్లంగా దీవించమని పోచమ్మ తల్లిని మహిళలు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ గుడి ఆలయ కమిటీ చైర్మన్ బొంగు రాజుయాదవ్‌తో పాటు గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సట్ల సత్తయ్య, మూగల కుమార్ యాదవ్, వీరేందర్, ఆకుల శ్యాంప్రసాద్, అశోక్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మడికొండ: శ్రావణ మాసోత్సవాలలో భాగంగా మడికొండలోని మెట్టుగుట్ట దిగువన గల పోచమ్మతల్లి దేవాలయంలో అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మెట్టుగుట్ట ఈవో శేషభారతి మొదటి భారతి పోచమ్మతల్లి అమ్మవారికి మొదటి బోనం సమర్పించి మొక్కులు చల్లించుకొని బోనాల జాతరను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పోచమ్మతల్లి ఆలయ పూజారి పైడిపాల సురేష్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో పోచమ్మ తల్లి ఆలయానికి తరలివస్తున్న కాలనీవాసులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 19 ఆగస్టు 2024

పర్వదినం



నేడు రాఖీ పౌర్ణమి

సోదర బంధానికి రక్ష! రక్ష!

శ్రావణం ఐశ్వర్యప్రదమైన మాసం. దీని విశిష్టతను పరమశివుడు పార్వతికి వివరిస్తూ "అస్మిన్ మాసే కృతం యద్యత్తదనంతాయ కల్పతే... ఈ మాసంలో ఆచరించే క్రతువులు అనంతమైన ఫలాలను ఇస్తాయి" అని చెప్పాడు. ఎంతో మహిమాన్వితమైన ఈ నెలలో... పౌర్ణమి మరింత ప్రత్యేకమైనది. హయగ్రీవుడిగా శ్రీమహావిష్ణువు అవతరించినది శ్రావణ పౌర్ణమి నాడే. హయగ్రీవ వృత్తాంతం భాగవతంలోను, మహాభారతంలోను కనిపిస్తుంది. వేదాలను అపహరించిన రాక్షసుల సంహారం కోసం ఆవిర్భవించిన హయగ్రీవుణ్ణి జ్ఞాన ప్రదాతగా ఆరాధిస్తారు.



ఇదే రోజును 'రక్షా బంధన దినోత్సవం'గా, 'రాఖీ పౌర్ణమి'గా నిర్వహించే సంప్రదాయం భారతదేశమంతటా ఉంది. సోదరీ సోదరుల మధ్య జీవితాంతం ఉండవలసిన అనురాగ బంధం గురించి చాటి చెప్పే పర్వదినం రాఖీ పౌర్ణమి. సోదరుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ, తనకు రక్షగా ఉండాలని కోరుతూ అక్కలు, చెల్లెళ్ళు రాఖీలను కడతారు. ధర్మ రక్షణ, దేశ రక్షణ, పరస్పర రక్షణ భావనలు రక్షాబంధనంలో ఇమిడి ఉన్నాయి. ఇది అనాది సంప్రదాయమని భవిష్యోత్తర, బ్రహ్మాండ, అగ్ని పురాణాల్లో, ఇతిహాసాల్లో, చరిత్రలో కనిపించే ప్రస్తావనలు రుజువు చేస్తున్నాయి. యమధర్మరాజుకు ఆయన సోదరి యమున రక్షను కట్టగా... ఆమెను యముడు ఆశీర్వదిస్తూ, "ఈ రోజు సోదరులకు రక్షను కట్టిన మహిళలకు సర్వ శుభాలు కలుగుతాయి" అని వరమిచ్చాడని, దేవ దానవ యుద్ధ సమయంలో ఇంద్రుడి విజయం కోసం శచీదేవి రక్ష కట్టిందని పురాణ కథలు ఉన్నాయి. చిత్తోడ్ రాజ్యం మీద బహదూర్‌షా దండయాత్రకు సిద్ధపడినప్పుడు, సాయం కోరుతూ మొఘల్ చక్రవర్తి హుమయూన్‌కు రాణి కర్ణావతి రాఖీ పంపిందనీ, ఆమెను సోదరిగా భావించిన హుమయూన్ తన సేనను పంపించి బహదూర్‌షాను ఓడించాడనీ చరిత్ర కథనం. రాజపుత్ర వనితలు యుద్ధ సమయాల్లో తమ భర్తలకు రక్ష కట్టేవారట. తుల్జా భవానీని ఆరాధించి, ఆమె కటాక్షంతో ఖడ్గాన్ని, రక్షా కంకణాన్ని ఛత్రపతి శివాజీ పొందాడనే కథ కూడా ప్రాచుర్యంలో ఉంది.

దేశంలోని అన్ని ప్రాంతాల్లో... తమ తమ ఆచారానుసారం పలు పద్ధతుల్లో, వివిధ పేర్లతో ఈ పర్వదినాన్ని ప్రజలు జరుపుకొంటారు. శ్రావణ పౌర్ణమిని 'జంధ్యాల పౌర్ణమి' అని కూడా అంటారు. ఉపనయన సంస్కారం పొందినవారు ఈ రోజున కొత్త యజ్ఞోపవీతాలను ధరించి, గాయత్రీ దేవిని పూజిస్తారు. గురుముఖంగా వేదాధ్యయనం చేయడానికి శ్రావణ పౌర్ణమిని ఉత్తమమైన రోజుగా పండితులు పరిగణిస్తారు.

యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః
తేనత్వామభిబధ్నామి రక్షే మాచలమాచల

బలి చక్రవర్తి అభిమానానికి మెచ్చిన మహావిష్ణువు... అతని వద్దనే చిక్కుకుపోయాడట. విష్ణుమూర్తిని విడిపించడం కోసం బలి చక్రవర్తికి శ్రీ మహాలక్ష్మి రక్షను కట్టిందనే కథ 'భవిష్య పురాణం'లో కనిపిస్తుంది. "మహా బలశాలి అయిన బలి చక్రవర్తినే బద్ధుణ్ణి చేసిన, మహా శక్తిమంతమైన రక్షను నీకు కడుతున్నాను. దీని శక్తితో నువ్వు చల్లగా వర్ధిల్లుతూ ఉండాలి" అని ఈ శ్లోకానికి అర్థం. ఈ శ్లోకం చదువుతూ సోదరులకు రక్షను కట్టడం శుభప్రదమనేది శాస్త్రవచనం.

- ఆయపిళ్ళ రాజపాప

నాన్న, నేను... ఓ ప్రయాణం!



అందరూ స్నేహితులతో కలిసి బైక్ రైడ్‌లకు వెళ్తారు. కానీ 17 ఏళ్ల ఏంజలికా డేనియల్ తన తండ్రి అజయ్‌తో కలిసి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 7 వేల కిలోమీటర్లు ప్రయాణించింది. ఈ యాత్ర తనకు అనేక జీవిత పాఠాలను నేర్పిందంటోంది ఏంజలికా.

"నాన్నకు బైక్ రైడింగ్ అంటే ఇష్టం. కొన్ని నెలల పాటు బైక్ మీద తిరిగి వస్తూ ఉంటారు. తనకు ఒక బైక్ గ్యాంగ్ ఉంది. అందరూ కలిసి ప్రయాణాలు ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కొన్నాళ్ళ క్రితం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఏడు వేల కిలోమీటర్ల బైక్ రైడ్‌కు వెళ్ళాలనుకున్నారు. కానీ ఆ తరువాత... రకరకాల కారణాల వల్ల ఒకరి తర్వాత ఒకరు రావటానికి కుదరదని చెప్పటం మొదలుపెట్టారు. దీనితో నాన్నకు చాలా నిరాశ కలిగింది. తను నిరాశగా ఉండటం నాకు నచ్చలేదు. "నాన్నా... నేను నీతో వస్తా..." అన్నాను. నాన్న చాలా ఆశ్చర్యపోయారు.

కొత్త కాదు, కానీ...

నాన్న బైక్ రైడర్ కాబట్టి... ఆయనతో ఈ తరహా ప్రయాణాలు నాకు కొత్త కాదు. కానీ ఏడు వేల కిలోమీటర్లు... ఒకే బైక్ మీద వెళ్లటం మాత్రం చాలా కొత్త అనుభవం. ప్రయాణం మొదట్లో నాన్నకు నా గురించే ఎక్కువ ఆందోళన పడేవారు. దారిలో అందమైన ప్రదేశాలను ఆస్వాదించటం మానేసి- నేను ఎలా ఉన్నాను? నాకు ఇబ్బందిగా ఉందా? అనే విషయాలపైనే శ్రద్ధ చూపించేవారు. మూడు నాలుగు రోజుల తర్వాత నాన్నకు నేను ఆ ప్రయాణం చేయగలననే విశ్వాసం వచ్చింది. దాంతో తను కూడా ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించటం మొదలుపెట్టారు. మేమిద్దరం ప్రయాణించే సమయంలో అనేక విషయాల గురించి మాట్లాడుకొనేవాళ్లం. అప్పటి వరకూ నాకు నాన్న ఇష్టాల గురించి, ఆయన అనుభవాల గురించి కొంతే తెలుసు. కానీ ఈ ప్రయాణంలో నేను నాన్నలోని కొత్త కోణాలను చూశాను. ఆ ప్రయాణం మొదట్లో నేను నాన్నకు ఒక చిన్న పిల్లను. నెమ్మదిగా ఆయనకు ఒక స్నేహితురాలిగా మారిపోయాను. నేను, నాన్న ఒకే ఇంట్లో 17 ఏళ్ల ఉన్నాం. నేను ఎప్పుడూ నాన్న గురించి నాకు బాగా తెలుసని అనుకొనేదాన్ని. కానీ నాన్న గురించి నాకు తెలిసింది చాలా తక్కువని ఈ యాత్ర ద్వారా అర్థమయింది. అలాగే నా గురించి కూడా నాన్నకు చాలా తెలిసింది. నాకు చరిత్ర అంటే చాలా ఇష్టం. చరిత్రకు సంబంధించిన అనేక విషయాలునాకు తెలుసు. ఏవైనా కోటల దగ్గర, ఇతర చారిత్రాత్మక ప్రదేశాల దగ్గర ఆగినప్పుడు- నాన్నకు వాటి గురించి చెప్పేదాన్ని. కొన్నిసార్లు నాన్న - నాకు ఉన్న పరిజ్ఞానానికి ఆశ్చర్యపడేవారు. ఒక రోజు సాయంత్రం ప్రయాణం చేస్తున్నాం. అన్ని వైపులా నిశ్శబ్దం ఆవరించి ఉంది. నాకు చాలా భయమేసింది. ఆ నిశ్శబ్దాన్ని ఎలా అధిగమించాలో తెలియలేదు. అప్పుడు నాన్న నన్ను 'డిస్నీ-ఫ్రోజెన్' సినిమాలోని 'లెట్ ఇట్ గో' అనే పాట పాడమన్నారు. నాకు బాగా ఇష్టమైన పాట అది. ఆ పాట పాడుతుంటే నా భయమంతా పోయింది.

నేర్చుకున్న పాఠాలెన్నో...

మనం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మనకు ఏదో ఒక విధంగా సాయం అందుతుంది. కానీ మనకు ఆ సాయం అందుకొనే ఓపిక ఉండాలి. దాని కోసం వేచి చూడాలి. ఇదే నేను నేర్చుకున్న తొలి పాఠం. మా ప్రయాణంలో ఒకసారి మేము దారి తప్పాం. గూగుల్ మ్యాప్‌లు కూడా సరిగ్గా పనిచేయలేదు. ఏం చేయాలో తెలియని స్థితి. అలాంటి పరిస్థితుల్లో ఒక గ్రామం కనిపించింది. అప్పుడు మాకు కలిగిన రిలీఫ్ మాటల్లో చెప్పలేను. ఇక నాన్న బైక్ నడపటంలో చూపించిన నైపుణ్యం నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఎంత ఎత్తైన ప్రాంతంలోనైనా, లోతైన లోయల అంచుల్లో ఉన్నా - ఏ మాత్రం తొణకకుండా ఆయన బైక్‌ను డ్రైవ్ చేసిన తీరును మరిచిపోలేను. బహుశా నాన్న జీవితంలో విజయం సాధించటానికి ఈ ఏకాగ్రతే కారణం అనుకుంటా. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ప్రయాణించిన అతి పిన్నవయస్కురాలైన పిలియన్ రైడర్‌గా 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' నన్ను గుర్తించింది. ఆ విధంగా కూడా ఈ ప్రయాణం నా జీవితాంతమంతా గుర్తుండిపోతుంది."


విమానంలో వినూత్న ప్రయోగం!





విమానాల్లో ప్రయాణించే సమయాల్లో పిల్లలు ఏడ్వటం.. వాళ్లను తల్లులు, అమ్మమ్మలు సముదాయించటం మనకు చాలా సార్లు కనిపిస్తూ ఉంటుంది. విమానంలో ప్రయాణించే కొందరు ప్రయాణికులకు - ఈ వ్యవహారమంతా ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా అంతర్జాతీయ విమానాలలో పిల్లలు ఏడుస్తుంటే ఇతరులు చిరాకు పడతారు. అందుకే దక్షిణ కొరియాకు చెందిన ఒక మహిళ ఒక వినూత్న ప్రయోగం చేసింది. ఈ మహిళ దక్షిణ కొరియా నుంచి అమెరికాకు తన నాలుగు నెలల పాపను తీసుకు వెళ్తోంది. ఆ పాప వల్ల కలిగే అసౌకర్యానికి చింతించమంటూ తాను ప్రయాణిస్తున్న విమానంలోని 200 మంది ప్రయాణికులకు - బ్యాగులు పంచిపెట్టింది. ప్రతి బ్యాగులో- ఇయర్ ప్లగ్స్, చ్యూయింగ్ గమ్‌తో పాటు ఒక చిన్న సందేశం కూడా ఉంది. ఈ సందేశంలో - "హాయ్! నా పేరు జున్ వూ. నాకు నాలుగు నెలలు. నేను మా అమ్మ, అమ్మమ్మలతో కలిసి అమెరికా వెళ్తున్నాను. ఇది నా తొలి విమాన ప్రయాణం. చాలా భయంగా ఉంది. వీలైనంత వరకు ఏడ్వకుండా ఉండటానికి ప్రయత్నిస్తా. నా ఏడుపు పెద్దగా ఉంటే- ఇయర్ ప్లగ్స్ పెట్టుకోండి.." అని ఉంది.

స్పార్క్ సూపర్‌గా...



వర్కింగ్ కపుల్‌కు వారాంతాల్లో మాత్రమే తీరిక చిక్కుతుంది. ఆ సమయాన్ని మిగతా పనులకే వెచ్చించకుండా, అనుబంధం బలపడడం కోసం కూడా కేటాయిస్తూ ఉండాలి. మునుపటి ఆకర్షణ తగ్గిందనిపిస్తే, చిన్న చిన్న చిట్కాలతో కోల్పోయిన స్పార్క్‌ను తిరిగి జీవితాల్లోకి ఆహ్వానించాలి.

ఇండోర్ గేమ్స్:

ఆఫీసు పని, ఇంటి పనితోనే సరిపెట్టుకోకుండా ఇద్దరూ కలిసి క్యారమ్స్, ప్లేయింగ్ కార్డ్స్, లూడో, చెస్ మొదలైన ఇండోర్ గేమ్స్ ఆడాలి. ఆటలతో ఒత్తిడి తొలగడంతో పాటు, కాలక్షేపం కూడా దక్కుతుంది. కలిసి నాణ్యమైన సమయం గడిపామనే సంతృప్తి కూడా దక్కుతుంది.

పాత జ్ఞాపకాలు:

పెళ్లి నాటి ఫొటో ఆల్బమ్‌ను తిరగేస్తే పాత జ్ఞాపకాలతో మానసికోల్లాసం దక్కుతుంది. ఒకప్పటి గుర్తులు, సంఘటనలు కళ్ల ముందు మెదిలి, దంపతుల మధ్య దూరాలు తరుగుతాయి.

సరదా సరదాగా:

సరదా టెక్స్ మెసేజీలు పంపుకుంటూ, ఒకర్నొకరు టీజ్ చేసుకుంటూ ఉండాలి. సరికొత్త వంటకాలతో భార్య భర్తనూ, ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తెప్పించిన సర్‌ప్రైజ్ గిఫ్ట్‌తో భర్త భార్యనూ సర్‌ప్రైజ్ చేసుకోవచ్చు.

పనుల్లో భాగస్వామ్యం:

ఇంటి పనులు కలిసి చేయడం ద్వారా కూడా దంపతులు తమ మధ్య తగ్గే అన్యోన్యతను పెంచుకోవచ్చు. కూరగాయలు తరగడం, మిక్సీ, వాషింగ్ మెషిన్, గార్డెనింగ్ పనులతో భర్తలు భార్యలకు సహాయపడవచ్చు. అలాగే భార్యలు కూడా భర్తల పనుల్లో పాలుపంచుకోవచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

అల్లు అరవింద్ ఆటపట్టించారు



అంకిత్ కొయ్యప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల వుతోంది. ఈ సందర్భంగా అంకిత్ మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమాలో ఇంద్రజగారు నా తల్లి పాత్ర చేశారు. ఆమె సూచన మేరకే దర్శకుడు నన్ను ఎంపిక చేశారు. ఇందులో నా పాత్రకు 'నేను అల్లు అరవింద్ కొడుకును, బన్నీ మా అన్నయ్య' అనే డైలాగ్ ఉంది. ఈ మధ్య అల్లు అరవింద్‌గారిని కలిసినప్పుడు 'నా కొడుకునని చెప్పుకొని తిరుగుతున్నావంట... తెలిసింది' అని సరదాగా ఆట పట్టించారు. రావు రమేశ్ కాంబినేషన్‌లో వచ్చే సీన్లు వినోదం పంచుతాయి' అని ఆయన తెలిపారు.

ప్రభాస్ పాత్ర జోకర్‌లా ఉంది



బాలీవుడ్ నటుడు.. 'మున్నా భాయ్ ఎంబీబీఎస్' సినిమాలో సర్క్యూట్‌గా పాపులరైన అర్షద్ వార్సీ ప్రభాస్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ "కల్కి 2898 ఏ.డీ' సినిమా చూశాను. నాకు నచ్చలేదు. సినిమాలో అశ్వత్థామగా అమితాబ్ అదరగొట్టారు. ఇంత వయసులోనూ ఆయన ఈ స్థాయిలో నటించడం గొప్ప విషయం. ఆయనకు ఉన్న శక్తిలో కొంచెమైనా నాకు ఉండి ఉంటే.. ఈ పాటికి లైఫ్ సెట్ అయ్యిపోయేది. ఇందులో ప్రభాస్ పోషించిన పాత్ర బాలేదు. ఆయన పాత్ర జోకర్‌లా ఉంది. నేను ప్రభాస్‌ను 'మ్యాడ్ మాక్స్' లాంటి సినిమాలో మెల్ గిబ్సన్‌లా చూడాలనుకుంటున్నాను. కానీ నేను చూసింది వేరు" అని అన్నారు. ఇప్పుడు ఈ మాటలు సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే రేపాయి. ఆయనపై ప్రభాస్ అభిమానులు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సన్నీ 'క్యు జి'



జాకీ ష్రాఫ్, సన్నీలియోన్, ప్రియమణి ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'క్యుజి'. వివేక్ కన్నన్ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఎం వేణుగోపాల్ ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ 'సన్నీ లియోన్ నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు.

ఫాంటసీ థ్రిల్లర్



సుధీర్‌బాబు హీరోగా వెంకట్ కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో తెలుగు-హిందీలో తెరకెక్కుతోన్న ద్విభాషా చిత్రానికి 'జటాధర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాలో సుధీర్ బాబు లుక్‌తో పాటు టైటిల్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సూపర్ నాచురల్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న విడుదల కానుంది. ప్రేరణ్ అరోరా, శివిన్ నారంగ్, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్ నిర్మిస్తున్నారు.

ఇప్పుడంత టైమ్ లేదు



మహేశ్‌బాబుతో సినిమా చేసేందుకు ఇప్పుడు టైమ్ కుదిరేలా లేదన్నారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహేశ్‌తో సినిమా ఎప్పుడు చేస్తారని అడగ్గా... 'ప్రభాస్‌తో స్పిరిట్ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్తుంది, ఆ తర్వాత యానిమల్ 2 చిత్రాన్ని ప్రారంభిస్తా, ఈ రెండు సినిమాలను పూర్తి చేయడానికే నాలుగేళ్లు పడుతుంది. ఆ తర్వాతే కొత్త సినిమా గురించి ఆలోచిస్తాను' అని సందీప్ రెడ్డి చెప్పారు.

మోహన్ లాల్‌కు అస్వస్థత



మలయాళ నటుడు మోహన్ లాల్ అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఆయన జ్వరం, కండరాల నొప్పులు, శ్వాస సంబంధిత సమస్యలతో కొచ్చిలోని ఓ ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు విశ్రాంతి తీసుకోమ్మని వైద్యులు మోహనలాల్‌కు సూచించారు. కాగా, మోహన్‌లాల్ నటిస్తున్న 'బరోజ్', 'ఎల్ 2: ఎంపురాన్' సినిమాల్లో నటిస్తున్నారు.



జానీ మాస్టర్‌కు సన్మానం

ఇటీవలే ప్రకటించిన జాతీయ పురస్కారాల్లో.. ఉత్తమ కొరియోగ్రాఫర్ పురస్కారానికి ఎంపికైన జానీ మాస్టర్‌ను ఆదివారం తెలుగు చిత్రసీమ ప్రముఖులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జానీ మాస్టర్ మాట్లాడుతూ "నాపై ఇంతటి ప్రేమను చూపిస్తున్న మీ అందరికీ కృతజ్ఞతలు. ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెప్పారు.

రూ.5 కోట్ల పరువునష్టం దావా



సంగీత దర్శకుడు యువన్ శంకర్‌రాజాపై చెన్నైలోని తిరువల్లికేణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. తమకు ఇవ్వాల్సిన రూ.20 లక్షల అద్దె చెల్లించలేదని అజ్మత్ బేగం, ఆమె సోదరుడు మహ్మద్ జావిద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. "దాదాపు రూ.20 లక్షల అద్దెను యువన్ శంకర్‌రాజా చెల్లించాలి. ఆ విషయమై ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు. మాకు తెలియకుండా సైలెంట్‌గా సామాన్లను వేరే చోటికి షిఫ్ట్ చేశారు" అని అందులో ఆరోపించారు. వారిపై యువన్ రూ. కోట్లకు పరువునష్టం దావా వేశారు. ఈమేరకు అజ్మత్ బేగం, మహ్మద్ జావిద్‌లకు నోటీసులు పంపారు.

కొత్తగా..

మరోసారి జంటగా



హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న శివాజీ, లయ జంటగా సరికొత్త క్రైమ్ కామెడీ థ్రిల్లర్ రూపొందుతోంది. సుధీర్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శివాజీ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది. దిల్‌రాజు క్లాప్ ఇవ్వగా, బోయపాటి శ్రీను గౌరవ దర్శకత్వం వహించారు. ఈ నెల 20 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తామని యూనిట్ తెలిపింది.

మెప్పించే మన కుటుంబం



సుమన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న గ్రామీణ నేపథ్య చిత్రం 'మన కుటుంబం'. ఆకుల రాఘవ దర్శకత్వంలో కలకొండ హేమలత నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది, సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని నిర్మాత తెలిపారు. కథ, పాటలు ప్రేక్షకులను అలరిస్తాయని దర్శకుడు చెప్పారు. సంగీతం: భానుప్రసాద్, సినిమాటోగ్రఫీ: జగదీశ్

సెట్స్‌పైకి శివన్న చిత్రం



శివరాజ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న తెలుగు-కన్నడ ద్విభాషా చిత్రం (శివన్న 131-వర్కింగ్ టైటిల్) షూటింగ్ శనివారం మొదలైంది. కార్తీక్ అద్వైత్ దర్శకత్వంలో ఎస్.ఎన్ రెడ్డి, సుధీర్ పి నిర్మిస్తున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో శివరాజ్‌కుమార్ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. సంగీతం: సామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ: ఎ. జె శెట్టి.

భారీ యాక్షన్‌తో



విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శనివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌లో విజయ్ అలరించారు. డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని. మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో విడుదల చేస్తోంది.

రోమియో కథ



హర్ష రోషన్, హారిక హీరోహీరోయిన్లుగా భాస్కర్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'వాట్సప్ రోమియో'. ఆదివారం చిత్రబృందం ఫస్ట్ లుక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత భిక్షమయ్య మాట్లాడుతూ 'రోమియో అనగానే ఆకతాయి కుర్రాడు అనుకుంటారు గానీ మా సినిమాలో రోమియో పాత్ర అందరినీ ప్రేమిస్తుంది' అన్నారు.

ప్రియ 'పాంచ్'

- భారత్-ఎ ఘన విజయం
- 171 పరుగులతో ఆసీస్ చిత్తు



మాకౌ (ఆస్ట్రేలియా): అరంగేట్ర లెగ్ స్పిన్నర్ ప్రియా మిశ్రా (5/14) తిప్పేయడంతో.. ఆస్ట్రేలియా టూర్‌లో భారత్-ఎ మహిళల జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్-ఎ 171 పరుగులతో ఆస్ట్రేలియా-ఎను చిత్తు చేసింది. తొలి రెండు వన్డేల్లో భారత్ ఓడడంతో, ఆసీస్ 2-1తో వన్డే సిరీస్‌ను దక్కించుకొంది. మొదట భారత్ 50 ఓవర్లలో 243/9 స్కోరు చేసింది. రఘ్వి బిస్త్ (53), తేజల్ (50) అర్ధ శతకాలు చేశారు. బ్రౌన్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత స్పిన్నర్ల ధాటికి ఆసీస్ 22.1 ఓవర్లలో 72 రన్స్‌కే కుప్పకూలింది. మిన్నూ మణి 2 వికెట్లు తీసింది. ఇరుజట్ల మధ్య ఏకైక అనధికార టెస్ట్ గురువారం నుంచి జరగనుంది.

రంజీలతో షమి రీఎంట్రీ!

న్యూఢిల్లీ: శస్త్రచికిత్స చేయించుకొన్న అనంతరం పునరావాసంలో ఉన్న పేసర్ షమి రంజీలతో మళ్లీ పోటీ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. రంజీ ట్రోఫీలో అక్టోబరు 11న యూపీతో, 18న బిహార్‌తో బెంగాల్ తలపడనుంది. వీటిల్లో ఒక మ్యాచ్‌లో షమి బరిలోకి దిగే అవకాశం ఉంది. అనంతరం న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్‌లో ఒక మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసే చాన్సులున్నాయి. ఫిట్‌నెస్ నిరూపించుకొంటే ఆస్ట్రేలియా టూర్‌కు ఎంపిక కావడం పక్కా. గతేడాది ఆస్ట్రేలియాతో వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో షమి చివరిసారిగా కనిపించాడు.

విండీస్‌తో భారత్ పోరు షురూ

జనవరి 18 నుంచి మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్

దుబాయ్: మలేసియాలో జరిగే మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరగనుంది. భారత్ తమ ఆరంభ మ్యాచ్‌ను జనవరి 19న వెస్టిండీస్‌తో ఆడనుంది. ఇక, టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటాయి. వీటిని 4 గ్రూప్‌లుగా విభజించి మొత్తంగా 41 మ్యాచ్‌లు ఆడించనున్నారు. ప్రతీ గ్రూప్‌లో టాప్-3 జట్లు సూపర్ సిక్స్‌కు వెళతాయి. ఇందులోని రెండు గ్రూప్‌ల్లో టాప్-2 జట్లు సెమీస్ ఆడతాయి. గ్రూప్ 'ఎ'లో డిఫెండింగ్ చాంప్ భారత్‌తో పాటు వెస్టిండీస్, శ్రీలంక, మలేసియాలకు చోటు దక్కింది. గ్రూప్ 'బి'లో పాకిస్థాన్, ఇంగ్లండ్, ఐర్లాండ్, యూఎస్ఏ.. గ్రూప్ 'సి'లో న్యూజిలాండ్, సౌతాఫ్రికా, ఆఫ్రికా క్వాలిఫయర్, సమోవా.. గ్రూప్ 'డి'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఆసియా క్వాలిఫయర్ స్కాట్లాండ్ ఉన్నాయి.

షూటర్లను కాపాడే వ్యవస్థ ఏది?

జాతీయ సమాఖ్యపై జస్పాల్ రాణా ఆగ్రహం



న్యూఢిల్లీ: ఒలింపిక్స్ కోసం షూటర్ల ఎంపిక విధానం సరిగా లేదని మాజీ షూటర్ జస్పాల్ రాణా విమర్శలు గుప్పించాడు. పారిస్ గేమ్స్‌లో రెండు కాంస్యాలు సాధించిన మను భాకర్‌కు కోచ్‌గా వ్యవహరించిన రాణా.. తాజాగా భారత జాతీయ రైఫిల్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ)పై మండిపడ్డాడు. సెలెక్షన్ పాలసీలో సమాఖ్య నిలకడను ప్రదర్శించకపోతే భవిష్యత్‌లో ఎంతో మంది షూటర్లకు అన్యాయం జరుగుతుందని అన్నాడు. అలాగే జాతీయ శిబిరాలు, ట్రయల్స్‌కు షూటర్ల వ్యక్తిగత కోచ్‌లను అనుమతించకపోవడం కూడా సరికాదన్నాడు. 'ప్రతీ ఆరు నెలలకోసారి సమాఖ్య సెలెక్షన్ పాలసీ మారుతోంది. అందుకే ఇటీవల క్రీడామంత్రిని కలిసి ఎంపిక బాధ్యతలను సమాఖ్య నుంచి తీసుకోమని చెప్పాను. సమాఖ్య అనాలోచిత నిర్ణయాల వల్ల సౌరభ్ చౌదరి, జీతూ రాయ్‌లాంటి నైపుణ్యం కలిగిన షూటర్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఎవరైనా వారి గురించి మాట్లాడుతున్నారా? అసలు ఎన్ఆర్ఏఐలో షూటర్లను కాపాడుతూ, వారికి మద్దతిచ్చే వ్యవస్థే లేదు' అని రాణా ఆరోపించాడు.

బంతికి టేప్ చుట్టి ఆడేవాణ్ణి



ఐఎస్‌పీఎల్ సీజన్ 2 ఆవిష్కరణ కార్యక్రమంలో సచిన్, బాలీవుడ్ నటులు కరీనా, సైఫ్‌అలీఖాన్

ముంబై: తాను క్రికెట్ ఆడే రోజుల్లో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేందుకు బంతికి ఓవైపు టేపు చుట్టి ప్రాక్టీస్ చేసేవాడినని సచిన్ టెండూల్కర్ తెలిపాడు. 'లెదర్ బాల్‌లో నునుపు, గరుకు కనిపిస్తుంటాయి. కానీ టెన్నిస్ బంతికి అలా రావాలంటే ఓవైపు టేపు చుట్టాల్సి ఉంటుంది. నేను అంతర్జాతీయ క్రికెట్‌లో రివర్స్ స్వింగ్‌ను మెరుగ్గా ఆడేందుకు ఇలాంటి బంతులతోనే ప్రాక్టీస్ చేశాను. అందుకే ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్‌పీఎల్)లోనూ ఈ పద్ధతిని ఎందుకు అమలు చేయకూడదనిపించింది. దీని ద్వారా బ్యాటర్ల టెక్నిక్ కూడా మెరుగవుతుంది' అని ఆదివారం ఇక్కడ జరిగిన ఐఎస్‌పీఎల్ సీజన్ 2 లాంచింగ్ కార్యక్రమంలో సచిన్ తెలిపాడు. వచ్చే జనవరి 26 నుంచి ఫిబ్రవరి 9 వరకు థానే వేదికగా ఈ టెన్నిస్ బాల్ టోర్నీ జరుగనుంది.

బంగారు పతకం 750 కిలోల లడ్డూలు

వినేశ్‌కు గ్రామస్థుల కానుకలు



మళ్లీ ఆడతానేమో!

ఒలింపిక్ పతకం చేజారడమనేది నా జీవితానికే అతిపెద్ద గాయం. అది మానడానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేను. నాకు దక్కుతున్న ఆదరాభిమానాలను చూస్తుంటే వేగంగా కోలుకొని మళ్లీ రెజ్లింగ్‌లోకి పునరాగమనం చేస్తానేమోననిపిస్తోంది. నా రికార్డులను నా గ్రామం వారే అధిగమించాలి. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా గత ఏడాది కాలంగా మేము చేస్తున్న పోరాటం కొనసాగిస్తాం. దేవుడి దయతో నిజం బయట పడుతుంది. -వినేశ్ ఫొగట్

న్యూఢిల్లీ: పారిస్ నుంచి తిరిగి వచ్చిన రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు ఆమె స్వగ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. ఢిల్లీ విమానాశ్రయం నుంచి హరియాణాలోని ఆమె సొంతూరు బలాలీకి చేరుకోవడానికి దాదాపు 13 గంటల సమయం పట్టింది. 135 కిలో మీటర్లు ప్రయాణించి శనివారం అర్ధరాత్రి గ్రామానికి చేరుకొన్న వినేశ్‌కు స్థానికులు నీరాజనం పలికారు. దీంతో ఒక్క సారిగా భావోద్వేగానికి గురైన ఆమెకు.. చుట్టుపక్కల వారు, గ్రామస్థులు వెన్నుతట్టి ధైర్యం చెప్పారు. తలపాగాతోపాటు ఆమెకు కత్తి ఇచ్చి ఘనంగా సన్మానించిన గ్రామస్థులు.. ఇచ్చిన మాట ప్రకారం గోల్డ్ మెడల్ (బంగారు పతకం)తో పాటు క్రౌడ్ ఫండింగ్ ద్వారా సేకరించిన రూ. 21 వేలను బహుమానంగా అందించారు. ఇదేమీ పెద్ద మొత్తం కాకపోయినా తమ ప్రేమాభిమానాలను ఈ రూపంలో వ్యక్తపరిచారు. ఓ వాచ్‌మన్ రూ. 100.. ఇలా ప్రతి ఒక్కరూ తమకు తోచినంతగా జమ చేశారు. అంతేకాకుండా 750 కిలోల లడ్డూలను ఫొగట్‌కు కానుకగా ఇచ్చారు. అనంతరం వాటిని ఊరంతా పంచారు. ఒలింపిక్స్ రెజ్లింగ్ 50 కిలోల విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్.. 100 గ్రాముల బరువు ఎక్కువగా ఉందనే కారణంతో అనర్హతకు గురైన సంగతి తెలిసిందే.

మహావీర్‌ను కలిసిన వినేశ్



అనర్హత వేటు పడిన తర్వాత తీవ్ర భావోద్వేగానికి గురైన వినేశ్ తన కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ఎక్స్‌లో పోస్టు చేసింది. ఈ ప్రయాణంలో తనకు ఎంతో అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలిపింది. అయితే, వినేశ్‌కు తొలి గురువైన పెదనాన్న మహావీర్ ఫొగట్‌ను ఆమె విస్మరించడంపై అక్క వరుసైన గీతా ఫొగట్, బబిత ఫొగట్ సోషల్ మీడియా ద్వారా తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పోస్టులపై వినేశ్ భర్త సోమ్‌వీర్ స్పందించాడు. ఆ సమయంలో తీవ్ర వేదనలో ఫొగట్ ఆ ట్వీట్ చేసినట్టు తెలిపాడు. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమెకు సహకరించిన వారినే ఆ సందర్భంగా ప్రస్తావించినట్టు చెప్పాడు. అయితే, వీటన్నింటికి వినేశ్ ఒక్కసారిగా ఫుల్ స్టాప్ పెట్టింది. గ్రామానికి చేరుకొన్న ఆమె మహావీర్‌ను కలిసింది. కన్నీళ్లు పెట్టుకొన్న వినేశ్‌ను ఆయన దగ్గరకు తీసుకొని ఓదార్చారు.

పేస్ పదును పెంచేనా?

టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్కెల్‌పై అంచనాలు



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

టీమిండియా ప్రధాన కోచ్ గంభీర్‌కు దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్‌పై గట్టి నమ్మకమే ఉంది. ఇద్దరూ కలిసి ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున కలిసి పనిచేశారు. అలాగే కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు గతంలో కలిసి ఆడిన అనుభవముంది. అందుకే బౌలింగ్ కోచ్ రేసులో ఎన్ని పేర్లు వినిపించినా.. గౌతీ ప్రతిపాదన మేరకు బీసీసీఐ మోర్కెల్ వైపే మొగ్గు చూపింది. దీంతో మూడేళ్ల పాటు అంటే 2027 వన్డే వరల్డ్‌కప్ దాకా మోర్నీనే బౌలింగ్ కోచ్‌గా కొనసాగనున్నాడు. ముందుగా వచ్చే నెలలో బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్‌తో అతడి ప్రస్థానం ఆరంభమవుతుంది. అంతకన్నా ముందు అతడిపై పెద్ద బాధ్యతలే ఉన్నాయి. భారత బౌలింగ్ ఇప్పుడు సంధి దశలో ఉంది. వెటరన్ పేసర్ షమి గాయాలతో ఇబ్బంది పడుతున్నాడు. అలాగే స్టార్ పేసర్ బుమ్రాపై పని భారం పడకుండా చూడాల్సి వస్తోంది. దీంట్లో భాగంగా అతడిని అన్ని ఫార్మాట్లలో ఆడించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ సిద్ధంగా లేదు.

వాస్తవానికి టెస్టు, వన్డేల్లో సీనియర్లు బుమ్రా, షమి, సిరాజ్‌ల స్థానానికి ఢోకా లేదు. కానీ టీ20లతో పాటు రిజర్వ్ బలాన్ని పెంచేందుకు యువ పేస్ దళాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ప్రసిద్ధ్ క్రిష్ణ, మయాంక్ యాదవ్, అవేశ్ ఖాన్, ఖలీల్, ఆకాశ్‌దీప్, ఉమ్రాన్ మాలిక్, ముకేశ్, హర్షిత్ రాణా జట్టు భవిష్యత్ ప్రణాళికల్లో ఉన్నారు. ఐపీఎల్‌లో మోర్కెల్ ఆధ్వర్యంలోనే లఖ్‌నవూ పేసర్ మయాంక్ యాదవ్ గంటకు 155 కి.మీ వేగంతో బంతులు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కొన్ని మ్యాచ్‌లకే మయాంక్ గాయపడినా అతడిపై మరింత ఒత్తిడి పడకుండా తగిన విశ్రాంతి కల్పించాడు. బోర్డు పరిశీలనలో ఉన్న పేసర్లు అంతర్జాతీయస్థాయిలో రాణించేందుకు మరింత శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మరోవైపు బంగ్లాతో సిరీస్‌కు మరో 15 రోజుల గడువుంది. ఆ తర్వాత భారత జట్టు ఆస్ట్రేలియా టూర్‌కు వెళుతుంది. అక్కడ మోర్కెల్‌కు గతంలో దక్షిణాఫ్రికా పేసర్‌గా విశేషంగా రాణించిన అనుభవముంది. అన్నింటికన్నా ముఖ్యంగా టీమిండియా షెడ్యూల్‌లో 17 ఏళ్లగా టెస్టు సిరీస్ గెలవని ఇంగ్లండ్ టూర్ కూడా ఉంది. అప్పటిలోగా గౌతీ-మోర్కెల్ ద్వయం పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించే పేసర్లను తయారుచేస్తారని ఆశిద్దాం. అయితే కెరీర్‌లో మోర్కెల్ తన పదునైన పేస్‌తో బ్యాటర్లను ఎంతగా వణికించినా.. కోచ్‌గా అతడి గ్రాఫ్ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. గతేడాది వన్డే వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించినా మోర్కెల్ ప్రభావం చూపలేకపోయాడు. 9 నెలలకే రాజీనామా చేశాడు. ఆ తర్వాత నమీబియా, న్యూజిలాండ్ మహిళల జట్లకు పనిచేశాడు.

సఫారీల రికార్డు



రెండో టెస్టులో విండీస్‌పై విజయం
సిరీస్ కైవసం

గయానా: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 40 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1-0తో దక్కించుకుంది. తొలి మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ విజయంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో ఒకే జట్టుపై వరుసగా అత్యధిక టెస్టు సిరీస్ (10)లు గెలిచిన జట్టుగా దక్షిణాఫ్రికా రికార్డుకెక్కింది. ఇరు జట్ల మధ్య తొలిసారి 1991-92లో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్ సిరీస్‌లో మాత్రమే విండీస్ నెగ్గింది. ఆ తర్వాత అన్నింటా సఫారీలదే ఆధిపత్యం. ఇక గతంలో ఈ రికార్డు భారత్, ఆస్ట్రేలియా జట్ల పేరిట సంయుక్తంగా ఉండేది. ఈ రెండు జట్లు కూడా విండీస్‌పైనే 9 టెస్టు సిరీస్‌లు గెలవడం గమనార్హం. శనివారం మూడో రోజే ముగిసిన ఈ టెస్టులో విండీస్ 263 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో విజయం కోసం పోరాడినప్పటికీ 222 రన్స్‌కు ఆలౌటైంది. కేశవ్, రబాడలకు మూడేసి వికెట్లు దక్కాయి. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 160, రెండో ఇన్నింగ్స్‌లో 246 స్కోర్లు చేయగా.. విండీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 144 రన్స్‌కు కుప్పకూలింది.

క్షమాపణలు కోరిన అల్కారజ్

సిన్సినాటి: ఓ టోర్నీలో మ్యాచ్ సందర్భంగా రాకెట్ విరగ్గొట్టినందుకు ప్రపంచ టెన్నిస్ మాజీ నెంబర్‌వన్ కార్లోస్ అల్కారజ్ క్షమాపణలు చెప్పాడు. గతవారం సిన్సినాటి ఓపెన్‌లో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమిపాలైన స్పెయిన్ స్టార్ అల్కారజ్.. ఆ మ్యాచ్‌లో పలుమార్లు అసహనానికి లోనవుతూ రాకెట్‌ను నేలకేసి కొట్టాడు. దీనిపై తాజాగా స్పందిస్తూ.. 'ఆరోజు మ్యాచ్‌లో నేనలా ప్రవర్తించి ఉండకూడదు. కోర్టులో కొన్నిసార్లు సహనాన్ని కోల్పోతుంటాం. మరోసారి ఇలాంటిది జరగదు' అని 21 ఏళ్ల అల్కారజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

24800 పైన బుల్లిష్

(ఆగస్టు 19-23 తేదీల మధ్య వారాని



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అనలిస్ట్ (label)

గత వారం నిఫ్టీ : 24541 (+173)

నిఫ్టీ గత వారం 24531-24100 పాయింట్ల మధ్యన కదలాడి 173 పాయింట్ల లాభంతో 24541 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24263, 24287, 24435, 24493 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24800 బ్రేక్‌డౌన్ స్థాయి : 24250
నిరోధ స్థాయిలు: 24730, 24830, 24930 (24630 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24330, 24230, 24130 (24430 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	496
వరంగల్	452	గోదావరి	501
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	114
కర్నూలు	105	నెల్లూరు	114
విశాఖపట్నం	109	అనంతపురం	113
గోదావరి	113		

1.7 లక్షల కోట్ల పెట్టుబడులు

• ఐదేళ్లలో బీపీసీఎల్ టార్గెట్.. • ఏపీలో రిఫైనరీ ఏర్పాటుపై మౌనం

Bharat Petroleum



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీపీసీఎల్ కంపెనీ భారీ విస్తరణకు సిద్ధమవుతోంది. వచ్చే ఐదేళ్లలో ఇందుకోసం రూ.1.7 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు చైర్మన్ జీ కృష్ణకుమార్ తాజా వార్షిక నివేదికలో పేర్కొన్నారు. కీలకమైన ఆయిల్ రిఫైనింగ్, పెట్రో ఉత్పత్తులు, మార్కెటింగ్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపారు. ఇందుకోసం 'ప్రాజెక్టు యాస్పైర్' పేరుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్ వృద్ధికి మంచి అవకాశం ఉన్న పెట్రో కెమికల్స్, హరిత ఇంధన ప్రాజెక్టులపైనా బీపీసీఎల్ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఈ విస్తరణతో కంపెనీ షేర్ల దీర్ఘకాలిక విలువ కూడా పెరుగుతుందని కృష్ణకుమార్ తెలిపారు. ఆకర్షణీయంగా ఉన్న కంపెనీ ఆస్తి-అప్పుల పట్టిక తమ ఇంధన పరివర్తనకు దోహదం చేస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ సందర్శన

ఆంధ్రప్రదేశ్‌లో రిఫైనరీ, పెట్రోకెమికల్స్ ప్లాంట్ ఏర్పాటుపై బీపీసీఎల్ చైర్మన్ ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే వచ్చే ఐదేళ్లలో కంపెనీ రిఫైనింగ్, పెట్రో ఉత్పత్తుల సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తామన్నారు. ఇందుకోసం కొత్త రిఫైనరీ, పెట్రోకెమికల్స్ ప్లాంట్ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రిఫైనరీ ప్రాజెక్టు ఏర్పాటు కోసం కృష్ణకుమార్ నేతృత్వంలోని కంపెనీ ఉన్నతాధికారుల బృందం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో భేటీ అయి చర్చించిన విషయం తెలిసిందే.

రూ. 80,000 కోట్ల పెట్టుబడి

రూ.60,000 కోట్ల నుంచి రూ.80,00 కోట్ల పెట్టుబడితో, ఏటా 90 నుంచి 110 లక్షల టన్నుల రిఫైనింగ్ సామర్థ్యంతో ఈ కొత్త రిఫైనరీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని బీపీసీఎల్ భావిస్తోంది. తీర ప్రాంతంలోని మచిలీపట్నం, రామాయపట్నం లేదా మూలపాడు వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. త్వరగా సవివరమైన ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుని తనను కలవాలని సీఎం చంద్రబాబు నాయుడు బీపీసీఎల్ ఉన్నతాధికారులను కోరారు. దీంతో వచ్చే ఆరేడు నెలల్లో ఈ ప్రాజెక్టు ఏర్పాటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

చిన్న డిపాజిట్లకే పెద్దపీట: కెనరాబ్యాంక్ ఎండీ సత్యనారాయణరాజు



న్యూఢిల్లీ: కరెంట్ అకౌంట్, సేవింగ్స్ ఖాతాలు (కాసా) లేదా చిన్న డిపాజిట్ల సమీకరణకే బ్యాంక్ ప్రాధాన్యం ఇస్తున్నదని, ఈ దిశగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని కెనరాబ్యాంక్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె.సత్యనారాయణ రాజు అన్నారు. ప్రస్తుతం తమ కాసా నిష్పత్తి మొత్తం డిపాజిట్లలో 31 శాతం ఉన్నదని, ఈ ఆర్థిక సంవత్సరాంతానికి దాన్ని 33 శాతం చేర్చాలనుకుంటున్నామని ఆయన చెప్పారు. జూన్ నుంచి జూన్‌తో పోల్చితే ఏడాది కాలంలో సేవింగ్స్ ఖాతాల నిల్వ రూ.12,000 కోట్లు పెరిగిందని రాజు చెప్పారు. అత్యంత ప్రత్యేకమైన, కొత్త రకం ఉత్పత్తులు ప్రవేశపెట్టడం ద్వారా వ్యక్తిగత ఎస్‌బి ఖాతాలు పెంచుకునే కృషిని బ్యాంక్ కొనసాగిస్తుందని ఆయన వెల్లడించారు.

2030 నాటికి లక్ష మంది కంపెనీ సెక్రటరీలు అవసరం

న్యూఢిల్లీ: భారత్‌కు 2030 నాటికి లక్ష మంది కంపెనీ సెక్రటరీలు (సీఎస్) అవసరమని ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ బి.నరసింహన్ అన్నారు. ప్రస్తుతం దేశంలో 73,000 మంది కంపెనీ సెక్రటరీలుండగా 12 వేల మంది మాత్రం ప్రాక్టీస్ చేస్తున్నారని ఆయన చెప్పారు. కంపెనీలు చట్టబద్ధమైన నిబంధనలన్నింటికీ కట్టుబడేలా చూడడంలో సీఎస్‌ల పాత్ర కీలకమని తెలిపారు. దేశం సాధిస్తున్న వృద్ధిని పరిగణనలోకి తీసుకుంటే రాబోయే కాలంలో సీఎస్‌ల పాత్ర మరింతగా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాము సగటున సంవత్సరానికి 2500 మందికి సభ్యత్వం అందిస్తున్నామని చెప్పారు.

ఫాక్స్‌కాన్ నుంచి త్వరలో విద్యుత్ వాహనాలు

త్వరలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ ప్లాంట్‌పైనా నిర్ణయం



శ్రీపెరంబుదూర్ (తమిళనాడు): కాంట్రాక్టు పద్ధతిలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తయారు చేసే తైవాన్ కంపెనీ 'ఫాక్స్‌కాన్' భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా విద్యుత్ వాహనాల (ఈవీ) రంగంలోకి ప్రవేశిస్తోంది. త్వరలోనే ఈ ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభమవుతుందని ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న కంపెనీ చైర్మన్ యంగ్ లీ చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి ప్లాంట్ ఏర్పాటుపైనా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ప్లాంటు కోసం తమిళనాడు, కర్ణాటకతో పాటు తెలంగాణ కూడా పోటీపడుతోంది. తమ రాష్ట్రంలో ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తే పలు రాయితీలు కల్పిస్తామని ఇటీవల తమను కలిసిన లీకి ఈ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హామీ ఇచ్చారు. దీంతో ఫాక్స్‌కాన్ ఈ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేస్తుందన్న ఉత్కంఠత నెలకొంది.

తైవాన్‌లోనే తొలి ప్లాంట్: ఫాక్స్‌కాన్ ఇటీవలే తైవాన్‌లో ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఇ-బస్సుల నుంచి ఈ బ్యాటరీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఈ తరహా ప్లాంటు తమ దేశంలోనూ ఏర్పాటు చేయాలని ఇండోనేషియా ప్రభుత్వం ఫాక్స్‌కాన్‌ను కోరింది. ఇపుడు భారత్‌లోనూ ఈ తరహా ప్లాంటు ఏర్పాటుకు కంపెనీ సిద్ధమవుతోంది. దేశంలో వేగంగా పెరుగుతున్న ఈవీల అమ్మకాలతో ఈ బ్యాటరీ ఇంధన స్టోరేజి యూనిట్లకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తోంది.

మరింత ముందుకే....

సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ ఈ వారం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంకు 'ఫెడ్' వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, ఆ దేశంలో మాంద్యం భయాలు తొలగడం, రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదం చేయనున్నాయి. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల విషయంలో మదుపరులు అప్రమత్తంగా ఉండక తప్పదు. నిఫ్టీకి ఈ వారం 24450 పాయింట్ల వద్ద మద్దతు, 24650 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది.

ఈ వారం స్టాక్ రికమండేషన్స్

ఎంసీఎక్స్: దీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేర్లలో గత వారం చక్కని కన్సాలిడేషన్ జరిగింది. ఈ షేర్లు కీలకమైన రూ.4,300 మద్దతు స్థాయిని అధిగమించాయి. రిలేటివ్ స్ట్రెంత్, కదలిక, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరుగుతున్నాయి. శుక్రవారం 5.86 శాతం లాభంతో రూ.4,630 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.4,680/4,755 టార్గెట్‌తో రూ.4,600 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.4,545ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వెల్‌స్పన్ కార్ప్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్నాయి. ప్రైస్ యాక్షన్ నిలకడగా ఉంది. ఈ కౌంటర్లో కన్సాలిడేషన్ కూడా ముగిసింది. గత వారం ఈ కంపెనీ షేర్లు 6.93 శాతం లాభంతో రూ.706 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.775/825 టార్గెట్‌తో ఈ కౌంటర్లో రూ.690/700 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.660ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బిర్లా సాఫ్ట్: గత ఆరు నెలలుగా అండర్ పర్‌ఫార్మెన్స్ చేస్తున్న ఈ షేర్లకు రూ.600 వద్ద కీలక మద్దతు లభించింది. ఐటీ షేర్లకు ఫ్రెష్ డిమాండ్ నేపథ్యంలో మదుపరుల చూపు మళ్లీ ఈ కౌంటర్‌పై పడింది. గత వారం ఈ కంపెనీ షేర్లు 6.12 శాతం లాభంతో రూ.600 వద్ద ముగిశాయి. మూమెంటం ఇన్వెస్టర్లు రూ.590/575 శ్రేణిలో రూ.660/750 టార్గెట్‌తో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.555ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డీఎల్ఎఫ్ : రేటింగ్ తర్వాత అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లలో ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్స్ గణనీయంగా పెరుగుతున్నాయి. చివరి త్రైమాసికం అంచనాలను అందుకోనప్పటికీ ఈపీఎస్ బాగుంది. కీలకమైన రూ.820 వద్ద మద్దతు లభించడంతో మదుపరుల చూపు మళ్లీ ఈ కంపెనీ షేర్లపై పడింది. గత వారం ఈ కంపెనీ షేర్లు 5.51 శాతం లాభంతో రూ.866 వద్ద ముగిశాయి. రూ.960/1020 టార్గెట్‌తో మదుపరులు రూ.850 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.800ని స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందూస్తాన్ కాపర్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు స్వల్పకాల డౌన్‌ట్రెండ్‌లో ఉన్నాయి. తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్లో కొంత కదలిక కనిపిస్తోంది. ఈ కంపెనీ షేర్లు గత వారం 5.12 శాతం లాభంతో రూ.313 వద్ద ముగిశాయి. మదుపరులు ఈ కౌంటర్లో రూ.345/365 టార్గెట్‌తో రూ.300 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.289ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

24500 పైన పటిష్ఠం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కీలక స్థాయి 24500 వద్ద విఫలమై బలమైన కరెక్షన్‌లో ప్రవేశించినా 24100 వద్ద కోలుకుని శుక్రవారం బలమైన ర్యాలీలో 400 పాయింట్ల మేరకు లాభపడింది. మొత్తానికి 175 పాయింట్లు లాభపడి వారం గరిష్ఠ స్థాయి 24540 వద్ద ముగియడం సానుకూల సంకేతం. ఈ రికవరీతో తక్షణ డౌన్‌ట్రెండ్ ప్రమాదం నుంచి బయటపడిందని భావించవచ్చు. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 480 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 26 పాయింట్లు లాభంతో ముగిశాయి. మార్కెట్ ఈ వారం పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయిల్లో మళ్లీ పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: గతంలో ఏర్పడిన టాప్ 24500 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ప్రధాన నిరోధం 24700 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలు 24850, 25100.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24400 వద్ద విఫలమైతే బలహీనతకు ఆస్కారం ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 24200. శుక్రవారం ఏర్పడిన బాటమ్ ఇదే. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 24000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం కరెక్షన్‌లో 800 పాయింట్ల మేరకు దిగజారినా రికవరీ సాధించి 32 పాయింట్ల స్వల్ప లాభంతో 50500 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 51000. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనపడి మైనర్ మద్దతు స్థాయి 50300 కన్నా దిగజారితే బలహీనత సంకేతం ఇస్తుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 25 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 24400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక అప్రమత్తతను సూచిస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,610, 24,660
మద్దతు	24,460, 24,400

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

వైభవంగా గంగ తెప్పోత్సవం

» గంగపుత్రులు, భక్తులతో కిటకిటలాడిన సాగర తీరం

ఖైరతాబాద్,ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ఏటా గంగపుత్రులు నిర్వహించే గంగ తెప్పోత్సవం ఈసారి కూడా అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు చప్పుళ్లు, మహిళల బోనాలు, శివసత్తుల వీరంగాలు, ఒగ్గుడోలు, గుస్సాడి తదితర కళాకారుల విన్యాసాలతో ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఖైరతాబాద్ ఏడుగుళ్ల దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ భారీ శోభాయాత్ర కిలోమీటర్ మేర కొనసాగుతూ హుస్సేన్ సాగర్ ఒడ్డున ఉన్న గంగమ్మ దేవాలయం వరకు వేడుకగా జరిగింది. అక్కడ సాగర్ జలాల్లోకి గంగ తెప్పను వదిలిన అనంతరం ఐమాక్స్ ప్రక్కనున్న హెచ్ఎండిఏ మైదానంలో జరిగిన గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠాగోపాల్, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీహెచ్ మాట్లాడుతూ గంగపుత్రులు ఉన్నత చదువులతో పైస్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు.

'సుంకిశాల'పై త్వరలో ప్రభుత్వానికి నివేదిక

» రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆనంద్‌కుమార్

నాగార్జునసాగర్, ఆగస్టు 18: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపంలోని పెద్దవూర మండలం సుంకిశాల పంప్‌హౌస్ రక్షణ గోడ కూలిన ఘటనలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం, ఉన్నతాధికారులకు త్వరలో నివేదిక అందజేయనున్నట్టు రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రమాదం జరగడానికి కారణం ఇక్కడ పనిచేస్తున్న అధికారుల నిర్లక్ష్యమా? లేక అకస్మాత్తుగా జరిగిందా? అనే దానిపై దృష్టిసారిస్తున్నట్టు ఆయన తెలిపారు.

'వర్గీకరణ'కు వ్యతిరేకంగా 21న భారత్ బంద్

» ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

పంజాగుట్ట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలదే అధికారం అని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు వల్ల తమ హక్కులకు భంగం వాటిల్లుతోందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ సర్వయ్య, కో-కన్వీనర్ జి.చెన్నయ్య అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21న భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నామని వారు తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి నాయకులతో కలిసి వారు మాట్లాడారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ఈ తీర్పు ఉన్నందువల్ల దానిని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. 21న నిర్వహించే బంద్‌లో ఎస్సీ, ఎస్టీ సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, మహిళా విభాగాలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి

» మహిళా కమిషన్‌కు టీ-జూడా నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్కారీ దవాఖానాలు, వైద్య కళాశాలలు, హాస్టళ్లలో ఉంటున్న మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులకు పటిష్ఠమైన రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం (జూడా) నాయకులు కోరారు. ఆదివారం టీ- జూడా ప్రతినిధి డాక్టర్ చంద్రిక ఆధ్వర్యంలో గాంధీ, ఉస్మానియా కళాశాలల మహిళా ప్రతినిధులతో కలిసి తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ ఎస్.శారదను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రుల్లో రెసిడెంట్ డాక్టర్లు, మెడికోలు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించారు. వైద్యుల పని ప్రదేశంలో వారి భద్రతాపరమైన సమస్యలపై ప్రధానంగా చర్చించారు. ఆసుపత్రుల్లో మహిళలకు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యంతో కూడిన ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో మహిళా కానిస్టేబుళ్లు విధిగా ఉండాలని కోరారు. ఆసుపత్రుల్లోకి ప్రవేశించే రోగుల సహాయకులందరినీ పరీక్షించడానికి యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్‌ను అమలు చేయాలని అలాగే జూడా సభ్యుల భాగస్వామ్యంతో కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారని, సర్కారుకు ఇదే విషయాన్ని తెలియజేసి సమస్యల పరిష్కారానికి యత్నిస్తానని హామీ ఇచ్చారని జూడా నేతలు వెల్లడించారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై రేపు సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ, ఆగస్టు 18: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బెయిలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ జరపనుంది. అవినీతి, మనీలాండరింగ్ ఆరోపణలపై ఆమెను ఈడీ, సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కవిత తిహాడ్ జైల్లో ఉన్నారు. ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు బెయిలు ఇవ్వాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. జూలై 1న న్యాయస్థానం బెయిలు ఇచ్చేందుకు నిరాకరించింది. దాన్ని సవాలు చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 12న పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సీబీఐ, ఈడీ స్పందనలు తెలియజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 20న చేపడతామని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం తెలిపింది.

ఏసీబీ వలలో శ్రీముసలమ్మ ఆలయ ఈవో

» రూ.20వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

కొత్తగూడ, మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 18: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలోని శ్రీముసలమ్మ ఆలయ ఈవో భోగోజు భిక్షమాచారి ఆదివారం ఏసీబీ వలకు చిక్కారు. ఓ దుకాణదారుడి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం... శ్రీముసలమ్మ ఆలయం ఆవరణలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కిరాణ దుకాణం ఏర్పాటు చేశారు. గత మే 29న టెండరులో గుంజేడుకు చెందిన పొల్తి రాములు ఈ దుకాణాన్ని దక్కించుకోగా హైదరాబాద్‌కు చెందిన నల్లెపు సాంబయ్య దీన్ని నడుపుతున్నాడు. ఈ దుకాణంలో మద్యం అమ్ముతున్నారని గత జూన్ 11న దుకాణాన్ని దేవాదాయ శాఖ సీజ్ చేసింది. దాన్ని మళ్లీ తెరిచేందుకు సాంబయ్య అనుమతి తెచ్చారు. అయితే షాపు పునరుద్ధరణకు లంచం ఇవ్వాలని ఈవో భిక్షమాచారి డిమాండ్ చేయగా.. సాంబయ్య ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఆదివారం పథకం ప్రకారం ఈవోకు సాంబయ్య రూ.20 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరోవైపు మరిపెడలోని భిక్షమాచారి ఇంట్లో ఆదివారం రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు జరిపారు.

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు

సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్

» హైదరాబాద్‌లో పాపన్న గౌడ్ విగ్రహం : డిప్యూటీ సీఎం భట్టి

రవీంద్రభారతి, ములుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కులగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న స్వస్థలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.4.7 కోట్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌లో పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు రవీంద్ర భారతీలో ఆదివారం జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి కార్యక్రమంలో మంత్రులు భట్టి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. పాపన్న చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు స్ఫూర్తినిచ్చేలా ప్రభుత్వం పాపన్న జయంతి వేడుకలను నిర్వహిస్తోందని చెప్పారు. పాపన్న జీవిత చరిత్రను ప్రచారం చేసేందుకు బీసీ సంక్షేమ శాఖ ప్రణాళికలు రూపొందిస్తే తక్షణమే ఆమోదిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో పాపన్న విగ్రహ ఏర్పాటు బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగిస్తున్నట్టు ప్రకటించారు.



సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

పాపన్న గౌడ్ ఆలోచనలనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తన సందేశాన్ని పంపారని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఇక, ములుగు కలెక్టరేట్‌లో జరిగిన పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేశారు. ఇక, టీపీసీసీ కల్లుగీత కార్మిక విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోనూ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాగా సర్వాయి పాపన్న స్వగ్రామం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సర్వాయిపేటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.4.7కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. సిరిసిల్లలో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడు తూ గౌడన్నల సంక్షేమం కోసం కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు.

బడా భవనాలపైకి బుల్డోజర్

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణాలపై ఒకటి, రెండు రోజుల్లో చర్యలు ఉంటాయని హైడ్రా వర్గాలు పేర్కొన్నాయి.

ఆక్రమించి.. క్రికెట్ మైదానం..

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు, అప్పోజిగూడ పంచాయతీలలో కొన్నేళ్ల కిత్రం వెస్ట్‌సైడ్ పేరిట భారీ వెంచర్ వేశారు. ఇక్కడ ప్లాట్లు కొన్న కొంతమంది 500, 1000 గజాల్లో రెండు, మూడు అంతస్తుల్లో పెద్ద భవనాలు నిర్మించారు. ఈ వెంచర్‌లో కొంతభాగం గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉంది. వారం రోజులుగా ఈ ప్రాంతాన్ని హైడ్రా అధికారులు పరిశీలించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య వెస్ట్‌సైడ్ వెంచర్‌లో కూల్చివేతలు ప్రారంభించారు. కాగా, దీనిపక్కనే కొందరు చెరువు ఎఫ్‌టీఎల్‌ను కొంత ఆక్రమించి ఏకంగా క్రికెట్ మైదానం నిర్మించారు. దీన్ని సైతం ధ్వంసం చేశారు. అప్పోజిగూడ పంచాయతీలోకి వచ్చే మూడు భవనాలు, చిలుకూరు పరిధిలోని ఒక భవనాన్ని నేల మట్టం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూల్చివేతలు చేపట్టారు.

మట్టి పోసి.. ఎత్తు పెంచి

గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ సముద్ర పట్టానికి 1,790 అడుగుల ఎత్తున ఉంటుందని ప్రభుత్వ విభాగాలు గతంలో నిర్ధారించాయి. దీనికి సంబంధించి జలమండలి కూడా ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఉండదు. కానీ, కొందరు ప్రముఖులు 'ఎత్తులు' వేశారు. ఎఫ్‌టీఎల్‌లో భూములు/ప్లాట్లను వ్యర్థాలతో నింపారు. 1,780 అడుగుల ఎత్తులో ఉన్న స్థలంలో 15 అడుగుల మేర వ్యర్థాలు పోశారు. ప్లాట్ 1,795 అడుగుల ఎత్తులో ఉన్నట్లు చూపి యథేచ్ఛగా భవనాలు నిర్మించారు. వీరికి స్థానిక మునిసిపల్, సాగు నీటి శాఖ అధికారుల్లో కొందరు సహకరించినట్లు గుర్తించారు. ఆదివారం కూల్చివేసినవాటిలో అత్యధిక భవనాల విషయంలో ఇదే జరిగిందని అధికారులు చెబుతున్నారు. గండిపేట జలాశయంలో నీటి మట్టం పెరిగితే ఈ భవనాల చుట్టూ నీరు చేరుతోంది. కాగా, ఇక్కడి భవనాల పక్కనున్న స్థలం ఎత్తును పరిశీలించిన అధికారులు.. వ్యర్థాలు డంప్ చేసి నిర్మాణాల స్థలం ఎత్తును పెంచినట్లుగా నిర్ధారించుకున్నారు.



గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

గప్‌చుప్‌గా వెళ్లి..

అక్రమ నిర్మాణాల పని పట్టే విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కూల్చివేతలు ఎక్కడ చేపట్టనున్నారనే సమాచారం గోప్యంగా ఉంచడంతో పాటు.. ఎలాంటి అడ్డంకులు లేకుండా స్థానిక పోలీసుల సహకారం తీసుకున్నారు. అయితే, ఆదివారం కూల్చివేతల సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. భవనాలకు చెందిన కొందరు వ్యక్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమవద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని, ప్రైవేట్ స్థలాల్లో నిర్మాణాలను ఎలా తొలగిస్తారని నిలదీశారు. ఇలాంటివి ఎదురవుతాయని భావించిన హైడ్రా అధికారులు పోలీసుల సాయం కోరారు. వాగ్వాదానికి దిగుతున్నవారిని సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూల్చివేతల పరిసరాల్లోకి స్థానికులు, నాయకులతో పాటు మీడియాను కూడా అనుమతించలేదు.

పదిహేనేళ్ల కిందట పంచాయతీగా ఉన్నప్పుడు

2009లో గండిపేట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో మహిళా సర్పంచ్ ఒకరు ఎఫ్‌టీఎల్‌లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. ఆ సర్పంచ్ ఇప్పటికీ పాత తేదీలతో భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని, దీనిపై చర్య తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు. ప్రస్తుత నిర్మాణాలకు పాత తేదీలతో జారీ చేసిన అనుమతులు చెల్లవన్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా గండిపేట చెరువులోకి వ్యర్థాలు చేరి నీరు కలుషితం అవుతోందని, ఈ మంచి నీటి చెరువును కాపాడాల్సిన అవసరం ఉందని ప్రజలందరిపైనా ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వంలోని పెద్దలకు ఫోన్లు

గండిపేటలో కూల్చివేతల సమయంలో కొందరు ప్రభుత్వంలోని పెద్దలకు ఫోన్లు చేశారు. కల్పించుకునేందుకు వారు నిరాకరించారు. ఇక కొందరు నిర్మాణదారులు నాయకులకు ఫోన్లు చేసి.. "మీరు చెబితే ఇక్కడ స్థలాలు కొన్నాం. భవనాలు నిర్మించాం. ఇప్పుడు పడగొడతాం అంటున్నారు. సాయం చేయండి" అని కోరారు. ఆ నాయకులు స్పందించక పోగా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో తమకు భూములు విక్రయించి రూ.కోట్లు సంపాదించిన నాయకులంతా మొహంచాటేయడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత సర్కారు హయాంలో..

ఖానాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. జలాశయం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌తో పాటు ఎగువ నుంచి వరద వచ్చే కాలువలకు అడ్డంగా భవనాలు వెలిశాయి. గండిపేట జలాశయం పరివాహక ప్రాంతం రక్షణకు ఉద్దేశించిన జీవో- 111 పరిధిలో ఖానాపూర్‌తో పాటు వట్టినాగులపల్లి కూడా ఉంది. ఈ రెండు గ్రామాలు గండిపేట మండలంలోకి, మిగతావన్నీ శంకర్‌పల్లి, మొయినాబాద్ మండల పరిధిలోకి వస్తాయి. త్వరలో వట్టినాగులపల్లిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.



ఏపీ మద్యం స్కాంలో.. వాసుదేవరెడ్డికి సీఐడీ ఉచ్చు!

» రెండ్రోజుల క్రితం పిలిపించి విచారణ

» కీలక వివరాలు బయటపెట్టిన బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కీలక సూత్రధారి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డిని సీఐడీ అధికారులు పిలిపించి విచారించారు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఆయన కోసం సీఐడీ బృందాలు విస్తృతంగా గాలిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ కూడా చేసింది. నాలుగు రోజుల క్రితం బెంగళూరులో ఆయన ఆచూకీ సీఐడీకి లభించింది. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి చెందిన యలహంక ప్యాలెస్‌కు సమీపంలోని ఒక హోటల్లో వాసుదేవరెడ్డి మకాం వేసినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. రెండ్రోజుల క్రితం ఆయన్ను పిలిపించి విచారించినట్లు తెలిసింది. మొత్తం కుంభకోణం తీరుతెన్నులపై ప్రశ్నించినట్లు సమాచారం. మద్యం పాలసీ నిర్ణయాలు మొదలుకుని.. విక్రయాలు, ముడుపులు, బ్లాక్ మార్కెట్ అమ్మకాలు.. కంపెనీల నుంచి వసూలు చేసిన పర్సంటేజీలు, అందులో తాడేపల్లి ప్యాలెస్‌కు చేరింది ఎంత.. ప్రభుత్వ పెద్దల్లో ఎవరి పాత్ర ఎంత.. అనే వివరాలను సీఐడీ అధికారులు రాబట్టారు. 2019-24 మధ్య ఏయే మద్యం కంపెనీల నుంచి ఎంత వ్యాపారం జరిగింది.. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే ఆ బ్రాండ్ మద్యం ధరలు ఏపీలో ఎందుకు ఎక్కువగా ఉన్నాయి.. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన 32 రకాల నాసిరకం బ్రాండ్ల నుంచి వసూలు చేసింది ఎంత..? జగన్ అనుచరులకు సంబంధించిన 11 డిస్టలరీల నుంచే 65 శాతం మద్యం కొనుగోలు చేయడం వెనుక మతలబు ఏమిటి..? మద్యం ధరలు విపరీతంగా పెంచడం వెనుక అసలు రహస్యం ఏమిటి..? గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ఎక్కువగా అమ్ముడుపోయిన ఐదు పాపులర్ బ్రాండ్లను 2019 తర్వాత నిలిపివేయడానికి కారణాలేంటి.. అని వాసుదేవరెడ్డిపై ప్రశ్నలవర్షం కురిపించారు. యావత్ కుంభకోణంపై ఆయన నుంచి ఆశ్చర్యపోయే సమాచారాన్నే రాబట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ వివరాలను వాస్తవాలతో బేరీజు వేసుకుని అసలు సూత్రధారులకు ఉచ్చు బిగించే దిశగా సీఐడీ అధికారులు అడుగులు వేస్తున్నారు. మాజీ ఎంపీ డీకే ఆదికేశవులునాయుడు కుమారుడు డీకే శ్రీనివాస్ సహా డిస్టిలరీల యజమానులను కూడా విచారించిన తర్వాత తదుపరి చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. కాగా.. యలహంక ప్యాలెస్‌లో జరిగిన సమావేశంలో.. ఈ కేసు తన మెడకు చుట్టుకుంటే ఎలా బయటపడాలన్న అంశంపై పెద్దపెద్ద న్యాయవాదులతో జగన్ చర్చలు జరిపారని వాసుదేవరెడ్డి వెల్లడించినట్లు సమాచారం.

దక్షిణ డిస్కమ్‌లో పదోన్నతుల పండగ!

డిస్కమ్ చరిత్రలో తొలిసారిగా 2,263 మందికి ఒకేసారి ప్రమోషన్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఉద్యోగులకు భారీగా పదోన్నతులు కల్పించారు. ఈ డిస్కమ్ చరిత్రలో మొదటిసారిగా 2,263 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ సర్వీస్‌లో 101, అకౌంట్స్‌లో 47, ఓఅండ్ఎం విభాగంలో 2099, పీఅండ్‌జీ సర్వీస్‌లో 16మందికి పదోన్నతులు కల్పించారు. భారీ స్థాయిలో పదోన్నతులు కల్పించడంపై విద్యుత్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్లుగా డిస్కమ్‌లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల అంశాన్ని ప్రభుత్వ ఆదేశాలతో సీఎండీ పరిష్కరించడంపై దక్షిణ డిస్కమ్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు సంబురాలు చేసుకున్నారు. పదోన్నతులతో ఖాళీ అయిన పోస్టుల భర్తీకి ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని సీఎండీ ముషారఫ్ తెలిపారు.



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

డిప్యూటీ సీఎం చొరవతో..

విద్యుత్ సంస్థల్లో గత ఏడేళ్లుగా ఖాళీ పోస్టులున్నా పదోన్నతులు పొందలేక వేలాది మంది ఉద్యోగులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగస్టు 8న దక్షిణ డిస్కమ్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పదోన్నతులకు సంబంధించిన కార్యాచరణను వెంటనే ప్రారంభించాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖిని ఆయన ఆదేశించారు. దీంతో ఒకేసారి భారీగా దక్షిణ డిస్కమ్‌లో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఈ నేపథ్యంలో టీఈఈజేఏసీ కో చైర్మన్ పి.అంజయ్య, కోకన్వీనర్ రామేశ్వర్ షెట్టిల ఆధ్వర్యంలో ఖైరతాబాద్ టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎండీ ముషారఫ్ చిత్రపటాలకు జేఏసీ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు.

ఆందోళనలో ట్రాన్స్‌కో, జెన్‌కో ఉద్యోగులు...

గత పదేళ్లుగా కొత్త సబ్‌స్టేషన్లు, ఉత్పత్తి కేంద్రాలతో సామర్థ్యం రెండింతలు పెరిగినా ఉద్యోగుల సామర్థ్యం పెంచలేదని, కొత్త పోస్టులకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినా యాజమాన్యాలు ఒక్క ఉద్యోగితో ముగ్గురు చేయాల్సిన పనులు చేయిస్తున్నాయంటూ జెన్‌కో, ట్రాన్స్‌కో ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకే కేడర్‌లో 15 ఏళ్లుగా పనిచేస్తూ ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని, డిస్కంలలో పదోన్నతుల నేపథ్యంలో ట్రాన్స్‌కో, జెన్‌కోలో పదోన్నతుల అంశాన్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి పదోన్నతులు కల్పించాలని ఆదేశించినా అమలు చేయడంలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుణభారం.. సుదీర్ఘకాలం!

(మొదటిపేజీ తరువాయి)

పథకాలు, ఇతర ఉచిత పథకాలకు అప్పుల సొమ్మును వినియోగించొద్దని హెచ్చరిస్తున్నాయి. తీసుకుంటున్న రుణాల్ని ఆస్తులు సృష్టించడానికి వెచ్చించాలని చెబుతున్నాయి. కానీ, తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలు అప్పుల్లో ఎక్కువ సొమ్మును ఉచిత పథకాలకే వినియోగిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇది రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు ఏ మాత్రం ఆరోగ్యకరం కాదంటూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా హెచ్చరిస్తోంది. అయినా రాష్ట్రాల తీరు మారడం లేదు. తెలంగాణ ఆవిర్భవించిన కొత్తలో ఆరేళ్లు, ఎనిమిదేళ్ల కాల పరిమితితో ప్రభుత్వం అప్పులు తీసుకుంది. ఆ తర్వాత 2015, 2016 సంవత్సరాల్లో ఇది 10, 12 ఏళ్లకు పెరిగింది. 2021, 2022 నాటికి 15-17 ఏళ్ల మధ్య కొనసాగింది. ఇప్పుడది ఏకంగా 19 ఏళ్లకు చేరింది. ఒక్కోసారి 28, 29 ఏళ్ల కాల పరిమితితోనూ ప్రభుత్వం అప్పులు తీసుకుంటోంది. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో అప్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 47 సెక్యూరిటీ బాండ్లను జారీ చేసింది. అత్యల్పంగా రూ.500 కోట్లు.. అత్యధికంగా రూ.3000 కోట్ల రుణం కోసం వీటిని విడుదల చేసింది. అతి తక్కువగా ఏడేళ్లు, అత్యధికంగా 28 ఏళ్ల కాల పరిమితితో బాండ్లు జారీ అయ్యాయి. సగటు కాల పరిమితి 18.5 ఏళ్లుగా తేలింది. 2023 మే 2న రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్ల అప్పును 25 ఏళ్ల కాల పరిమితి, 7.32 శాతం వార్షిక వడ్డీతో తీసుకోవడం గమనార్హం. అదేరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూ.1000 కోట్లను 16 ఏళ్ల కాల పరిమితి, 7.32 శాతం వార్షిక వడ్డీతో, మరో రూ.1000 కోట్లను 20 ఏళ్ల కాల పరిమితి, 7.30 శాతం వార్షిక వడ్డీతో తీసుకుంది. వడ్డీ శాతాల్లో పెద్దగా తేడా లేకపోయినా.. ఏపీ తక్కువ కాల పరిమితితో అప్పు తీసుకుంటే, తెలంగాణ మాత్రం 25 ఏళ్ల కాల పరిమితితో అప్పు తీసుకోవడం గమనార్హం. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 6 వరకు మొత్తం 24 సెక్యూరిటీ బాండ్లను జారీ చేసింది. ఇందులో కూడా అత్యధికంగా 29 ఏళ్ల కాల పరిమితితో జారీ చేసినవి ఉన్నాయి. ఈ నాలుగు నెలలకు గాను అప్పుల సగటు కాల పరిమితి 19 ఏళ్లుగా ఉంది. ఇలా సుదీర్ఘ కాల పరిమితితో తీసుకుంటున్న అప్పులు.. రాబోయే ప్రభుత్వాలకు గుదిబండగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అప్పుల్లో 76.23 శాతం మేర నిధులు పాత అప్పుల చెల్లింపులకే సరిపోతున్నాయని కాగ్ ఆక్షేపించింది. 2032-33 నాటికి రాష్ట్ర ప్రభుత్వం అసలు, వడ్డీల కింద రూ.2.90 లక్షల కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుందని నిగ్గు తేల్చింది.

వడ్డీ తగ్గుతుందనే..!

సాధారణంగా కాల పరిమితి ఆధారంగా వడ్డీ శాతాలు నిర్ణయమవుతాయి. రాష్ట్రాలు అప్పుల కోసం జారీ చేసే బాండ్లను ఆర్‌బీఐ వేలానికి పెట్టి, వడ్డీ శాతాలను ఖరారు చేస్తుంది. ఎక్కువ కాల పరిమితితో బాండ్లను జారీ చేస్తే వడ్డీ శాతం స్వల్పంగా తగ్గుతుంది. అందుకే ప్రభుత్వాలు తక్కువ వడ్డీతో సుదీర్ఘ కాల పరిమితితో అప్పులు తీసుకోవడానికి ఇష్టపడుతున్నాయి. కానీ, ఇది రాబోయే ప్రభుత్వాలకు సంకటంగా మారుతోంది.

ఏసీపీ కళ్లెదుటే గొంతు కోసుకుని..

(మొదటిపేజీ తరువాయి)

మున్సిపల్ కమిషనర్ సతీష్ ఈ నెల 16న ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ సందర్భంలో కౌన్సిలర్ సత్యనారాయణ తన విధులకు అడ్డుపడడంతోపాటు కులదూషణకు పాల్పడ్డారని కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సత్యనారాయణపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో విచారణకు సత్యనారాయణను ఆదివారం ఉదయం మంచిర్యాల ఏసీపీ కార్యాలయానికి పిలిపించారు. ఏసీపీ ప్రకాశ్ విచారణ చేస్తుండగానే సత్యనారాయణ హఠాత్తుగా కత్తితో తన గొంతు కోసుకున్నాడు. పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే, సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే ఆదేశాలతోనే పోలీసులు తనపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తాను ఆ స్థలం వద్దకు వెళ్లలేదని స్పష్టం చేశారు. వైద్య పరీక్షల కోసం వెళ్లి హైదరాబాద్‌లోని ఓ లాడ్జిలో ఉన్న తనని పోలీసులు శనివారం అర్ధరాత్రి మంచిర్యాల తీసుకొచ్చి వేధింపులకు గురి చేశారన్నారు. జైలు నుంచి బయటకు ఎలా వస్తావో చూస్తానంటూ.. విచారణ సందర్భంగా ఏసీపీ భయపెట్టడంతో ఆత్మహత్యకు యత్నించినట్టు తెలిపారు. తనకు ఏదైనా జరిగితే ఏసీపీ ప్రకాశ్ పూర్తి బాధ్యుడని స్పష్టం చేశారు.

హడావుడిగా నా కుమార్తె అంత్యక్రియలు

» దీనిపై అనుమానాలున్నాయి: ట్రైనీ డాక్టర్ తండ్రి

కోల్కతా, ఆగస్టు 18: స్థానిక ఆర్.జి. కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్ దారుణంగా అత్యాచారానికి, హత్యకు గురయిన సంఘటనపై దర్యాప్తు జరుగుతున్న తీరు సక్రమంగా లేదని ఆమె తండ్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేసుపై మమత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగులేదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె భౌతిక కాయాన్ని హడావిడిగా దహనం చేశారని, దీనిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. శ్మశానంలో అప్పటికే మూడు శవాలు ఉన్నప్పటికీ తన కుమార్తె భౌతిక కాయానికి ముందుగా దహన సంస్కారాలు చేశారని చెప్పారు. "న్యాయం చేస్తామని సీఎం అంటున్నారు. కానీ న్యాయం కోసం డిమాండు చేస్తున్న సామాన్యులను జైల్లో పెడుతున్నారు" అని వాపోయారు. ప్రస్తుతం సీబీఐ జరుపుతున్న దర్యాప్తు పట్ల కూడా ఆయన సంతృప్తి చెందలేదు. "దర్యాప్తు జరుగుతున్నా ఇంతవరకు ఎలాంటి ఫలితాలు వెల్లడికాలేదు. డిపార్టుమెంటు తరఫునగానీ, కాలేజీ తరఫునగానీ ఒక్కరు కూడా మాకు సహకరించలేదు. మొత్తం డిపార్టుమెంటుకు ఇందులో ప్రమేయం ఉంది" అని ఆరోపించారు. న్యాయం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తోందని చెప్పారు. ఒకప్పుడు వీధి పోరాటాలు చేసిన ముఖ్యమంత్రే ఇప్పుడు నిరసన ప్రదర్శనలను అడ్డుకుంటున్నారన్నారు. బాధితురాలి తల్లి మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం తీసుకోబోమని తెలిపారు.

వైద్య ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చట్టం కావాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 18: వైద్య ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ 70మందికిపైగా పద్మ అవార్డు గ్రహీత వైద్యులు ప్రధానికి లేఖ రాశారు. మాటలరూపంలోగానీ, భౌతికంగాగానీ హింసించే వారికి కఠిన శిక్షలు విధించేలా ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు. వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య సంస్థలపై దాడుల నిరోధక బిల్లును 2019లోనే రూపొందించినా, ఇంతవరకు పార్లమెంటులో ప్రవేశపెట్టని విషయాన్ని గుర్తు చేశారు. దీనిని వెంటనే ఆమోదించాలని కోరారు. ఈ విషయంలో తక్షణమే స్వయంగా జోక్యం చేసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ్, ఎయిమ్స్-ఢిల్లీ మాజీ డైరెక్టర్ డాక్టర్ గులేరియా ఉన్నారు.

డెహ్రాడూన్లో బస్సులో బాలికపై గ్యాంగ్ రేప్

డెహ్రాడూన్, ఆగస్టు 18: డెహ్రాడూన్లో ఓ మైనర్ బాలికపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అంతర్రాష్ట్ర బస్సు టెర్మినల్లో నిలిచి ఉన్న బస్సులో ఈ నెల 13న ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ బస్టాండుకు సమీపంలోనే కొత్వాలీ పటేల్ నగర్ పోలీసు స్టేషన్ ఉండడం గమనార్హం. పంజాబ్కు చెందిన ఆ బాలిక ఓ అనాథ. అక్కా బావలతో కలిసి ఉండేది. ఈ నెల 11న ఆమెను ఇంటి నుంచి బయటకు పంపించి వేయడంతో ఏమి చేయాలో తెలియక ఢిల్లీ మీదుగా మొరాదాబాద్ చేరుకొంది. అక్కడ నుంచి ఉత్తరప్రదేశ్ ఆర్టీసీ బస్సు ద్వారా డెహ్రాడూన్ వచ్చింది. ఆ బస్సు 13వ తేదీ అర్ధరాత్రి 2.30 గంటలకు ఇక్కడి బస్సు స్టాండుకు చేరుకొంది. ఆ బస్సులో ఒంటరిగా కూర్చొని ఉన్న ఆ బాలికను చూసిన అయిదుగురు వ్యక్తులు ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. నిందితుల్లో ఇద్దర్ని పోలీసులు అరెస్టు చేశారు.

ముంబైలో మహిళా డాక్టర్పై దాడి

ముంబై, ఆగస్టు 18: ముంబైలోని సియోన్ ఆస్పత్రిలో రాత్రి విధుల్లో ఉన్న ఓ మహిళా డాక్టర్పై మద్యం మత్తులో ఉన్న రోగి, అతని బంధువులు దాడి చేశారు. శనివారం అర్ధరాత్రి 12.30 సమయంలో ముఖంపై గాయాలతో ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సకు వచ్చాడు. ఆయన వెంట 8మంది బంధువులు ఉన్నారు. తెల్లవారుజామున 3.30 సమయంలో డ్యూటీలో ఉన్న మహిళా రెసిడెంట్ డాక్టర్పై వీరు దుర్భాషలాడుతూ.. దాడి చేశారు. "సదరు మహిళా డాక్టర్ రోగి గాయాలను పరిశీలించేందుకు బ్యాండేజీని తొలగిస్తుండగా.. రోగి, అతని బంధువులు దుర్భాషలాడారు. రక్తపు బ్యాండేజీలను ఆమెపై విసిరి, దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న నర్సు వెంటనే సెక్యూరిటీని పిలిపించారు. భద్రతాసిబ్బంది వచ్చేలోపే రోగి, అతని బంధువులు అక్కడి నుంచి పారిపోయారు.

టీఎంసీలో చిచ్చు!

హత్యాచార ఘటన విషయంలో మమత సర్కార్పై తలోమాట

» కీలక నేత అభిషేక్ మూగనోము

» మమత ర్యాలీకి యువనేత గైర్హాజరు

» ప్రభుత్వంపై సొంత నేతల విమర్శలు



ట్రైనీ డాక్టర్పై హత్యాచారానికి నిరసనగా కోల్కతాలోని శ్యామ్ బజార్లో వైద్యుల భారీ ర్యాలీ

కోల్కతా, ఆగస్టు 18: పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)లో పరిస్థితి ఏమంత బాగున్నట్టుగా కనిపించడం లేదు. ఈ నెల 9న వెలుగు చూసిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన, అదేసమయంలో ఈ నెల 14న ఆసుపత్రిపై జరిగిన దాడి ఘటనపై సొంత సర్కారు వ్యవహరిస్తున్న తీరును టీఎంసీ నాయకులే విమర్శిస్తున్నారు. అదేవిధంగా ఈ వ్యవహారంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను మరికొందరు నాయకులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మూగనోము పాటించడంపైనా నాయకులు విస్తుబోతున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పార్టీ కీలక నాయకుడు కునాల్ ఘోష్.. తప్పులు సరిచేసుకోవాల్సిన అవసరం తమపై ఉందన్నారు. అభిషేక్ మూగనోము సరికాదని, ఆయన స్పందించాలని కునాల్ సూచించారు. రాష్ట్రంలో ఆందోళనల వెనుక కమ్యూనిస్టు, కాంగ్రెస్ నాయకుల కుట్ర ఉందని ఆరోపించారు.



అభిషేక్ మాటకు విలువలేదా?

హత్యాచార ఘటన తర్వాత ఆర్జీ కర్ ఆసుపత్రిపై ఈ నెల 14న జరిగిన దాడిపై అదే రాత్రి అభిషేక్ బెనర్జీ స్పందించారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా వదిలి పెట్టరాదని, వెంటనే అరెస్టు చేయాలని ఆయన ఎక్స్ వేదికగా కోల్కతా పోలీసు కమిషనర్ను కోరారు. విధ్వంసానికి బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టరాదని, బాధ్యులను 24గంటల్లోగా అరెస్టు చేయాలని చెప్పారు. అయితే, అభిషేక్ ఆశించింది ఏమీ జరగలేదని, అందుకే ఆయన మౌనంగా ఉన్నారని టీఎంసీలోని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అభిషేక్ బెనర్జీకి పార్టీలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నది మరికొందరి వాదన. ఈ ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో టీఎంసీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో సరిగా పనిచేయని నాయకులపై వేటు వేయాలని అభిషేక్ కోరారు. దీనిని పార్టీ అధిష్ఠానం సీరియస్గా పరిగణించలేదు. ఈ పరిణామాలతో.. తనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గుతోందన్న భావనలో బెనర్జీ ఉన్నారని పలువురు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. పాలనా పరంగా తప్పులు, సీనియర్ నేతల వైఖరి కారణంగానే అభిషేక్ మౌనంగా ఉన్నారని మరికొందరు నాయకులు అంతర్గత చర్చల్లో చెబుతుండడం గమనార్హం. ఇదిలావుంటే, హత్యాచార ఘటనపై అభిషేక్ మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనల్లో దోషులకు ఉరి శిక్ష విధించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని సూచించారు.

మమత రాజీనామా చేయాలి: బీజేపీ

"యువ వైద్యురాలిపై జరిగిన ఘోరంలో వైద్య కళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, కోల్కతా కమిషనర్ వినీత్ల పాత్ర ఉందని అధికార పార్టీ సీనియర్ నాయకులే విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో అధికార యంత్రాంగం చచ్చుబడిపోయింది. ఈ నేపథ్యంలో సీఎం మమత రాజీనామా చేయాలి" అని బీజేపీ నేత సుకాంతో ముజుందార్ ఎక్స్లో డిమాండ్ చేశారు.

సొంత సర్కారుపై తలోమాట

హత్యాచార ఘటనపై అధికార పార్టీ టీఎంసీలో నేతలు తలోమాట మాట్లాడడం రాజకీయంగా చర్చనీయాంశం అయింది. సీనియర్ నేత శంతను సేన్ మాట్లాడుతూ.. హత్యాచార ఘటన సీఎంకు తెలియజేయకుండా ఆర్జీకర్ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ తొక్కిపెట్టారని, దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. మరో నేత కునాల్ మాత్రం సర్కారుకు వ్యతిరేకంగా మాట్లాడారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఆధారాలు చెరిగిపోయేలా మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు చేపట్టరాదని వ్యాఖ్యానించారు. టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్రాయ్ వైఖరి పార్టీలో మరింత దుమారం రేపింది. ఈ నెల 14న మహిళలు చేపట్టిన ధర్నాలో ఆయన ఒంటరిగా పాల్గొనడంతోపాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

కోల్కతా హత్యాచారంపై సుప్రీంకోర్టు విచారణ

(మొదటి పేజీ తరువాయి)

విచారించనున్న కేసుల జాబితాలో ఇది కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. మరోవైపు, జూనియర్ డాక్టర్పై దారుణంగా లైంగికదాడికి పాల్పడి, హత్య చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్రాయ్కి ఆదివారం మానసిక పరీక్షలు జరిపారు. ఢిల్లీ నుంచి కోల్కతాకు వచ్చిన సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి చెందిన మానసిక విశ్లేషకులు ఈ పరీక్షలు నిర్వహించారు. కోల్కతా పోలీస్ విభాగంలో పౌర వలంటీర్గా 2019లో చేరిన సంజయ్రాయ్ ఇప్పటికి నాలుగుసార్లు పెళ్లిళ్లు చేసుకున్నాడని, అతడొక తిరుగుబోతు అని, బాక్సింగ్లో ప్రవేశం ఉందని వెల్లడైంది. తాజా ఘటన అనంతరం ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పదవి నుంచి వైదొలిగిన సందీప్ ఘోష్ను సీబీఐ అధికారులు ఆదివారం కూడా విచారించారు. ఆయన ఫోన్కాల్స్ వివరాలను పరిశీలిస్తున్నారు. హత్యాచారం ఘటన జరిగిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో సీబీఐ దర్యాప్తు బృందం త్రీడీ లేజర్ మ్యాపింగ్ నిర్వహించింది. కాగా, హత్యాచారానికి బలైన జూనియర్ డాక్టర్ పేరు వెల్లడిస్తూ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సినీ నటి రచనా బెనర్జీపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆమె ఆ వీడియోను తొలగించి క్షమాపణ చెప్పారు. ఇదిలా ఉండగా, కోల్కతా ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. శాంతిభద్రతల పరిస్థితులపై ప్రతీ రెండు గంటలకోసారి తమకు నివేదిక పంపించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రహోంశాఖ ఈ నెల 16న ఆదేశాలు జారీ చేసినట్లుగా తాజాగా వెల్లడైంది. ఈ మేరకు రాష్ట్రాల పోలీసు విభాగాలు కేంద్ర హోంశాఖకు నివేదికలు పంపుతున్నాయి.

లోకం తీరు



శ్రీరామ్స్ ఐఏఎస్కు రూ.3 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, ఆగస్టు 18: సివిల్ సర్వీసుల పరీక్షకు కోచింగ్ ఇచ్చే ఓ ఇన్స్టిట్యూట్కు కేంద్రం షాక్ ఇచ్చింది. తప్పుదారి పట్టించేలా ప్రకటన చేయడంతోపాటు వినియోగదారుల హక్కుల ఉల్లంఘనకు పాల్పడినందుకు కోచింగ్ ఇన్స్టిట్యూట్ శ్రీరామ్స్ ఐఏఎస్కు కేంద్ర వినియోగదారుల రక్షణ అథారిటీ(సీసీపీఏ) రూ.3లక్షల జరిమానా విధించినట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆదివారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామ్ 2022కు సంబంధించి తప్పుదారి పట్టించేలా ప్రకటన చేసినందుకు సీసీపీఏ ఈ చర్యకు ఉపక్రమించింది. శ్రీరామ్స్ ఐఏఎస్ తన ప్రకటనలో.. "యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామ్ 2022లో మా సంస్థ నుంచి 200కు పైగా ఎంపికయ్యారు. మేమే దేశంలో నంబర్ వన్ ప్రతిష్ఠాత్మక యూపీఎస్సీ/ఐఏఎస్ కోచింగ్ ఇన్స్టిట్యూట్" అని పేర్కొంది. కానీ, ఈ ఇన్స్టిట్యూట్ వివిధ రకాల కోర్సులను ప్రచారం చేసిందని, సివిల్స్ పరీక్షలో విజయవంతమైన అభ్యర్థులు ఎంచుకున్న కోర్సుకు సంబంధించిన సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టిందని సీసీపీఏ గుర్తించింది. తమ సంస్థ నుంచి సివిల్స్కు 200కు పైగా ఎంపికయ్యారని చెప్పినా అందులో 171 మంది అభ్యర్థుల వివరాలను మాత్రమే ఈ ఇన్స్టిట్యూట్ సమర్పించిందని తెలిపింది. వీరిలో 102 మంది ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ ప్రోగ్రామ్ తీసుకున్నారని, 55 మంది ఉచిత టెస్ట్ సిరీస్ తీసుకున్నారని వివరించింది. కేవలం 9 మంది మాత్రమే జనరల్ స్టడీస్ క్లాస్ రూమ్ కోర్సు చేశారని తెలిపింది. మరో ఐదుగురు ఉచిత కోచింగ్ను అందించడానికి సంబంధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, ఇన్స్టిట్యూట్తో చేసుకున్న ఎంవోయూ కింద జాయిన్ అయ్యారని తెలిపింది. కానీ, ఈ విషయాన్ని శ్రీరామ్స్ ఐఏఎస్ సంస్థ ప్రకటనలో ఎక్కడా వెల్లడించలేదని పేర్కొంది. కాగా, సివిల్స్లో ఎంపికైన అభ్యర్థుల ఫొటోలను అనేక కోచింగ్ ఇన్స్టిట్యూట్లు వినియోగిస్తూ విద్యార్థులను తప్పుదోవ పటిస్తున్నాయని సీసీపీఏపేర్కొంది.

నివాసానికే పరిమితమైన సిద్ధూ

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అవినీతి వివాదంలో ప్రాసిక్యూషన్కు గవర్నర్ అనుమతులు ఇవ్వడంతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఆదివారం ఆయన తన అధికారిక నివాసానికే పరిమితమయ్యారు. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం సోమవారం బళ్లారి, మంత్రాలయం సందర్శించాల్సి ఉండగా, అనివార్య కారణాలతో రద్దు చేసుకున్నట్టు సీఎం ఆఫీసు అదనపు కార్యదర్శి చిరంజీవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు విధానసౌధలో కాంగ్రెస్ లెజిస్లేచర్ సమావేశానికి సభ్యులను సీఎం ఆహ్వానించారు.

డెంగీతో కేంద్రమంత్రి సతీమణి మృతి

భువనేశ్వర్, ఆగస్టు 18: డెంగీతో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జ్యువల్ ఓరం సతీమణి ఝింగియా ఓరం(58) చనిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. భువనేశ్వర్లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె శనివారం రాత్రి మృతి చెందారు. అదే ఆసుపత్రిలో కేంద్రమంత్రి జ్యువల్ ఓరం కూడా డెంగీతో చికిత్స పొందుతున్నారు. ఒడిశా సీఎం మోహన్ చరణ్ ఝింగియా మృతికి సంతాపం తెలిపారు.

కోస్ట్గార్డ్ డీజీ రాకేష్ పాల్ హఠాన్మరణం



చెన్నై, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేష్ పాల్(58) గుండెపోటుతో మరణించారు. ఆదివారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్తో పాటు కోస్ట్గార్డ్కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అనంతరం కొద్దిసేపటికే ఆయన మరణించారు. విషయం తెలియడంతో కేంద్రమంత్రి రాజ్నాథ్ సింగ్ వెంటనే ఆస్పత్రికి వెళ్లి రాకేష్ పాల్ మృతదేహానికి నివాళులర్పించారు.

బీజేపీలోకి చంపయీ సోరెన్!

పార్టీ మారనున్న ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి!

» ఆరుగురు జేఎంఎం ఎమ్మెల్యేలతో ఢిల్లీకి

» 'ఎక్స్' ఖాతా నుంచి పార్టీ పేరు తొలగింపు



ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న చంపయీ

న్యూఢిల్లీ, రాంచీ, ఆగస్టు 18: త్వరలో ఎన్నికలు జరగనున్న ఝార్ఖండ్లో అనూహ్య పరిణామం..! ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కీలక నాయకుడు చంపయీ సోరెన్ బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జల వనరుల శాఖ మంత్రిగా ఉన్న చంపయీ.. ఆదివారం తెల్లవారుజామున పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలతో కలిసి హఠాత్తుగా ఢిల్లీ వెళ్లడం ఊహాగానాలకు కారణమైంది. కుమార్తెను కలిసేందుకే దేశ రాజధానికి వచ్చినట్లు ఆయన చెప్పారు. అయితే, ఈలోగానే తన 'ఎక్స్' ఖాతా నుంచి పార్టీ పేరును తొలగించారు. సాయంత్రానికి సుదీర్ఘ లేఖ విడుదల చేశారు. జేఎంఎంలో తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నానని, వాటిని తట్టుకోలేకే ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకోవడం, సొంతంగా పార్టీని స్థాపించడం, తోడుగా నిలిచేవారితో కలిసి ప్రయాణించడం అనే మార్గాలు తన ముందు ఉన్నాయని వివరించారు. కాగా, జేఎంఎం అధిష్ఠానానికి నమ్మకస్తుడయిన చంపయీ ఫిబ్రవరి 2 నుంచి జూలై 3 వరకు సీఎంగా వ్యవహరించారు. భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్ను ఈడీ అరెస్టు చేయడంతో సీఎంగా చంపయీకి అవకాశం దక్కింది. హేమంత్కు బెయిల్ రావడంతో వైదొలగాల్సి వచ్చింది. అప్పటినుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. శనివారం రాత్రి కోల్కతాలో బెంగాల్ బీజేపీ నాయకుడు సువేందుతో చంపయీ సమావేశమయ్యారని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో సంప్రదింపుల్లో ఉన్నారని సమాచారం.

ఎమ్మెల్యేలకు డబ్బుతో బీజేపీ గాలం..

చంపయీ బీజేపీలోకి వెళ్తున్నారన్న కథనాల నేపథ్యంలో హేమంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. డబ్బుతో ఎమ్మెల్యేలకు గాలం వేసేందుకూ బీజేపీ వెనుకాడదని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల్లోనూ చీలిక తెచ్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు.

కాంగ్రెస్లో భారీ మార్పులు!

మీడియా ఇన్చార్జిగా జైరాం రమేశ్ అవుట్!


» కేరళ పీసీసీ చీఫ్గా వెళ్లనున్న వేణుగోపాల్?



న్యూఢిల్లీ, ఆగస్టు 18: కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా భారీ మార్పులు తలపెట్టినట్లు తెలిసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న జైరాం రమేశ్ (మీడియా వ్యవహారాల ఇన్చార్జి), కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు)లను మార్చబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా జైరాం రమేశ్పై రాహుల్గాంధీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. బీజేపీ విమర్శలను అనుకున్న రీతిలో ఆయన తిప్పికొట్టలేకపోతున్నారని, హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇది ప్రతికూల ప్రభావం చూపించవచ్చని సీనియర్ నాయకులు చెప్పారు. దీంతో ఆ పదవి నుంచి వైదొలగాలని జైరాంను రాహుల్ కోరుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే తనను ఈశాన్య భారత వ్యవహారాల ఇన్చార్జిగా నియమించాలని జైరాం విజ్ఞప్తి చేశారని పేర్కొన్నాయి. రాహుల్కు అత్యంత సన్నిహితుడైన వేణుగోపాల్ను మార్చాలనుకోవడమే పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో.. నాడు ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న అశోక్ గహ్లోత్ సీఎంగా వెళ్లారు. దరిమిలా ఆ పదవి చేపట్టిన వేణుగోపాల్.. ఇప్పటికీ కొనసాగుతున్నారు. కేరళ పీసీసీ అధ్యక్షుడిగా వెళ్లాలని రాహుల్గాంధీయే ఆయన్ను కోరారని అంటున్నారు. ఇటీవలి లోక్సభ ఎన్నికల్లో కేరళలో కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ ఘనవిజయం సాధించింది. 20 స్థానాల్లో 18 గెలిచింది. 2026లో ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. సీఎం పదవికి రేసులో తాను లేనని వేణుగోపాల్ చెబుతున్నప్పటికీ.. ఆయనకు ఆ ఆకాంక్ష ఉందని ఓ సీనియర్ నేత తెలిపారు. పీసీసీ పగ్గాలు చేపడితేనే టికెట్ల పంపిణీ తన చేతుల్లో ఉంటుందని.. యూడీఎఫ్ విజయం సాధిస్తే తన వర్గం ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉంటే తనకే సీఎం పీఠం దక్కుతుందని ఆయన భావిస్తున్నారని.. అందుకే రాష్ట్ర రాజకీయాలకు వెళ్లాలనుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా.. వేణుగోపాల్ స్థానంలో సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవి రేసులో రాజస్థాన్, ఛత్తీస్గఢ్ మాజీ సీఎంలు అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘేల్ ఉన్నట్లు తెలుస్తోంది. సోనియాకు అత్యంత విశ్వాసపాత్రుడిగా మెలిగిన గహ్లోత్.. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల సమయంలో అధిష్ఠానాన్ని ధిక్కరించారు. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి కారణమయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు మళ్లీ ఇంతటి కీలక పదవిని రాహుల్ అప్పగిస్తారా అనేది అనుమానమేనని పార్టీ వర్గాలు అంటున్నాయి. బఘేల్ ప్రియాంకకు సన్నిహితుడు. ఆయన్ను సంస్థాగత ఇన్చార్జిగా నియమిస్తే పార్టీలో ప్రియాంక పాత్ర పెరుగుతుందని.. రాహుల్ సన్నిహితులు తగ్గిపోతారని కొందరి వాదన. అయితే, మార్పులపై రాహుల్దే తుది నిర్ణయమని ఏఐసీసీ వర్గాలు స్పష్టంచేశాయి.



కమల కంటే నేనే అందంగా ఉంటా..



పెన్సిల్వేనియా, ఆగస్టు 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్పై మరోసారి నోరుపారేసుకున్నారు. పెన్సిల్వేనియాలోని విల్కేస్- బారిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ట్రంప్ మాట్లాడుతూ, కమలా హారిస్ నవ్వు భయంకరంగా ఉంటుందని, ఆమె కంటే తానే అందంగా ఉంటానని వ్యాఖ్యానించారు. టైమ్ మ్యాగజైన్ కవర్ పేజీపై కమలా హారిస్ ఫొటోను ముద్రించడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం! సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో బ్లింకెన్ భేటీ కానున్నారు.

ఉక్రెయిన్ అణు కేంద్రానికి దగ్గర్లో డ్రోన్ దాడి

కివ్, ఆగస్టు 18: ఐరోపాలోనే అతిపెద్దదైన జపోరిజియా అణువిద్యుత్ కేంద్రం కూలింగ్ స్ప్రింక్లర్స్కు సమీపంలో, 750 కిలోవాట్ల పవర్ లైన్కు కేవలం వంద మీటర్ల దూరంలో డ్రోన్ దాడి జరిగింది. దీనిపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ఆందోళన వ్యక్తం చేసింది. డ్రోన్ దాడిలో ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదని, అలాగే, అణు కేంద్రానికి చెందిన పరికరాలపైనా ప్రభావమేమీ లేదని ఐఏఈఏ డైరెక్టర్ గ్రోసి తెలిపారు.

'లేటరల్ ఎంట్రీ'తో యువతకు అన్యాయం

» ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నియామకం

» రిజర్వేషన్ల అంతానికి మోదీ హామీ: రాహుల్



న్యూఢిల్లీ, ఆగస్టు 18: వివిధ మంత్రిత్వ శాఖల్లో పోస్టులను లేటరల్ ఎంట్రీ విధానంలో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. యూపీఎస్సీకి బదులు ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తూ రాజ్యాంగంపై ప్రధాని మోదీ దాడి చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బహిరంగంగానే లాక్కుంటున్నారని ఆయన ఆదివారం 'ఎక్స్'లో ఆరోపించారు. లేటరల్ ఎంట్రీలో ప్రభుత్వ ఉద్యోగులను నియమించుకోవడం జాతి వ్యతిరేక చర్యని ధ్వజమెత్తారు. 'అణగారిన వర్గాలకు ఉన్నత స్థానాల్లో ప్రాధాన్యం దక్కడం లేదని ఎప్పటినుంచో చెబుతున్నాం. దాన్ని మెరుగుపరచడానికి బదులు లేటరల్ ఎంట్రీ పేరుతో వారిని ఉన్నత పదవులకు మరింత దూరం చేస్తున్నారు' అని రాహుల్ పేర్కొన్నారు. ఐఏఎస్ల ప్రైవేటీకరణ అనేది రిజర్వేషన్ల రద్దుకు మోదీ హామీ అని ఆయన దుయ్యబట్టారు. లేటరల్ ఎంట్రీ విధానం అమలును సమాజ్వాదీ పార్టీ, బీఎస్పీ తప్పుబట్టాయి. బీజేపీ చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ట్వీట్ చేశారు. దీనిపై అక్టోబరు 2నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వారి కోటా ప్రకారం నియామకాలు చేపట్టకపోతే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ విధానం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని, ఇది రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వివిధ శాఖల్లోని జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల వంటి కీలక పోస్టుల్లో 45 మందిని లేటరల్ ఎంట్రీ విధానంలో నియామకానికి యూపీఎస్సీ శనివారం దరఖాస్తులు ఆహ్వానించింది.

అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ

» ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ప్రతిపక్షాల దుష్ప్రచారం

» ఇప్పటిదాకా 22,37,848 మంది రైతులకు

రూ.17,933.19 కోట్లు మాఫీ : తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి వచ్చే సమాచారానికి అనుగుణంగా ప్రతి ఖాతాదారుని అర్హతను బట్టి రుణమాఫీ చేసే బాధ్యత ప్రభుత్వానిదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇప్పటిదాకా కుటుంబ నిర్ధారణ జరిగిన రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. రూ.2 లక్షల లోపు మిగిలి ఉన్న రైతులకు కుటుంబ నిర్ధారణ చేసి వారికీ రుణమాఫీ చేస్తామని తెలిపారు. రూ.2 లక్షలకు మించి అప్పు ఉన్న రైతులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అదనంగా ఉన్న మొత్తాన్ని చెల్లించిన తర్వాత అర్హతను బట్టి వారికి రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 22,37,848 మంది రైతులకు రూ.17,933.19 కోట్లు మాఫీ చేసినట్లు తుమ్మల వెల్లడించారు. 22 వేల ఖాతాలకు సంబంధించిన నిధులు రిటర్న్ వచ్చాయని, ఇందులో 8 వేల ఖాతాలు క్లియర్ చేసి రూ.44 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. పటిష్టమైన ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసి అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ వర్తింపజేస్తున్నట్లు వివరించారు. బ్యాంకర్ల నుంచి వచ్చిన డేటా తప్పుగా ఉంటే.. రైతుల నుంచి సరైన వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. రుణమాఫీ పొందిన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించామని చెప్పారు. రుణమాఫీ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నప్పటికీ ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేయటం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు కేటాయించి పంద్రాగస్టు నాటికి రూ.18 వేల కోట్లు మాఫీ చేసిన ప్రభుత్వంపై విమర్శలు చేయటం సరికాదన్న తుమ్మల.. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో లక్ష రూపాయలు మాఫీ చేసేందుకు ఆపసోపాలు పడ్డారని, బీజేపీ తాము అధికారంలో ఉన్న ఏ ఒక్క రాష్ట్రంలోనూ ఇంతవరకు రుణమాఫీ చేయలేదని చెప్పారు. ఇలాంటి పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తమ రాజకీయ మనుగడను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని తెలిపారు.

మెగా టెక్స్‌టైల్ పార్కుతో పరకాల అభివృద్ధి

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులకు న్యాయం చేస్తాం: పొంగులేటి



పరకాల, ఆగస్టు 18: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో రూ.5కోట్లతో ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణ పనులు, రూ.11.74కోట్లతో అమృత్ 2.0 పథకానికి సంబంధించిన పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మునిసిపాలిటీ కార్యాలయంలో పరకాలకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో ఈ ప్రాంత అభివృద్ధి రూపురేఖలు మారనున్నట్లు మంత్రి తెలిపారు. ఇటీవల కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి పెద్ద కంపెనీలతో చర్చించారని, ఆయా సంస్థల ప్రతినిధులు కొద్ది రోజుల్లో ఇక్కడ పర్యటిస్తారని చెప్పారు. వరంగల్, హనుమకొండ మీదుగా వెళ్తున్న జాతీయ రహదారికి భూ సేకరణ జరుగుతోందని పేర్కొన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులకు న్యాయబద్ధంగా పూర్తి పరిహారం అందిస్తామని తెలిపారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు కోల్పోయిన వారికి ఇళ్లను కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, వెంటనే వారి పేర్ల జాబితాను అధికారులు సిద్ధం చేయాలన్నారు. సెప్టెంబరు మూడోవారంలో మెగా జాబ్‌మేళా నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

శ్రీలంక మంత్రితో శ్రీధర్ బాబు భేటీ

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పర్యటనలో భాగంగా శ్రీలంక వాణిజ్య, పర్యావరణ శాఖల సహాయమంత్రి సతాశివన్ వియలందేరన్ ఆదివారం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణ నుంచి శ్రీలంకకు ఎగుమతి చేయదగ్గ ఉత్పత్తులపై చర్చించారు. రాష్ట్రం నుంచి అనేక దేశాలకు ఇక్కడి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని, పక్క దేశం శ్రీలంకపైనా తమ ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

మహిళా కమిషన్ వెబ్‌సైట్‌లో మార్పు

» చైర్‌పర్సన్ పేరు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మహిళా కమిషన్ వెబ్‌సైట్‌లో ఎట్టకేలకు మార్పు జరిగింది. కమిషన్ చైర్‌పర్సన్ పేరును పొందుపర్చారు. ఈమేరకు కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద ఉన్నారంటూ తెలిపేలా వెబ్‌సైట్‌లో మార్పులు చేశారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను ప్రభుత్వం నియమించి ఆగస్టు 17నాటికి నెల రోజులవుతున్నా.. కమిషన్ వెబ్‌సైట్‌లో మాత్రం ఆ పోస్టు ఇంకా ఖాళీగానే ఉందంటూ చూపించడం చర్చనీయాంశమైంది. దీంతో "మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పోస్టు ఖాళీ" శీర్షికన ఆగస్టు 17న ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. స్పందించిన కమిషన్ వెంటనే వెబ్‌సైట్‌లో దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

ఉక్కపోతలో వాన పలకరింత

» రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు.. మెదక్‌లో 6.7 సెం.మీ.

» ఆదిలాబాద్, గజ్వేల్, భైంసాలలో దంచికొట్టిన వాన

» వేర్వేరుచోట్ల పిడుగుపాటుకు రైతు, గొర్రెల కాపరి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఇంట్లో ఉన్నా.. బయటకు వెళ్లినా తీవ్రమైన ఉక్కపోత నడుమ వాన పలకరించింది. రాష్ట్రంలో ఆదివారం పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా మెదక్‌లో గంటపాటు వాన పడింది. 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదే జిల్లాలోని పాతూర్‌లో 4.4 సెం.మీ., నాగాపూర్‌లో 3.9 సెం.మీ., సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో 6.3 సెం.మీ. వర్షం కురిసింది. ఈ జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో 4 సెం.మీ. ఆపైన వర్షం పడింది. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, సిర్పూర్ (టి)లో ప్రధాన రహదారుల్లో నీరు నిలిచింది. హైదరాబాద్‌లో హయత్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వరకు భారీగా వర్ష పడింది. నిర్మల్ జిల్లా మామడలో 6.3 సెం.మీ. వానపడింది. ఏకధాటిగా రెండు గంటల పాటు వర్షం పడడంతో భైంసా తడిసి ముద్దయింది. కాగా, ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలం ఎల్లూరులో వరినాట్లు వేస్తున్న రైతు సిడాం శ్రీనివాస్ (46)పై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లగొండ జిల్లా దేవరకొండలో చెట్టు కింద నిల్చున్న గొర్రెల కాపరి సతీష్ (42) పిడుగుపడి ప్రాణాలు కోల్పోయాడు.

20వ రోజూ సాగర్‌కు వరద

నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 20వ రోజూ వరద కొనసాగింది. ఆదివారం 2 గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలానికి 91,592 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. సాగర్‌కు 68,721 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో విడిల్ కృష్ణా, ఘట్ ప్రభ, మలప్రభ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదికి స్వల్పంగా వరద మొదలైంది. ఈ నీరు నేరుగా నారాయణపూర్ జలాశయం చేరుతోంది. ఆది, సోమవారాల్లో ఎగువ కృష్ణా, ఎగువ భీమా నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలకు అవకాశం ఉండడంతో ఆల్మట్టికి కూడా వరద పెరగవచ్చని తెలుస్తోంది. ఆల్మట్టి పూర్తి సామర్థ్యం 129 టీఎంసీలు కాగా 128.19 టీఎంసీలకు చేరింది. జూరాలకు 50,500 ఇన్‌ఫ్లో ఉండగా జల విద్యుదుత్పత్తి ద్వారా 40,157 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యాంకు 28,041 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10,695 క్యూసెక్కులు వదులుతున్నారు. 19వ గేటు మరమ్మతులు పూర్తి కావడంతో నీటి నిల్వలు పెంచుకునేందుకు గేట్లను మూసివేశారు.

రాజకీయాల్లో క్షత్రియులకు అవకాశం కల్పిస్తాం

» క్షత్రియ సేవా సమితి సభలో సీఎం రేవంత్

» ప్రభాస్ సినిమాపై పొగడ్తల వర్షం

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో క్షత్రియ సామాజికవర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని, నగరంలో క్షత్రియ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని, ప్రసంగించారు. 1960లలోనే క్షత్రియులు ఆంధ్రప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వచ్చి.. ద్రాక్ష తోటలు, పౌల్ట్రీ వంటి వ్యాపారాలు నిర్వహించారని.. శ్రమ, అకుంఠిత దీక్షతో ఉన్నతస్థాయికి ఎదిగారని రేవంత్‌రెడ్డి వివరించారు. కష్టపడే గుణం వల్ల క్షత్రియులు ఎక్కడైనా విజయవంతమవుతారన్నారు.



క్షత్రియ సేవాసమితి సభలో అల్లూరికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

"క్షత్రియులకు రాజకీయాల్లో తగిన ప్రోత్సాహం అందిస్తాం. మీరే తగిన పేర్లు ఇస్తే.. వారికి పార్టీ పదవులు ఇచ్చి.. కార్పొరేటర్, ఎమ్మెల్యే ఎన్నికల్లో అవకాశం కల్పిస్తాం"అని క్షత్రియ సేవాసమితిని కోరారు. ఆంధ్రాలో అల్లూరి సీతారామరాజు, తెలంగాణలో కొమరం భీం పోరాట యోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని.. ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్ శివారులో ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి చేయబోతున్నామని, దానిలో కూడా రాజులు భాగస్వాములు కావాలన్నారు. పెట్టుబడులతో ముందుకొస్తే అన్నివిధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియ కమ్యూనిటీ భాగస్వామ్యం ఉందన్నారు. కర్ణాటకలో రాజకీయ సమీకరణలు, పరిస్థితుల ప్రభావం వల్ల బోసురాజుకు పోటీచేసే అవకాశం రాలేదన్నారు. మంత్రివర్గం ఏర్పాటు సమయంలో మంత్రి పదవి కేటాయించాలని స్వయంగా రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి.. రాజులు క్రమశిక్షణతో పనిచేస్తారనే అభిప్రాయం అధిష్ఠానంలో ఉందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా శ్రీనివాస్‌రాజును నియమించడం రాజులపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి ప్రతీక అన్నారు. "క్షత్రియభవన్ స్థలాన్ని మేము అందిస్తాం, భవనాన్ని మీరు నిర్మించండి మళ్లీ జరిగే సమావేశం క్షత్రియ భవన్‌లో జరుపుకుందాం" అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు నాగరాజు, నాని పాల్గొన్నారు.

ప్రభాస్ సినిమాపై..

విజయానికి, విశ్వాసానికి క్షత్రియులు మారుపేరని పేర్కొన్న సీఎం రేవంత్.. ఇదే సామాజిక వర్గానికి చెందిన ప్రభాస్.. తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ప్రభాస్ కాకుండా వేరే నటుడిని బాహుబలి స్థానంలో ఊహించుకోలేమన్నారు. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో బోసురాజు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈసందర్భంగా సినీనటుడు కృష్ణంరాజుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

విభజనలో చిక్కులు





సీఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఆమోదించినందుకు పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ నుంచి రాజ్యసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలకు ఆయన్ను పరిచయం చేసేందుకు నానక్‌రామ్‌గూడలోని ఓ హోటల్‌లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీని పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి పరిచయం చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ చేసిన తీర్మానాన్ని సీఎల్పీ ఆమోదించింది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు పెద్ద మనసుతో క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తలాగా వ్యవహరించారని ప్రశంసించారు. ఇక వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభ త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ ఈ నెల 20న చేపట్టాలని భావించినా.. వీలు కాలేదని తెలిపారు. రైతు కృతజ్ఞత సభ, రాజీవ్ విగ్రహావిష్కరణపై ఢిల్లీ పెద్దలతో మాట్లాడి త్వరలోనే తేదీలను వెల్లడిస్తామని చెప్పారు. సింఘ్వీ మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎంపిక కానుండడాన్ని తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి, మహిళా సాధికారతకు తెలంగాణ ప్రాంతం ప్రతీక అని కొనియాడారు. దేశంలో కక్ష సాధింపు రాజకీయాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణతో పాటు అనేక రాష్ట్రాల్లో ఈ పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ మరింత క్రియాశీలంగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా పని చేశానని, విద్య, వైద్యంతో పాటు అనేక సమస్యలపై పెద్దల సభలో గళం వినిపించానని తెలిపారు.

సీఎం రేవంత్‌ను కలిసిన సింఘ్వీ

రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు హైదరాబాద్‌కు సతీసమేతంగా వచ్చిన అభిషేక్ మను సింఘ్వీ.. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి, ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింఘ్వీని సీఎం రేవంత్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. అంతకుముందు ఆదివారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సింఘ్వీకి ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి సింఘ్వీ నేరుగా కేకే ఇంటికి వెళ్లి, ఆయన్ను కలిశారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సింఘ్వీ దంపతులకు కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి తీసుకొచ్చిన ప్రసాదాన్ని అందజేశారు. ఆ తర్వాత ప్రజాభవన్‌కు వెళ్లిన సింఘ్వీ డిప్యూటీ సీఎం భట్టితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కాగా, రాజ్యసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సోమవారం ఉదయం 11 గంటలకు అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేయనున్నారు. సింఘ్వీ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ సీఎల్పీ సమావేశంలోనే పలువురు ఎమ్మెల్యేల సంతకాల సేకరణను కూడా పూర్తి చేశారు. ఈ సీటుకు పోటీ చేసి గెలిచేంత సంఖ్యాబలం శాసనసభలో ఇతర ఏ పార్టీకీ లేదు. కాబట్టి సింఘ్వీ ఎన్నిక లాంఛనమే కానుంది.



గవర్నర్‌కు రాఖీ కడుతున్న బీజేపీ నాయకురాలు శిల్పారెడ్డి

రక్షాబంధన్‌తో సురక్షిత భారత్

» రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రామంతాపూర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్‌తో సురక్షిత భారత్ సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉప్పల్ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన రాఖీ పండుగ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. భారత సంస్కృతి, సంప్రదాయాలు విలక్షణమైనవని, రక్షా బంధన్ ప్రేమ, అప్యాయత, అనురాగాలు పెంపొందిస్తుందని పేర్కొన్నారు. 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' మన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఆయనకు రాఖీలు కట్టగా... వారికి గవర్నర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ... రక్షా బంధన్ దేశానికి రక్షణనిచ్చి సురక్షిత భారత్‌గా మారుస్తుందన్నారు. భారతదేశం నాగరికత విశిష్టమైనదని, 140 కోట్ల ప్రజలు ప్రేమ, సహనంతో జీవనం సాగిస్తున్నారన్నారు.

మహిళలకు రాఖీ శుభాకాంక్షలు: సీఎం

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తుచేశారు. మహిళలకు మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి సంక్షేమ పథకాలతో పాటు స్వయం సహాయక సంఘాలకు చేయూతనిస్తుందని, వారి భద్రత విషయంలో సైతం తగిన చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అక్కా, చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు.

3 విడతల్లో 40% మందికే మాఫీ!

» షరతుల్లేకుండా రుణమాఫీ చేయండి

» ఖర్గే, రాహుల్‌కు కేటీఆర్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేసి, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేతలను డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీకి ఆదివారం లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల దగాపడిన లక్షలాది మంది తెలంగాణ రైతుల తరపున లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబరు 9న ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి 8 నెలలు ఊరించి.. మూడు విడతలుగా మాఫీ చేస్తూ రైతులను వంచించారని ఆరోపించారు. మూడు విడతల్లోనూ కేవలం 40 శాతం మందికి మాఫీ చేసి, మిగతా రైతులను ఉసూరుమనిపించారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 36 లక్షల మందికి రూ.లక్షలోపు రుణమాఫీకి రూ.17వేల ఖర్చయిందన్న కేటీఆర్.. రూ.2 లక్షల రుణమాఫీ అని ఘనంగా ప్రకటించి కేవలం 22 లక్షల మందికి రూ.17,900 కోట్లు మాఫీ చేసి, సంపూర్ణమని సీఎం ప్రకటించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్క ప్రకారం రూ.2లక్షల రుణమాఫీకి రూ.49,500కోట్లు అంచనా వేయగా.. దాన్ని రూ.31వేల కోట్లకు కుదించారని, చివరికి రూ.17,933 కోట్లతో మమ అనిపించారని ఆరోపించారు. పలు జిల్లాల్లో రుణమాఫీ కాని అన్నదాతలు రోడ్డెక్కారని, మంచిర్యాలలో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి చిత్తశుద్ధి ఉంటే.. ఇక్కడి సర్కారు వైఖరిని మార్చి, ఎలాంటి షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కేటీఆర్ లేఖలో డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు 1వ తేదీన జీతాలివ్వడం అబద్ధం

ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం పెద్ద అబద్ధమని, వారి వైఫల్యానికి వసీం ఆత్మహత్యే ఉదాహరణ అని కేటీఆర్ అన్నారు. సూర్యాపేట జిల్లా దవాఖానాలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వసీం.. కుటుంబం గడవక ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ మరణానికి కారణమెవరని కేటీఆర్ ఆదివారం ఎక్స్‌లో ప్రశ్నించారు.

ఎవరు రాజీనామా చేయాలి?

» రుణమాఫీ పూర్తయితే రైతులు

ఆందోళనలెందుకు చేస్తున్నారు..?: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే రుణమాఫీ కాలేదని అంటున్నారు. అలాంటప్పుడు ఎవరు రాజీనామా చేయాలో..? ఎవరు ఏట్లో దూకి చావాలో..? అమరవీరుల స్థూపం వద్ద ఎవరి ముక్కు భూమికి రాయాలో..? సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలి" అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రుణమాఫీ సంపూర్ణంగా కాలేదని కాంగ్రెస్ నేతలు, కోదండరెడ్డి, కోదండరాం రెడ్డి, ఆదిశ్రీనివాస్ ఒప్పుకున్న విషయాన్నే తాను చెప్పానని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. రుణమాఫీ పాక్షికంగా జరిగిందని, రూ.31వేల కోట్లని చెప్పి.. రూ.17వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని అంటే ఎందుకు రంకెలేస్తున్నారని ప్రశ్నించారు. రుణమాఫీ పూర్తయి ఉంటే రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి నిరసనలు, సీఎం దిష్టిబొమ్మల దహనాలు ఎందుకు చేస్తున్నారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా రుణమాఫీ ప్రక్రియను తూతూ మంత్రంగా కాకుండా సమగ్రంగా పూర్తి చేయాలని, రైతులందరికీ న్యాయం చేయాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని కోరారు.

రుణమాఫీపై శ్వేతపత్రం ఇవ్వాలి

హామీల అమలుపై చర్చను పక్కదోవ పట్టించేందుకే పార్టీల విలీనం డ్రామాలు

బీఆర్ఎస్ కాలం చెల్లిన పార్టీ: సంజయ్

రాష్ట్ర ఇన్‌చార్జిగా ఎవర్నీ నియమించలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సిరిసిల్ల/హైదరాబాద్/సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎంత వరకు రుణమాఫీ చేశారు..? ఇంకెంత మందికి పథకం అందాల్సి ఉంది..? అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. రుణమాఫీ అమలుకాక రైతులు కాంగ్రెస్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నా.. సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. రుణమాఫీ సహా ఆరు గ్యారెంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి విలీన డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. సిరిసిల్లలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ మహా చండీ యాగంలో ఆదివారం సంజయ్ పాల్గొన్నారు. అదేవిధంగా హైదరాబాద్ కోఠిలోని యంగ్ మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటీ భవన ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులందరికీ రూ.40 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి.. బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించి.. రూ.17వేల కోట్లు మాత్రమే మాఫీ చేస్తారా..? అని సర్కారును ప్రశ్నించారు. రైతు భరోసా, బోనస్, రుణమాఫీ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అన్నదాతలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని కోరారు. బీఆర్ఎస్ కాలం చెల్లిన పార్టీ అని.. ఆ పార్టీ ఎమ్మెల్యేల అవసరం కాంగ్రెస్‌కే ఉందన్నారు. అవినీతి పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన కర్మ బీజేపీకి లేదని సంజయ్ అన్నారు. కాగా, పాత పద్ధతిలోనే గురుకుల ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని బండి సంజయ్.. సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గతంలో డిసెండింగ్ ఆర్డర్ విధానంలో నియామక ప్రక్రియ చేపట్టి.. రిలింక్విష్‌మెంట్ విధానంలో ఖాళీలు ఏర్పడకుండా మెరిట్ అభ్యర్థులకు అవకాశం ఇస్తూ ఉద్యోగాలను భర్తీ చేసిన విధానాన్ని ఇప్పుడు కూడా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వండి: లక్ష్మణ్

కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరుడు పాపన్నగౌడ్ అని లక్ష్మణ్ అన్నారు.

పాటిల్‌ను నియమించలేదు: కిషన్‌రెడ్డి



బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా ఎవరినీ నియమించలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా అభయ్ పాటిల్‌ను నియమించినట్లు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై కిషన్‌రెడ్డి స్పందించారు. అభయ్‌పాటిల్‌ను పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జ్‌గా మాత్రమే కేంద్ర పార్టీ నియమించిందని ఒక ప్రకటనలో వివరించారు. కాగా, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ భేటీ అయ్యారు. ఇది మర్యాదపూర్వక భేటీయే అని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఆదివారం రాజ్‌భవన్‌లో ఈ సమావేశం జరిగింది.

మేమూ మహిళా కమిషన్‌ను కలుస్తాం

2014-2022 మధ్య మహిళలపై నేరాలను నివేదిస్తాం

కేటీఆర్‌కు మంత్రి సీతక్క కౌంటర్



హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్‌కు రాజకీయ వేడి తగులుతోంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల పట్ల అభ్యంతరకరంగా, వారిని కించపరిచే విధంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడారని, ఆ విషయం మహిళా కమిషన్ దృష్టికి వెళ్లడంతో.. సుమోటో స్వీకరించి, ఆగస్టు 24న కమిషన్ ఎదుట హాజరుకావాలని తెలుపుతూ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే.. ఆ నోటీసుపై కేటీఆర్ స్పందిస్తూ 24న కమిషన్ ఎదుట హాజరవ్వడంతోపాటు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళలపై జరిగిన దాడులు, విద్యార్థుల ఆత్మహత్యల ఘటనల వివరాలను కమిషన్‌కు అందజేస్తానని శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో అన్నారు. దీనిపై మంత్రి సీతక్క ఆదివారం తీవ్రంగా స్పందించారు. తాము కూడా మహిళా కమిషన్‌కు కలుస్తామని, బీఆర్ఎస్ హయాంలో.. 2014 నుంచి 2022 వరకు జాతీయ నేరాల నమోదు విభాగం(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం మహిళలపై జరిగిన దాడులు, నేరాలకు సంబంధించిన నివేదికను కమిషన్‌కు సమర్పిస్తామని చెప్పారు. కేటీఆర్ కూడా వారి హయాంలో మహిళలపై జరిగిన దాడుల వివరాలతో కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఆయన దగ్గర వివరాలు లేకపోతే.. తన దగ్గర కేంద్ర హోంమంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్‌సీఆర్‌బీ నివేదిక ఉందని, దాన్ని కేటీఆర్‌కు ఇస్తానంటూ కౌంటర్ ఇచ్చారు. అదే సమయంలో మంత్రి సీతక్క ఎన్‌సీఆర్‌బీ నివేదిక వివరాలను వెల్లడించారు. దాని ప్రకారం రాష్ట్రంలో 2014 నుంచి 2022 వరకు 1,57,610 కేసులు నమోదయ్యాయి.

మహిళలపై జరిగిన నేరాలు ఇలా..

సంవత్సరం	కేసులు
2014	14,147
2015	15,425
2016	15,374
2017	17,521
2018	16,027
2019	18,394
2020	17,791
2021	20,865
2022	22,066

ఆర్ఆర్ఆర్.. అవార్డ్ పాస్!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చింది. కొత్త సర్కారు ఆర్ఆర్ఆర్‌ను ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా భావిస్తూ సూపర్ గేమ్ చేంజర్‌గా అభివర్ణించింది. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్ఏఐ కూడా పనులను త్వరితగతిన మొదలుపెట్టేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే ఉత్తర భాగం మార్గం కోసం సేకరించిన భూములకు చెల్లించాల్సిన పరిహారం అంశంపై దృష్టి సారించింది. జాతీయ రహదారులకు సేకరించే భూముల విషయంలో మానవీయ కోణంతో వ్యవహరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం రేవంత్ నిర్దేశించారు. తరతరాలుగా భూమినే నమ్ముకున్న రైతులకు అన్యాయం జరగనీయొద్దని, నిబంధనలకు అనుగుణంగా ఎంత ఎక్కువ ఇవ్వగలిగితే అంత దక్కేలా చూడాలన్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు రిజిస్ట్రేషన్ విలువలు, మార్కెట్‌లో భూముల విలువల వివరాలను సేకరించనున్నారు. మూడేళ్లలో ఆ ప్రాంతంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ల ధరలను పరిగణనలోకి తీసుకుని అత్యధిక ధరను గుర్తించనున్నారు. గ్రామం, మండలం, జిల్లా, అర్బన్, రూరల్ వారీగా విభజించి, ఏ ప్రాంతంలో ఎంత చెల్లించాలన్న దానిని ఖరారు చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు, గ్రామీణంలో మూడు రెట్లు అధికంగా చెల్లించనున్నట్లు తెలిసింది. కాగా, పరిహారం చెల్లింపుల కోసం, బ్యాంకుల్లో రుణాల కోసం ఎవరైనా రిజిస్ట్రేషన్ విలువను ఎక్కువగా చూపారా? అన్న కోణంలోనూ వివరాలను సేకరించనున్నట్లు సమాచారం.



లలితా జువెలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో అధినేత కిరణ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రాష్ట్రంలో బంగారం, వెండి వస్తువుల.. పరిశ్రమను ఏర్పాటు చేయండి

» రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
» 2500 కోట్లతో తయారీ హబ్ ఏర్పాటు
» లలితా జువెలరీస్ అధినేత కిరణ్

జీడిమెట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంగారం, వెండి వస్తువుల తయారీ పరిశ్రమలను తెలంగాణలో ఏర్పాటు చేసి తరతరాలుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న స్వర్ణకారులకు, వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. జీడిమెట్ల సుచిత్ర ప్రాంతంలో లలితా జువెలరీ అధినేత కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 55వ షాపు ప్రారంభోత్సవానికి శ్రీధర్‌బాబు ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ లో బంగారు ఉత్పత్తుల తయారీ కంపెనీలు ఏర్పాటు చేసేవారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. లలితా జువెలరీ అధినేత కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో 2500 కోట్ల రూపాయల వ్యయంతో బంగారు వస్తువుల ఉత్పత్తి హబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మరో మూడు ప్రాంతాల్లో త్వరలోనే షోరూమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, సినీ నిర్మాత బండ్ల గణేష్ పాల్గొన్నారు.

బాలికపై కేంద్ర ప్రభుత్వోద్యోగి అత్యాచారం

» నెల రోజులలో రెండుసార్లు ఘాతుకం
» సైదాబాద్‌లో ఘటన.. అరెస్టు చేయని పోలీసులు

సైదాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఓ బాలిక (12)పై కామంతో కన్నుమూసుకుపోయిన ఓ ప్రభుత్వోద్యోగి (58) అత్యాచారానికి ఒడిగట్టాడు. నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు లైంగిక దాడి చేశాడు. సైదాబాద్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొదటిసారి భయపడి తల్లిదండ్రులకు చెప్పని బాలిక ఈ నెల 11వ తేదీన చాక్లెట్లు కొనడానికి కిరాణా దుకాణానికి వెళ్లిన సమయంలో ఇంట్లోకి పిలిచి రెండోసారి అతడు ఘాతుకానికి పాల్పడడంతో ఏడ్చుకుంటూ వెళ్లి తన తల్లికి విషయం తెలిపింది. బాలిక తల్లి అదే రోజు సైదాబాద్ పోలీసులను ఆశ్రయించింది. మొదట వారు కేసు నమోదు చేయకుండా కాలయాపన చేశారని, చివరకు ఓ పోలీస్ అధికారి ఒత్తిడితో 13వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిసింది. నిందితుడు కేంద్ర రక్షణ రంగ సంస్థ ఉద్యోగి కావడంతో అతడిపై కేసు నమోదు కాకుండా పలు ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. ఓ ఎస్సై స్వయంగా రంగంలోకి దిగి బాధిత బాలిక తల్లిదండ్రులతో రాజీకి ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. పోలీసులు కేసు వివరాలు గోప్యంగా ఉంచడం, నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అమ్మ అంత్యక్రియలకు కూతురి భిక్షాటన

» నిర్మల్ జిల్లాలో ఒంటరి మహిళ ఆత్మహత్య
» అంతిమసంస్కారాల నిర్వహణకు ఆమె 11 ఏళ్ల కుమార్తె ప్రయాస
» 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కథనంతో పలువురి సాయం

తానూర్, ఆగస్టు 18 : ఎప్పుడో లోకం తెలియని సమయంలో తండ్రిని కోల్పోయిన ఆ బాలికను పదేళ్లుగా అమ్మే అన్నీతానై పెంచింది. కాయకష్టం చేస్తూ బిడ్డను సాకిన ఆ తల్లి మద్యానికి బానిసై కుటుంబ భారం మోయలేక ఆత్మహత్య చేసుకుని.. కన్నకూతురిని అనాథగా వదిలేసి వెళ్లిపోయింది. తనని అనాథ చేసి వెళ్లిపోయిన అమ్మ అంత్యక్రియల నిర్వహణకు ఆ చిన్నారి పడకూడని కష్టం పడింది. చేతిలో డబ్బు లేకపోడంతో భిక్షాటన చేసింది.. మానవత్వం ఉన్న ప్రతీ గుండెను కదిలించే ఈ ఘటనపై 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' చానల్‌లో కథనం ప్రసారమవ్వగా స్పందించిన పలువురు ఆ బాలికకు అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. నిర్మల్ జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన మేర గంగామణి(36) భర్త పదేళ్ల క్రితం చనిపోగా దుర్గ(11) అనే కుమార్తె ఉంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గంగామణి మద్యానికి బానిసైంది. ఈ క్రమంలో కుటుంబపోషణ భారంగా మారగా.. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉరి వేసుకుని చనిపోయింది. దీంతో దుర్గ అనాథగా మిగిలిపోయింది. అయితే, తల్లి అంత్యక్రియలకు డబ్బు లేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. ఇందుకు సంబంధించి ఫొటోలను గ్రామానికి చెందిన యువకులు సోషల్ మీడియాలో పెట్టడంతో పలువురు ఆర్థిక సాయం చేశారు. అలాగే, ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో కథనం ప్రసారం కావడంతో స్పందించిన విజయవాడ నేషనల్ లితో ప్రింటర్స్ అధినేత వెంకటేశ్వర రావు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే, ముథోల్ సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది రూ.8వేలు, బేల్‌తరోడా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గజానంద్ రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. అందరి సాయంతో గంగామణి అంత్యక్రియలు పూర్తయ్యాయి. అయితే, అనాథగా మిగిలిన దుర్గకు దాతలు ఎవరైనా సాయం చేయాలనుకుంటే గూగుల్‌పే నెం. 96766 36843 ద్వారా ముండె ఈశ్వర్(స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు)కు అందించాలని గ్రామ ప్రజలు తెలిపారు. కాగా, గంగామణి ఆత్మహత్యపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ముథోల్ సర్కిల్ పోలీసు సిబ్బంది

ఆకాశమంత ఎత్తు.. ఆరోగ్యం చిత్తు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించగానే.. పునాదులు కూడా వేయకుండానే.. అలా వాటిలో ఫ్లాట్లను హాట్‌కేకుల్లా కొనేస్తున్నారు. ఈ అభివృద్ధిని ఆపడం అసాధ్యం. కానీ.. ఆకాశహర్మ్యాలు అందరికీ సరిపడకపోవచ్చని.. కొంతమందికి ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు.. 'దిల్‌బర్', 'వాస్తే' వంటి మెగాహిట్ పాటలతో బహుళ ప్రజాదరణ పొందిన పాప్ గాయని ధ్వని భానుశాలి ముంబైలో ఒక ఆకాశహర్మ్యంలో 76వ అంతస్తులో ఫ్లాట్ తీసుకున్నారు! ఆ ఫ్లాట్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ చేయడానికి వెళ్లిన బృందంలో కొందరికి తీవ్రమైన తలనొప్పి వచ్చింది. కారణాలను ఆరాతీయగా.. అంత ఎత్తున ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉండడమే కారణమని తేలింది. సాధారణంగా.. ఎత్తైన ప్రాంతాలకు వెళ్లినప్పుడు కొందరికి శ్వాస సమస్యలు వస్తుంటాయి. సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లే కొద్దీ గాలి పల్చబడి ఆక్సిజన్ స్థాయిలు తగ్గడమే దీనికి కారణం. అయితే, ఆరోగ్యవంతుల శరీరాలు.. మారే వాతావరణ పరిస్థితికి అనువుగా మారుతాయి. శరీరం ఇలా సర్దుబాటు చేసుకోవడాన్ని 'ఎక్లైమెటైజేషన్' అంటారు. ఈ సామర్థ్యం అందరికీ ఒకేలా ఉండదు. వ్యక్తుల వయసు, ఆరోగ్యం వంటివి ఈ సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. ఆస్తమా వంటి సమస్యలున్నవారికి ఎక్లైమెటైజేషన్ కెపాసిటీ తక్కువగా ఉంటుంది. అలాంటివారు 30 అంతకు మించి అంతస్తులుండే భారీ భవనాల్లో ఎక్కువకాలం ఉంటే 'హైపోక్సియా' బారిన పడే ప్రమాదం ఉంది. అంటే శరీరంలోని కణాలకు తగినంత ప్రాణవాయువు అందకపోవడం. "హైపోక్సియా వల్ల.. శ్వాస పీల్చుకోవడం కష్టమవుతుంది. హృదయ



స్పందన వేగం, రక్తపోటు పెరుగుతాయి. ఎక్కువగా రాత్రిపూట ఇలాంటి సమస్యలు వస్తాయి" అని ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ మనోజ్ పవార్ వెల్లడించారు. దీర్ఘకాలంపాటు (క్రానిక్) హైపోక్సియాకు గురయ్యేవారిలో.. ఆ ప్రభావం గుండె ఆరోగ్యంపైనా పడుతుందని, నిద్రలేమి వంటి సమస్యలు చుట్టుముడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, హృద్రోగాలతో, శ్వాససమస్యలతో బాధపడేవారి ఈ సమస్య ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. "8000 అడుగులు (అంటే దాదాపు 80 అంతస్తులు) అంతకుమించి ఎత్తైన భవనాల్లో నివసించేవారిలో ఈ ఆరోగ్య సమస్యలు మరింత గణనీయంగా కనిపిస్తాయి. ఊపిరి ఆడకపోవడం, అలసట, తలనొప్పి వంటి ఇబ్బందులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వారి మెదడు పనితీరుపైనా ప్రభావం పడుతుంది. 10,000 అడుగులు (అంటే 3000 మీటర్లు- దాదాపు 100 అంతస్తులు) దాటితే.. ముందే రకరకాల అనారోగ్యాలతో బాధపడే వృద్ధుల్లో ఈ ముప్పు మరింత పెరుగుతుంది" అని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. నిజానికి ఇలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకుగాను.. హైరైజ్ భవనాలు నిర్మించేటప్పుడు.. వాయు నాణ్యతను నియంత్రించే అత్యంత అధునాతన విధానాలను బిల్డర్లు పాటిస్తుంటారు. అలాంటివి పాటించకుండా నిర్మించే భవనాల్లో.. శ్వాసకోశ, గుండె సంబంధిత జబ్బులున్న వారు 30కి మించి అంతస్తుల్లో ఎక్కువకాలం నివాసం ఉంటే వారి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

- సెంట్రల్ డెస్క్

పలు అధ్యయనాలు..

ఆకాశహర్మ్యాల్లో నివసించడం వల్ల ఆరోగ్యంపై ఏవైనా దుష్ప్రభావాలు పడతాయా? అనే అంశంపై గతంలో చాలా పరిశోధనలు జరిగాయి. ఉదాహరణకు 2011లో చైనాలో వైద్యనిపుణులు 46 అంతస్తుల భవనంలో నివసించేవారి హృదయస్పందనల్లో తేడాలపై పరిశోధన చేశారు. 31 అంతస్తుల లోపు ఉండేవారితో పోలిస్తే.. 32 నుంచి 46వ అంతస్తుదాకా ఉండేవారిలో హార్ట్ రేట్ వేరియబిలిటీ (హెచ్ఆర్‌వీ) పెరుగుతున్నట్టు వారి పరిశోధనలో వెల్లడైంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, వారి వయసు.. ఇలా చాలా కారణాలు హెచ్ఆర్‌వీని ప్రభావితం చేస్తున్నట్టు గుర్తించారు. అలాగే.. ఆకాశహర్మ్యాల్లో నివసించేవారిలో అధిక రక్తపోటు ఎందుకు వస్తోందన్న అంశంపై 26 సంవత్సరాల క్రితమే జపాన్‌లోని టొకాయ్ యూనివర్సిటీ మెడికల్ స్కూలుకు చెందిన ఫ్యుమియో ఒసాకా చేసిన పరిశోధన కూడా ఆసక్తికరం. ఎత్తైన భవనాల్లో నివసించేవారిలో 50 ఏళ్లు దాటిన మహిళలు హైబీపీ బారిన పడే ముప్పు ఎక్కువని ఆ పరిశోధనలో తేలింది. అయితే, దీనికి కారణం ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉండడం కాదు. కేవలం జీవనశైలి సమస్య. అంత ఎత్తున ఉండేవారు పదేపదే కిందకి దిగలేరు. దిగాలంటే తప్పనిసరిగా లిఫ్ట్ వాడాల్సిందే. ఫలితంగా వారు ఎక్కువకాలం అలా ఇంట్లోనే ఉండిపోవాల్సి వస్తుంది. బయటకు వెళ్లి పచ్చిగాలి పీల్చి, కాసేపు అలా తేలికపాటి వ్యాయామాలు చేసే అవకాశం ఉండదు. ఒక ఇరుకైన ప్రదేశంలో ఎక్కువకాలం ఉన్న భావనతో వారిలో ఆందోళన పెరుగుతుంది. దీన్ని 'సెల్ఫ్ ఇండ్యూస్డ్ క్యాబిన్ ఫీవర్' అంటారు. కాబట్టి, ఎత్తైన భవనాల్లో ఉన్నా కొద్దిగా ఓపిక చేసుకుని కిందకు వెళ్లి వాకింగ్, జాగింగ్ వంటివి చేయడం.. నలుగురితో కలిసి మాట్లాడడం వంటివి చేస్తే మంచిదని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అలాగే.. శ్వాస సమస్యలతో, హృద్రోగాలతో బాధపడేవారు ఆకాశహర్మ్యాల్లో ఉండాలనుకుంటే/ఫ్లాట్ కొనాలనుకుంటే.. వైద్యులను ఒకసారి సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

డ్రైవింగ్‌లో నిద్ర వస్తే.. లేపే కళ్లజోడు

» అంధులను అప్రమత్తం చేసే చేతికర్ర
» భూమి కింద అనువైన ఇంటి నిర్మాణం
» ఐఐటీహెచ్‌లో విద్యార్థుల ఆవిష్కరణలు

కంది, ఆగస్టు 18: కారు డ్రైవ్ డ్రైవ్ చేసే సమయంలో మనకు నిద్ర వస్తే వెంటనే అప్రమత్తం చేసే ఏర్పాటేదైనా ఉంటే? మీటర్ దూరంలో ఉన్న అడ్డంకులను కూడా ముందే గుర్తించి శబ్దం చేసే చేతికర్ర అంధుల వద్ద ఉంటే? ...అద్భుతమైన ఆలోచనలు కదూ! రాష్ట్రంలోని 18 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇలాంటి ఆలోచనలకు పదును పెట్టి.. వాటిని ఆవిష్కరణల రూపంలో అందుబాటులోకి తెచ్చారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ వారి ఆవిష్కరణలకు వేదికైంది. 'ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ ఫెయిర్' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. ఆయా పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు రూపొందించిన వినూత్న వస్తువులను ప్రదర్శించారు. డ్రైవర్లకు నిద్ర వస్తే వెంటనే అప్రమత్తం చేసే 'యాంటీ స్లీప్ డిటెక్టర్' కళ్లజోడును వంచబొల్లారానికి చెందిన ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అభివృద్ధి చేశారు. అలాగే.. అంధులకు ఎంతగానో ఉపయోగపడే 'ఎంపవరింగ్ స్టిక్‌ను' హైదరాబాద్‌లోని ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి వివాన్ రూపొందించాడు. పీవీసీ పైపులకు యూవీఆర్ సెన్సర్లను అమర్చి దీన్ని తయారుచేశాడు. ఈ కర్ర పట్టుకొని నడిచేటప్పుడు.. ఏదైనా అడ్డం వస్తే ఒక మీటర్ దూరం నుంచే ఆ కర్ర దాన్ని గుర్తించి గట్టిగా బీప్ శబ్దం చేస్తుంది. ఇక.. యాప్రాల్‌లోని ఇండస్ యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు పెద్ద పెద్ద పట్టణాలు, నగరాల్లో భూమిలోపల ఇళ్లు నిర్మించే ప్రాజెక్టును ఆవిష్కరించారు. దాదాపు 750 చదరపు గజాల్లో గాలి, వెలుతురు తగిలే ఇంటి డిజైన్‌ను రూపొందించారు. ఇలా భూమి లోపల ఇళ్లు నిర్మిస్తే ఖర్చు తక్కువ అని, భూమి పైన ఉన్న స్లమ్ ఏరియాను ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8, 9, 10 తరగతి విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికే ఈ పోటీలు నిర్వహించామని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.



ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తయారుచేసిన 'యాంటీ స్లీప్ డిటెక్టర్' కళ్లజోడు



ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థి రూపొందించిన 'ఎంపవరింగ్ స్టిక్'

గుడిలో దళితుల పెళ్లికి పూజారి అభ్యంతరం

» ఆలయానికి తాళం వేసి వెళ్లిపోయిన వైనం
» గేటు ముందే ఆ జంటకు పెళ్లి చేసిన పూజారి కుమారుడు

కృష్ణ, ఆగస్టు 18: పెళ్లి చేసుకుందామని కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చిన ఓ దళిత జంటకు నిరాశ ఎదురైంది. ఆలయం లోపల వివాహం చేసుకునేందుకు అనుమతించమంటూ పూజారి ఆ గుడికి తాళం వేసి వెళ్లిపోయాడు. దీంతో ఆ పూజారి కుమారుడే ఆలయ గేటు వద్ద ఆ జంటకు పెళ్లి చేశారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. ముడుమాల్‌కు చెందిన ఓబులేశ్, హిందూపూర్ గ్రామానికి చెందిన పద్మతో ఆదివారం 10.30 గంటలకు గ్రామంలోని యాదవేంద్రస్వామి ఆలయంలో వివాహం చేసేందుకు ఇరుకుటుంబాలు నిర్ణయించుకున్నాయి. ఇందుకోసం ఇరుకుటుంబాల వారు ఆదివారం ఉదయమే వధూవరులతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. అయితే, ఆలయంలో పెళ్లికి పూజారి చక్రపాణి అభ్యంతరం తెలపగా.. పెళ్లికి వచ్చిన వారు అతనితో వాగ్వాదానికి దిగారు. దీంతో పూజారి ఆలయానికి తాళం వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పూజారి కుమారుడు వధూవరులను ఆలయం గేటు ముందు కూర్చోపెట్టి పెళ్లి తంతు పూర్తి చేశారు. దీనిపై పూజారి చక్రపాణిని 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. మంత్రాలయం పీఠాధిపతి ఆదేశం మేరకు ఆలయంలో పెళ్లిళ్ల నిర్వహణకు అనుమతించడం లేదని తెలిపారు.

పబ్‌లు, బార్‌లలో ఎక్సైజ్ పోలీసుల దాడులు

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వారాంతం నేపథ్యంలో డ్రగ్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించారు. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ ఖురేషీ ఆదేశాలతో.. అసిస్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, అనిల్ కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్ నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 25 బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధుల్లోని 25 ప్రముఖ పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఆకస్మిక దాడులు చేశారు. హైదరాబాద్ పరిధిలో 12, రంగారెడ్డి జిల్లా పరిధిలో 13 ప్రాంతాల్లో శనివారం రాత్రి 10 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు తనిఖీలు జరిపినట్లు అధికారులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులకు 12-ప్యానెల్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. ఇకపై వారాంతాల్లో ఆకస్మిక తనిఖీలను కొనసాగిస్తామని కమలాసన్‌రెడ్డి మీడియాకు తెలిపారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

» కరెంట్ షాక్‌తో ఇద్దరు అన్నదాతల మృతి

వేలేరు/దస్తురాబాద్/ధారూరు/మేడారం, ఆగస్టు 18 : వ్యవసాయంలో నష్టాలు రావడంతో సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మరోవైపు, కరెంటు షాక్‌తో ఇద్దరు అన్నదాతలు చనిపోయారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బండ కృష్ణ(45) పదెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రెండు పంటలు ధ్వంసమై నష్టపోవడం.. ఇటీవల చిన్న కుమారుడు అనారోగ్యం బారిన పడటంతో రూ.8 లక్షల వరకు అప్పు అయ్యింది. దీంతో మనస్తాపం చెందిన కృష్ణ.. ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం శాలపల్లికి చెందిన దామెర అనిల్ కుమార్(31) గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీనికి తోడు చెల్లెలి పెళ్లి, కుటుంబ అవసరాల కోసం మరో రూ.3.50 లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనోవేదనతో అనిల్ శనివారం అర్ధరాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. నిర్మల్ జిల్లా ఎర్రగుంట గ్రామానికి చెందిన అజ్మీరా రాజేష్(31) పొలంలో పెరిగిన గడ్డిని ఆదివారం కోస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే పొలంలో తెగిపడిన విద్యుత్ వైరు కాలికి తగలడంతో షాక్‌తో మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన గుర్రం రవీందర్(27) ఓ ఫాంహౌస్‌లో పని చేస్తున్నాడు. దాని వెనకనే రవీందర్‌కు ఓ గేదెల షెడ్డు ఉంది. శనివారం రాత్రి ఫాంహౌస్‌కు చేరుకున్న రవీందర్.. ఆ వెనకనే ఉన్న తన గేదెలను చూసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడున్న కరెంటు స్తంభానికి తాకి విద్యుదాఘాతంతో చనిపోయాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.